# జనబలం

ప్రజలే ప్రభువులు


ఏప్రిల్ 2023 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-



## అంబేద్కర్ - దామాషా ఎన్నికల పద్ధతి



## రాహుల్‌పై అనర్హత వేటు తొందరపాటు




## చిన్న పట్టణాల అభివృద్ధి - యువ భారత్‌కి రహదారి












## తార్కిక శక్తి, సాంకేతికత, విజ్ఞత, సంప్రదాయంలోని మంచి, సమాజంతో అనుసంధానం నిజమైన విద్య: జేపీ

తల్లిదండ్రులు పిల్లల మార్కులు, ర్యాంకుల గురించి అతిగా పట్టించుకోనక్కర్లేదని.. తార్కిక శక్తి, సాంకేతికత, విజ్ఞత, సమాజంతో అనుసంధానం, సంప్రదాయంలోని మంచితో కూడిన నిజమైన విద్యతో పిల్లలు ఎదిగేలా చూడాలని, సమాజంలోని కృత్రిమ విభజనల్ని ఛేదించే శక్తిని వారిలో పెంపొందించాలని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు. కాకినాడలో ఆదిత్య పాఠశాల, ఇంజినీరింగ్ కళాశాల, బిజినెస్ స్కూల్ నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. యువత ప్రాంతాలు, భాషలు, కులాలు, మతాల, పార్టీలపరంగా విభజనలతో సమయం వృథా చేసుకోకుండా, సమాజానికి ఉపయోగపడుతూ దీర్ఘకాలిక దృక్పథంతో సంపద సృష్టిలో భాగస్వాములవ్వాలని, అప్పుడు యువ జనాభా అత్యధికంగా ఉన్న సానుకూలత దేశాభివృద్ధికి కూడా దోహదం చేస్తుందన్నారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి, డైరెక్టర్ శృతి, వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి, కాకినాడ రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు వై.డి రామారావు, లోక్‌సత్తా సమన్వయకర్త మాచిరాజు, ప్రిన్సిపల్స్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.





ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక


సంపుటి 25 సంచిక 4

ఏప్రిల్ 2023

సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్


## జనబలం చందా రుసుము వివరాలు


| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్





కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

# మీడియాపై పెరుగుతున్న వత్తిడుల ముప్పు

సంపాదకీయం

భారతదేశంలో మీడియా స్వేచ్ఛకు ముప్పు పెరిగిపోతున్నదని పలు అంతర్జాతీయ సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. 'రిపోర్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్' సంస్థ ప్రతి ఏటా విడుదల చేసే 'మీడియా స్వేచ్ఛ సూచిక'లో భారత్ స్థానం నానాటికీ దిగజారుతోంది. నూట ఎనభై దేశాల జాబితాలో పదిహేనేళ్ల క్రితం భారత్ స్థానం 100 దగ్గర ఉండేది. 2021లో అది 142కు చేరగా 2022లో 150కి పడిపోయింది. రాజకీయ, ఆర్థిక, సామాజిక, ఒత్తిళ్లు లేకుండా పాత్రికేయులు పనిచేయగలగడం, పాత్రికేయుల భద్రత , పాత్రికేయుల పని పరిస్థితులు, ప్రభుత్వాల, యాజమాన్యాల ధోరణులు వంటి అంశాలను పరిగణనలోనికి తీసుకుని 'మీడియా స్వేచ్ఛ' సూచికను రూపొందిస్తారు.

'ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ జర్నలిస్ట్స్' సంస్థ 2023 ఫిబ్రవరిలో విడుదల చేసిన అధ్యయనంలో భారత్‌కు సంబంధించిన ప్రస్తావనలు సమస్యలోని మరో కోణాన్ని వెల్లడించాయి. భారతీయ సామాజిక మాధ్యమాలలో మహిళా జర్నలిస్టులపై సాగుతున్న ఆన్‌లైన్ దాడుల గురించిన సమాచారం ఆందోళన కల్గించేదిగా ఉంది. సంప్రదాయక మీడియాలో పనిచేస్తూ తమకంటూ గుర్తింపు తెచ్చుకున్న మహిళా జర్నలిస్టులపై ఉద్దేశ్యపూర్వకంగా ఒక పథకం ప్రకారం ఆన్‌లైన్ దాడులు జరుగుతున్న తీరును ఆ అధ్యయనం వెల్లడించింది.

భారతీయ మీడియాలో ముఖ్యంగా సామాజిక మాధ్యమాలలో పెరిగిపోతున్న 'ఫేక్ న్యూస్' బెడద గురించి బీబీసీ చేసిన అధ్యయనం విస్తుగొలుపేదిగా ఉంది. బహిరంగ చర్చలోని అంశాలను వక్రీకరిస్తూ, తప్పుడు సమాచారాన్ని పనిగట్టుకు వ్యాప్తి చేసే ధోరణి విపరీతంగా ఉందని, తాము పరిశీలించిన వార్తలలో 90 శాతం 'ఫేక్' అని బీబీసీ అధ్యయనం తేల్చింది.

భారతీయ పాత్రికేయులపై నిర్బంధాలు, దాడులు, అక్రమ కేసులు పెరుగుతున్నాయని 'డోయిచ్‌వెల్లె' మీడియా సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. భారత్‌లో ప్రభుత్వ సంస్థలనుండి, భద్రతాదళాల నుండి పాత్రికేయులు ఎదుర్కొంటున్న తీవ్ర నిర్బంధకాండ గురించి 'అల్‌జజీరా' సంస్థ కూడా పేర్కొన్నది. భారత్‌లో మీడియా రంగంలోని పెట్టుబడులు కొద్దిమంది వ్యక్తుల చేతుల్లో కేంద్రీకృతం అయిపోతున్నాయని, దాంతో వైవిధ్యమూ, బహుళత్వమూ, భిన్నాభిప్రాయాలూ కనుమరుగై పోయే ప్రమాదం ముంచుకొచ్చిందని 'డోయిచేవెల్లె' వ్యాఖ్యానించింది.

భారతీయ మీడియారంగం ఎదుర్కుంటున్న సమస్యల గురించి అంతర్జాతీయ విమర్శలకు మన స్పందన పేలవంగా ఉంది. త్వరలో విశ్వగురు స్థానానికి చేరుకోబోతున్న భారత్‌ను చూసి ఓర్వలేక పాశ్చాత్య సంస్థలు అభాండాలు వేస్తున్నాయని మన పాలకపక్షం పెద్దలు వ్యాఖ్యానించారు. మీడియా రంగంలో సమస్యలు ఉన్నాయన్న వాస్తవాన్ని నిరాకరించే వైఖరివల్ల పరిష్కారాలు దొరకవు.

నిజానికి మీడియారంగం మున్నెన్నడూ లేని సంక్షోభాన్ని ఎదుర్కుంటున్నది. మీడియా విశ్వసనీయత ప్రశ్నార్థకం అయ్యింది. పాత్రికేయులు స్వేచ్ఛగా పనిచేయలేని పరిస్థితులు నెలకొని ఉన్నాయి. పాత్రికేయులపై దాడులు పెరుగుతున్నాయి. ప్రభుత్వ, ప్రభుత్వేతర శక్తుల ఒత్తిళ్లు పెరిగిపోతున్నాయి. పాత్రికేయులపై జరిగిన దాడులకు సంబంధించి నమోదవుతున్న కేసుల్లో 94శాతం ఎఫ్.ఐ.ఆర్ దశలోనే ఆగిపోయి ఉన్నాయని ప్రెస్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా నియమించిన కమిటీ తన నివేదికలో పేర్కొన్నది. పాత్రికేయులు గౌరీలంకేశ్ కేసు అలాంటి కేసుల్లో తాజా ఉదాహరణ మాత్రమే. యూపీలో హత్రాస్ ఘటనను రిపోర్టు చేయడానికి కేరళ నుంచి వెళ్లిన జర్నలిస్టు సిద్దికీ కప్పన్ ఉదంతం సిగ్గు చేటయినది. అతనిపై ఛార్జిషీటు పెట్టకుండా రెండేళ్లకు పైగా జైల్లో పెట్టడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. జమ్మూ-కాశ్మీర్‌లో నెలల తరబడి ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం, ప్రభుత్వం ఇచ్చే సమాచారాన్ని మాత్రమే ప్రచురించాలని ఒత్తిడి చేయడం, పత్రికా సంస్థలపై దాడులు చేయడం, అరెస్టులు చేయడం నిత్యకృత్యంగా మారాయి.

"మన మీడియాలో ఇటీవల విద్వేష ప్రచారానికి ఇస్తున్న ప్రాధాన్యం పెచ్చుమీరిపోతున్నది. అసత్యాలు, వక్రీకరణలతో వ్యాప్తి చేస్తున్న ప్రచారం వల్ల సమాజంలో ఘర్షణలు, మూకదాడులు, హత్యలు జరగడం చూస్తున్నాం" అని ట్రాయ్ విడుదల చేసిన తాజా కన్సల్టేటివ్ పేపర్‌లో పేర్కొన్నది. విద్వేష ప్రచారానికి తావిస్తున్న కార్యక్రమాలు ప్రసారం చేస్తున్నందుకు దేశంలోని అతిపెద్ద మీడియా సంస్థలకు భారీ జరిమానా విధిస్తూ న్యూస్‌బ్రాడ్ కాస్టింగ్ అండ్ డిజిటల్ స్టాండర్డ్స్ అథారటీ తీసుకున్న చర్య కేవలం కంటినీటి తుడుపు మాత్రమే! విద్వేష ప్రచారాన్ని ఆయా సంస్థలు ఆపలేదు.

దేశంలో మీడియా విస్తరణ మరింత వేగం పుంజుకుంటున్నది. వినోద, సమాచార రంగంలో పెట్టుబడులు ఐదు లక్షల కోట్లకు చేరుకోనున్నాయి. సమాచార సేకరణ, కంటెంట్ ప్రొడక్షన్, సమాచార ప్రసార సాధనాలు కొందరు వ్యక్తుల చేతుల్లో కేంద్రీకృతం అవతున్న ధోరణి ప్రస్ఫుటంగా కన్పిస్తోంది. స్వేచ్ఛా మార్కెట్‌లో అందరూ పాల్గొనే స్వేచ్ఛకూ, పోటీకి అవరోధాలు ఏర్పడుతున్నాయి. పెట్టుబడి స్వేచ్ఛకూ, మీడియా స్వేచ్ఛకు ఎదురవుతున్న సవాళ్లను, మీడియా సమస్యలనూ అధ్యయనం చేయడానికి చట్టబద్ధమైన మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలన్న జర్నలిస్టుల డిమాండ్‌కు పౌరసమాజం మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉంది. మీడియా సంస్థల పెట్టుబడులలో అధికభాగం కార్పొరేట్, రాజకీయ శక్తుల చేతుల్లోనే ఉన్నాయి. జస్టిస్ రాజాధ్యక్ష సారథ్యంలో ఏర్పడిన మొదటి ప్రెస్‌కమిషన్ మీడియాకు- పరిశ్రమలకు మధ్య అనుబంధం లేకుండా చూడాలని చెప్పింది. ఆచరణ సాధ్యం కాదన్న భావనతో ఆ సూచనను వదిలేశారు. మొదటి ప్రెస్‌కమిషన్ సిఫార్సుల మేరకు ఏర్పడ్డ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు తగిన అధికారాలు లేకపోవడంతో నామమాత్రంగా మిగిలింది. దానిపై ప్రభుత్వ పెత్తనం పెంచుకునే విధంగా కౌన్సిల్ సభ్యుల నియామక ప్రక్రియను ఇటీవల మార్చారు.

1956 నాటి వర్కింగ్ జర్నలిస్టు చట్టాన్ని గత సంవత్సరం రద్దు చేశారు. దాంతో పాత్రికేయుల వేతనాలను నిర్ణయించే వేజ్ బోర్డు కూడా రద్దయ్యింది. పాత్రికేయరంగాన్ని, పాత్రికేయులను, స్వతంత్ర వ్యవస్థలుగా ఉంచాలన్న నాటి ఆలోచనలకు ప్రస్తుతం చరమగీతం పాడారు.

మీడియారంగం నిష్పాక్షికంగా, స్వతంత్రంగా పనిచేయడానికి, పెడధోరణులను సరిచేయడానికీ, పాత్రికేయులకు భద్రత కల్పించడానికి, మీడియాలో గుత్తాధిపత్యం లేకుండా నివారించడానికి తగిన చర్యలు చేపట్టాలి. చట్టబద్ధమైన మీడియా కమిషన్ ఏర్పాటు చేయడం ఆ దిశలో తొలి అడుగుకాగలదు.

డి. సోమసుందర్

# గ్రామాల మధ్య చిన్న పట్టణాల అభివృద్ధి..

# యువ భారత్‌కి రహదారి

-డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-

ఆధునికత, ఆర్థిక వృద్ధి వల్ల అనివార్యంగా చోటుచేసుకునే పరిణామం పట్టణీకరణ. భారతదేశంలో కూడా కొన్ని దశాబ్దాలుగా పట్టణీకరణ వేగంగా జరుగుతోంది. 1961లో మన పట్టణ జనాభా 18% ఉండగా, 2021లో ఆ వాటా 34.2% దాకా ఎగబాకింది. ఈ వ్యవధిలో భారతదేశ జనాభా మూడు రెట్లు పెరిగి 45.6 కోట్ల నుంచి 140.75 కోట్లు అయ్యింది. గత 60 ఏళ్లలో మన పట్టణ జనాభా ఆరు రెట్లుకి పైగా పెరిగింది. 2014లో చైనా (56%), బ్రెజిల్ (86%), ఇండొనేషియా (54%) లలో పట్టణ జనాభా భారత్ కంటే ఎంతో ఎక్కువ. ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోలిస్తే మనం ఇప్పటికీ గ్రామీణ దేశమే. అయితే ఆర్థిక వృద్ధి వేగంగా జరుగుతున్నందున భారత్‌లో వచ్చే మూడు దశాబ్దాలలో గ్రామాల నుంచి పట్టణాలకు భారీ వలసలు ఉంటాయి.



మన దేశంలో దాదాపు 6,00,000 గ్రామాలున్నాయి. అక్కడక్కడా విసిరేసినట్లుండే చిన్న జనావాసాల్ని కూడా లెక్కేస్తే గ్రామీణ నివాస ప్రాంతాల సంఖ్య 10 లక్షలు దాటుతుంది. గ్రామాల్లో నివసించే 910 మిలియన్ల మంది ప్రజలకి వ్యవసాయం ద్వారా తగిన ఉపాధి కల్పించటం ఏ రకం చూసినా సాధ్యం కాదు. కాబట్టి ప్రజలు ఉపాధి అవకాశాలు, మెరుగైన జీవనం కోసం పట్టణాలు, నగరాలకు వలస పోతున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం, చట్ట రీత్యా పట్టణాలు 4041, జనాభా ప్రకారం పట్టణాలు 3784 (5000కు పైగా జనాభా, వారిలో 75% పైగా పురుషులు వ్యవసాయేతర వృత్తులలో ఉన్న గ్రామాలు) భారత్‌లో ఉన్నాయి.

ఈ పట్టణ ఆవాసాలు, పట్టణాలు ఏళ్లు గడుస్తున్నకొద్దీ పెరుగుతున్నాయి. అయితే చిన్న పట్టణాలలో సౌకర్యాలు, అవకాశాలు మాత్రం మెరుగుపడటం లేదు. దీంతో, జీవనోపాధుల కోసం ప్రజలు ఎక్కడో దూరాన ఉన్న పెద్ద నగరాలకు పెద్ద సంఖ్యలో వలస వెళ్లక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయి. 2018లో భారత్‌లో 1 కోటి కంటే ఎక్కువ జనాభా ఉన్న నగరాలు అయిదు ఉండగా.. 50 లక్షల నుంచి కోటి మధ్య జనాభా ఉన్న నగరాలు నాలుగు, 10 నుంచి 50 లక్షల జనాభా ఉన్న నగరాలు 52 ఉన్నాయి. మన దృష్టి, అభివృద్ధి ప్రయత్నాలు ఎక్కువగా ఈ పెద్ద నగరాల మీదే కేంద్రీకృతం కావటంతో పేదలు, తక్కువ నైపుణ్యాలున్న ప్రజలు మనుగడ కోసం ఉన్నకొద్దీ దూర ప్రాంత నగరాలకు వలస పోవాల్సి వస్తోంది. తక్కువ ఆదాయం వచ్చే ఉద్యోగాల్లో వీళ్లు పనిచేస్తుంటారు. ఇల్లు, నీటి సరఫరా, పారిశుద్ధ్యం, పనిచేసే చోటుకి వెళ్లిరావటం వంటివి వీరికి రోజూ కత్తి మీద సామే.

వలస వచ్చినవాళ్లను నగరవాసులు బయటివారన్నట్లు చూస్తారు. సామాజిక మద్దతునిచ్చే వ్యవస్థలేవీ వీరికి ఉండవు. ఉద్యోగం పోవటం, అనారోగ్యం పట్టణ పేదల పాలిట శాపంగా మారుతుంటాయి. గ్రామీణ పేదలు పెద్ద నగరాలకు వలస వెళ్తుండటం వల్ల భారత్‌లో పట్టణ పేదరికం పెరుగుతోంది. 2020లో కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో పట్టణ పేదల దుర్భర కష్టాలు మొత్తం దేశానికి తెలిసొచ్చాయి. పెద్ద నగరాలకు వలస వచ్చిన దాదాపు 4 కోట్ల మంది పేదలు విధి లేని, దయనీయ పరిస్థితుల్లో తమ గ్రామాలకు తిరుగుబాట పట్టారు. వారి కష్టాలు, నడక యాతనల దృశ్యాలు మనందరినీ కదిలించాయి, మనసులపై చెరగని ముద్ర వేశాయి.

ఆధునిక ప్రపంచంలో పెద్ద నగరాలు అవసరం. అయితే, తక్కువ నైపుణ్యాలున్న ప్రజానీకం పొలోమంటూ పెద్ద నగరాలకు తరలి వెళ్లటం అర్థరహితం. ఆర్థిక, జనాభాపరంగా ఇందుకు ఎటువంటి సహేతుక కారణం కనిపించదు. ఉన్నతస్థాయి నైపుణ్యాలున్న ఓ యూనివర్సిటీ ప్రొఫెసర్, ఆధునిక సాంకేతికత పరిశోధకుడు, ఆరోగ్య రంగంలో సూపర్ స్పెషలిస్ట్, ఓ ఉన్నత స్థాయి మేనేజర్ లేదా పెద్ద ఇన్వెస్టర్ వంటి వారికి నైపుణ్యాలకు తగ్గ మార్కెట్ ఎక్కువగా పెద్ద నగరాల్లో మాత్రమే లభిస్తుంది. కానీ ఒక చిన్న వ్యాపార సంస్థ యజమాని, వ్యాపారి, ప్లంబర్, ఎలక్ట్రీషియన్, వడ్రంగి, పాఠశాల ఉపాధ్యాయుడు, ఫిజీషియన్, ఆరోగ్య వర్కర్ చిన్న, పెద్ద పట్టణాలు, నగరాల్లో, ఎక్కడ ప్రజలుంటే అక్కడ అందుబాటులో ఉండాలి. అయితే, చిన్న పట్టణాలను తీవ్రంగా నిర్లక్ష్యం చేయటంతో అడుగడుగునా అసౌకర్యాలతో నిస్తేజంగా తయారయ్యాయి. దీంతో వారిలో చాలామంది గతిలేక పెద్ద పట్టణాలకు వలస బాట

పడుతున్నారు.

అటువంటి అడ్డదిడ్డమైన పట్టణీకరణ వల్ల మన చిన్న పట్టణాల్లో ప్రతిభాపాటవాలు, సంస్థాపక చొరవ తగ్గిపోతూ నిర్వీర్యమవుతున్నాయి. అదే సమయంలో పెద్ద నగరాలు ఊపిరాడనంతగా కిక్కిరిసిపోతున్నాయి. అధ్వాన్న మౌలిక వసతులు, అరకొర ప్రజారవాణా, పనికి వెళ్లాలంటే దూరాభార ప్రయాణాలు, బలహీన చట్టబద్ధపాలన వ్యవస్థలు, ఇళ్ల కొరత వల్ల పెద్ద నగరాలు పేదల పాలిట నరకకూపాల్లా తయారయ్యాయి. నిత్యం ట్రాఫిక్ కష్టాలు, విపరీత రద్దీ, వెలివేసినట్లు మురికివాడల్లో జీవితం, పెరుగుతున్న నేరాలు, హింస, పరాయి భావన, కష్టసమయాల్లో సాయపడేవారు కనిపించని నిస్సహాయత పెద్ద నగరాల్లో పేదలకు నిత్యానుభవం.

ఈ నేపథ్యంలో పట్టణీకరణ నమూనాను మనం కొత్తగా నిర్వచించుకోవాలి. గ్రామాల మధ్యే పట్టణీకరణను అభివృద్ధి చేసుకోవాలి. చిన్న పట్టణాలను అభివృద్ధి చేసి జీవన నాణ్యతను వేగంగా, భారీ స్థాయిలో పెంపొందించాలి. తక్కువ నైపుణ్యమున్న, పేద వలసదారులకు వాటిని ఆకర్షణీయ గమ్యాలుగా మార్చాలి. వరద నీటి కాలువలు, మురుగునీటి పారుదల, తాగునీటి సరఫరా, 24 గంటల విద్యుత్ సరఫరా, మంచి ప్రజా రవాణా, సమీప గ్రామాలతో, ఇతర పట్టణాలు, నగరాలతో సంధానం, నాణ్యమైన పాఠశాలలు, వైద్య సౌకర్యాలు, నైపుణ్యాల అభివృద్ధి.. ఇవన్నీ చిన్న పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం సమకూర్చాల్సిన కనీస వసతులు. ఒక్కసారి మౌలిక సౌకర్యాలు అందుబాటులోకి వస్తే, ప్రయివేటు డెవలపర్లు రియల్ ఎస్టేట్, ఇళ్ల నిర్మాణంలో పెట్టుబడి పెడతారు, వ్యాపారాలు పెరుగుతాయి. ప్రస్తుత ఇంటర్‌నెట్ అనుసంధాన, టెలివిజన్, స్మార్ట్ ఫోన్ల యుగంలో సమాచార సదుపాయాలు దేశంలోని అనేక ప్రాంతాల్లో అందుబాటులో ఉన్నాయి.



ఈ పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం అవగాహనతో, ముందుచూపుతో మాస్టర్ ప్లాన్‌లను తయారుచేయాలి. భవిష్యత్తు అభివృద్ధికి, వినోదం, పర్యావరణ పరిరక్షణలకు ప్రాదేశిక ప్రణాళికలు రూపొందించాలి. ప్రస్తుతం దేశంలో సుమారు 10,000 మునిసిపాలిటీలు, జనాభా నిర్వచనం ప్రకారం పట్టణాలు ఉన్నాయి. వీటిలో భౌగోళికపరంగా, జనాభా, ఇతర ప్రాంతాలతో అనుసంధానం, వలసల తీరు, వచ్చిపోయే వారు, సౌకర్యాలు, సహజ వనరులు మొదలైన వాటి పరంగా భవిష్యత్తులో స్వయం చోదక అభివృద్ధికి అత్యంత అనువైన 5000 వరకు పట్టణాలను రాష్ట్రాలు గుర్తించవచ్చు. ఈ పట్టణాల్లో మౌలిక వసతులు, పట్టణ ప్రణాళిక, మాస్టర్ ప్లాన్‌లను వచ్చే పాతికేళ్లకు తగ్గట్లు రూపొందించవచ్చు. ఒక్కసారి మౌలిక వసతులు అందుబాటులోకి వస్తే, భవిష్యత్తు అభివృద్ధికి విశ్వసనీయ అవకాశాలు కనిపిస్తుంటే, చాలామంది గ్రామీణ ప్రజలు దగ్గరలోని ఈ చిన్న పట్టణాలకు వలస వెళ్తారు. దూరంగా ఉన్న, తెలియని పెద్ద నగరాలకు వలస బదులు గ్రామాల మధ్య పట్టణీకరణ ఒరవడిగా మారుతుంది.

పూర్వీకుల కాలం నుంచి ఉంటున్న ఊరుకి పెద్ద దూరంగాలేని చిన్న పట్టణంలో నివాసం ప్రజలకు ఎన్నో రకాలుగా ప్రయోజనకరం. చిన్న పట్టణాల్లో జీవన వ్యయం తక్కువగా ఉంటుంది, జీవన నాణ్యత మెరుగ్గా ఉంటుంది. ఇళ్లు, రవాణా, స్కూలు సౌకర్యం, ఆరోగ్య సదుపాయాలు చిన్న పట్టణంలో మరింత అందుబాటులో ఉండి, ఆర్థిక భారం లేకుండా అందుతాయి. చిన్న పట్టణాల్లో ప్రజలు ఒకరికొకరు తెలుస్తారు. సాయం అవసరమైతే బలమైన సామాజిక మద్దతు వ్యవస్థలు ఉంటాయి. పుట్టి పెరిగిన ఊరు చిన్న పట్టణానికి సమీపంలో ఉండటంతో, గ్రామీణ, పట్టణ ఆర్థిక వ్యవస్థలు మెరుగ్గా సంధానమవుతాయి. కుటుంబాలు వ్యవసాయం చూసుకుంటూనే పట్టణ వసతుల్లో, వ్యవసాయేతర వృత్తుల్లో జీవించగలుగుతారు. పరాయీకరణ భావం తగ్గుతుంది. స్వతంత్ర న్యాయవ్యవస్థలో భాగంగా చిన్న కేసులకు సులభ విచారణ పద్ధతులతో స్థానిక కోర్టులను ఏర్పాటు చేస్తే, న్యాయం త్వరగా, చౌకగా అందుతుంది, చట్టబద్ధపాలన బలోపేతమవుతుంది. చిన్న పట్టణాల్లోని ప్రజలు ముందుచూపు, విజ్ఞతతో వ్యవహరించగలిగితే సంప్రదాయం, ఆధునికతల్లోని అత్యుత్తమ అంశాల్ని ఆస్వాదించగలుగుతారు.

మనం పట్టణీకరణను కొత్తరీతిలో ఆలోచించాల్సి ఉంది. పది లక్షల గ్రామీణ ఆవాసాల్లో మౌలిక సౌకర్యాల్ని, నాణ్యమైన జీవితాన్ని అందించటం మనకు ఆచరణసాధ్యం కాదు. పేదలు, తక్కువ నైపుణ్యాలున్న కార్మికులు పెద్ద ఎత్తున దూర ప్రాంతాలకు వలసలు పోయే పరిస్థితులను కొనసాగించటమంటే.. ఆ నిస్సహాయుల జీవితాల్ని అభద్రత, ప్రమాదాల్లోకి నెట్టటం, బాధామయం చేయటం, నగరాల్ని అరాచకం, గందరగోళం, అగమ్యంగా మార్చటం. గ్రామాలను సంధానిస్తూ పట్టణీకరణ, చిన్న పట్టణాల ఆరోగ్యకరమైన, సహజమైన అభివృద్ధే యువ భారత్‌కి పరిష్కారం.

# రాహుల్‌పై అనర్హత వేటు - పాఠాలు

రాజకీయాల్లో నేరచరితులకు వ్యతిరేకంగా 1999లో లోక్‌సత్తా ప్రారంభించిన ఉద్యమం కృషి వల్లే ఎన్నికల్లో అభ్యర్థులు తమ వివరాల్ని వెల్లడించాలనే చట్టం వచ్చిందని, అయితే పరువు నష్టం కేసులో సూరత్ ట్రయల్ కోర్టు తీర్పు నేపథ్యంలో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఎంపీ పదవిపై అనర్హత వేటు ఆ చట్టస్ఫూర్తికి అనుగుణంగా లేదని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

"1999లో నేరచరిత్ర గల అభ్యర్థుల జాబితాను విడుదల చేశాం. దీన్నుంచి కోర్టులో వ్యాజ్యం, న్యాయస్థానం తీర్పు ఇచ్చినా అడ్డుకుంటూ ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను జారీ చేస్తే రాష్ట్రపతికి వివరించి తిప్పి పంపేలా చేయటం, ఎన్నికల సంఘం, సుప్రీంకోర్టు వద్ద పోరాటంతో చివరికి అభ్యర్థులు వివరాలు వెల్లడించాలనే చట్టాన్ని సాధించాను. చట్టాల్ని ఉల్లంఘించేవారు చట్టాల్ని రూపొందించేవారు కాకూడదు అనటంలో సందేహం లేదు. కానీ అనర్హతను ప్రతి చిన్న విషయానికీ వర్తింప చేయకూడదు, అది రాజకీయ సంస్కరణకు ప్రాథమిక ఆయుధం కాకూడదు" అని జేపీ స్పష్టం చేశారు. రాహుల్‌పై చర్య సాంకేతికంగా సరిగానే ఉన్నట్టు కనిపిస్తున్నా, ప్రజాస్వామ్య, రాజకీయ, రాజ్యాంగ స్ఫూర్తికి కూడా విరుద్ధంగా, ముఖం మీద కోపంతో ముక్కు కోసుకున్నట్టు ఉందన్నారు. యధాలాపంగానే అయినా కులం, ఇంటి పేరుతో రాహుల్ గాంధీ కించపరచటం, అందుకు క్షమాపణ చెప్పకపోవటం తప్పు అనటం లో సందేహం లేదని, అయితే ఆ తప్పుకి ఇంత పెద్ద శిక్ష వేయటం సరి కాదని జేపీ అన్నారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు ఎంతో కష్టపడి ప్రజల్ని సమీకరిస్తాయని, విభిన్న వర్గాల మధ్య ఏకాభిప్రాయ సాధనకు కృషి చేస్తాయని, ఎన్ని తప్పులున్నా ఈ రాజకీయ కృషిని సాంకేతిక కారణాలతో కించపరచటం, ఎన్నికను రద్దు చేయటం వంటి చర్యలకు దిగటం సరికాదన్నారు. దీనివల్ల ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందన్నారు.

ఈ పరిణతిని ప్రదర్శించకుండా 2013లో ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు తొందరపాటుతనాన్ని ప్రదర్శించటం ప్రస్తుత పరిస్థితికి దారితీసిందని జేపీ వివరించారు.

"ప్రజాప్రతినిధికి శిక్ష పడితే అప్పీల్ తేలేదాకా అనర్హత వేటు వేయకూడదని 1951లో తాత్కాలిక పార్లమెంటు/ రాజ్యాంగ సభ ప్రజాప్రాతినిధ్య చట్టంలో నిర్దేశించింది. ఆ పదవీకాలం వరకే ఆ మినహాయింపు వర్తింప చేయాలన్నది వారి ఉద్దేశం. అయితే ఆ మినహాయింపుకి ఎన్నికల సంఘం విపరీతార్థాన్నిచ్చి అప్పీల్ తేలేవరకూ ఎన్ని ఎన్నికలకైనా వర్తింపచేయచ్చని వెసులుబాటు ఇచ్చింది. 61 ఏళ్ల పాటు ఆ తప్పును కొనసాగించింది. చివరికి 2013లో ఈ వెసులుబాటును సుప్రీంకోర్టు కొట్టివేయటం సమంజసమే. అయితే ఎంతో సమతూకంతో, సంయమనంతో వ్యవహరించాల్సిన న్యాయస్థానం రాజకీయం పట్ల సమాజంలో ఉండే కోపాన్ని ప్రతిఫలింప చేస్తూ వెంటనే అనర్హత వేటు వర్తింప చేయాలని పేర్కొంటూ, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 8(4)ని కూడా కొట్టివేసింది. ఈ సెక్షన్‌ని రాజ్యాంగ నిర్మాతలు ఎందుకు ప్రవేశపెట్టారోనన్న ఆలోచన చేయలేదు. అనర్హతపై ఎన్నికల సంఘాన్ని




సంప్రదించి రాష్ట్రపతి నిర్ణయం వెలువరించాలని రాజ్యాంగంలోని 103వ అధికరణం స్పష్టంగా చెబుతున్నా.. అదేమీ అక్కర్లేదు, తక్షణం అనర్హత వర్తింపచేయవచ్చని ఆదేశించింది. అప్పీల్ తీర్పు వెలువడకుండా ఇలా చేయటం వల్ల వచ్చే పరిణామాలను సుప్రీంకోర్టు పరిగణలోకి తీసుకోలేదు. రాహుల్ గాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న వయనాడ్‌లో ఇప్పుడు ఎన్నిక నిర్వహిస్తే, కొత్త ఎంపీ ఎన్నికైతే, ఆ తర్వాత అప్పీల్‌లో రాహుల్ గాంధీపై శిక్షను తొలగిస్తే, లేదా తగ్గిస్తే అప్పుడు ఎవరు ఎంపీ అవుతారు? రాజకీయంగా లేనిపోని సమస్యలు తలెత్తవా?.. కాబట్టి పదవీకాలంలో అప్పీల్‌పై తీర్పు వచ్చే వరకు వేచిఉండటం సముచితం. సుప్రీంకోర్టు చెప్పింది కాబట్టి రాష్ట్రపతి నిర్ణయంతో సంబంధం లేకుండా రాహుల్‌పై వెంటనే అనర్హత వేటు వేయటంలో సాంకేతికంగా తమ తప్పేమీ లేదని లోక్‌సభ సెక్రటేరియట్ సమర్థించుకునే అవకాశం ఏర్పడింది" అని పేర్కొన్నారు.

రాహుల్ విషయంలో ఇప్పుడు శిక్షను నిలిపివేయాలా వద్దా అనేది పైకోర్టు నిర్ణయిస్తుందని, శిక్షపై స్టే కొనసాగుతూ అప్పీల్‌పై పెండింగ్ కొనసాగుతుంటే వచ్చే ఎన్నికలో ఏం జరుగుతుంది? అని ఆలోచించాలని జేపీ పేర్కొన్నారు.

రాజకీయం పట్ల చులకనతో విపరీత వ్యాఖ్యానాలు, పరిణామాలు ఇంకా పెరగకముందే అన్ని పార్టీలు విభేదాలను వీడి ఏకాభిప్రాయంతో ఈ సమస్యకు పరిష్కారం వెతకాలని, ఆ ఏకాభిప్రాయం ప్రాతిపదికన మళ్లీ అసాధారణ పరిస్థితులు తలెత్తకుండా చట్టాన్ని సంస్కరించాలని జేపీ సూచించారు. "రాజకీయాల్లో నేరచరితులు ఉండకూడదు, ప్రజాప్రతినిధులపై అనర్హత వేటు రాజకీయ సంస్కరణకు ప్రాథమిక ప్రాతిపదిక కాకూడదు" అనే మౌలిక సూత్రాల్ని గీటురాళ్లుగా తీసుకోవాలన్నారు.

"ఇదేసమయంలో పరువునష్టం ఫిర్యాదుల్ని క్రిమినల్ నేరాలుగా కాకుండా సివిల్ వివాదాలుగా పరిగణించి నష్టపరిహారం చెల్లింపు వంటి పద్ధతుల్లో పరిష్కరించాలి.

అలాగే రాజకీయాల్లో, ఇతర కీలక రంగాల్లో ఉన్నవాళ్లు మాటల్ని జాగ్రత్తగా ఉపయోగించాలి. సమాజానికి రోల్‌మోడల్స్‌లా వ్యవహరించాలి. రాహుల్ గాంధీపై అనర్హత వేటు అనేక అంశాల్లో మనకు పాఠాల్ని నేర్పుతోంది. విజ్ఞతతో, సంయమనంతో నేర్చుకోవటం అవసరం" అని జేపీ విజ్ఞప్తి చేశారు.

# పాశ్చాత్యులు మరింత లోతుగా అర్థం చేసుకోవాలి

ఆర్ఎస్ఎస్ వంటి శక్తిమంతమైన, సంక్లిష్టమైన ఉద్యమాన్ని అమెరికన్లు, పాశాత్యులు మరింత లోతుగా అర్థం చేసుకోవాల్సి ఉందని ప్రముఖ విద్యావేత్త వాల్టర్ రస్సెల్ మీడ్ 'వాల్‌స్ట్రీట్ జర్నల్'లో ఇటీవల రాసిన వ్యాసంలో విశ్లేషించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ సీనియర్ నాయకులు, వారిని విమర్శించేవారితో పలు లోతైన సమావేశాల తర్వాత తాను ఈ అభిప్రాయానికి వచ్చినట్లు తెలిపారు. వాల్టర్ రస్సెల్ విశ్లేషణలోని కొన్ని అంశాలు స్థూలంగా:

భారతదేశం అత్యంత సంక్లిష్టమైన ప్రాంతం. బీజేపీ ఇటీవల సాధించిన పెద్ద రాజకీయ విజయాలు ఇండియా ఈశాన్య ప్రాంతంలోని క్రైస్తవ రాష్ట్రాల నుంచి వచ్చాయి. దాదాపు 20 కోట్ల జనాభా ఉన్న ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వానికి షియా ముస్లింలు గట్టి మద్దతుగా ఉన్నారు. కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు కీలక పాత్ర పోషించారు. పెద్ద గుర్తింపులేని ఆలోచనాపరులు, మతవాదులతో కూడిన ఓ అప్రాధాన్య సంస్థ స్థాయి నుంచి ఆర్ఎస్ఎస్ ఇప్పుడు బహుశా ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన పౌర సమాజ సంస్థగా ఎదిగింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆర్ఎస్ఎస్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, మత విద్య, పునరుజ్జీవన కార్యక్రమాలు, పౌర సమాజ కలాపాల్లో వివిధ రంగాలు, వయసులవారు భారీసంఖ్యలో భాగస్వాములవుతున్నారు, వలంటీర్లుగా పనిచేస్తున్నారు. రాజకీయ చైతన్యాన్ని తేవటంలో, కోట్లాది ప్రజానీకం శక్తిసామర్థ్యాల్ని ఒక లక్ష్యం దిశగా ఏకోన్ముఖం చేయటంలో వీరు విజయవంతమయ్యారు.

తన సామాజిక, రాజకీయ పునాదిని కోల్పోకుండా బయటి ప్రపంచంతో ఇచ్చిపుచ్చుకునేందుకు, లోతుగా సంబంధాలు నెరపేందుకు ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తోందన్న అభిప్రాయం ఆయా నేతలతో సమావేశం తర్వాత కలిగింది. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ను అర్థం చేసుకోవటానికి లభించిన అవకాశాన్ని తోసిపుచ్చటం అమెరికాకే నష్టదాయకం. చైనా నుంచి ఒత్తిళ్లు పెరుగుతున్న నేపథ్యంలో, భారత్ ఆర్థిక, రాజకీయ భాగస్వామ్యం అమెరికాకు అవసరం. ఇండియాతో వ్యూహాత్మక సంబంధాల్ని సుస్థిరంగా కొనసాగించాలనుకుంటున్న దౌత్యవేత్తలు, విధాననిర్ణేతలలాగే.. హిందూ జాతీయవాద భావజాలాన్ని, పథాన్ని అర్థం చేసుకోవటం వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారులకు కూడా అవసరం.

ప్రపంచంలోనే మూడు దిగ్గజ రాజకీయ పార్టీలైన లికుడ్ పార్టీ ఆఫ్ ఇజ్రాయెల్, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా, ముస్లిం బ్రదర్‌హుడ్ పార్టీ ఆఫ్ ఈజిప్ట్‌ల ముఖ్య సూత్రాలను బీజేపీ పుణికిపుచ్చుకుంది. ప్రపంచంలోనే అతి ముఖ్యమైన పార్టీగా రూపుదిద్దుకుంది. భారతీయేతరులకు సంబంధంలేని రాజకీయ, సాంస్కృతిక నేపథ్యం నుంచి అభివృద్ధి చెందటం వల్ల ఆ పార్టీని పాశ్చాత్య దేశాలు సరిగా అర్థం చేసుకోలేకపోయాయి.

## లోక్‌పాల్ - సాధించింది నిల్!

ప్రజాప్రతినిధుల అవినీతిపై విచారణకు నియమించిన లోక్‌పాల్ పనితీరు తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోందని పార్లమెంటరీ స్థాయీ సంఘం పేర్కొంది. లోక్‌పాల్ ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకూ ఒక్కరిని కూడా ప్రాసిక్యూట్ చేయలేదని తెలిపింది. ఇటీవల పార్లమెంటు ముందుంచిన స్థాయీ సంఘం నివేదికలోని ముఖ్యాంశాలు:

- సరైన ప్రొఫార్మా లేదంటూ పలు ఫిర్యాదులను లోక్‌పాల్ తిరస్కరించింది
- గత మే నుంచి లోక్‌పాల్ పోస్టును భర్తీ చేయలేదు
- సరైన కారణం లేకుండానే ఫిర్యాదులను లోక్‌పాల్ తిరస్కరించటం సరికాదు
- అవినీతికి వ్యతిరేకంగా జీ-20 గళమెత్తుతున్న వేళ దేశంలో అవినీతికి సంబంధించిన అంశాలపై లోక్‌పాల్ క్రియాశీలం కావాలి
- ఒక్క 2022-23లోనే అవినీతికి వ్యతిరేకంగా సరైన ప్రొఫార్మాలో లేని 2518 ఫిర్యాదులు అందాయి
- సరైన ప్రొఫార్మాలో 242 ఫిర్యాదులు రాగా 191 పరిష్కారమయ్యాయి
- 2020 నుంచి ఇద్దరు జ్యుడీషియల్ సభ్యుల నియామకమూ జరగలేదు
- లోక్‌పాల్‌కు మొత్తం 82 శాశ్వత పోస్టులు మంజూరు చేయగా ప్రస్తుతం 32 మందే పనిచేస్తున్నారు. మరో 62 మంది కాంట్రాక్టు పద్ధతిలో సేవలందిస్తున్నారు.

# అంబేద్కర్ - ప్రభుత్వోద్యోగ వ్యవస్థ - పౌర సేవలు

## - డా॥ జయప్రకాష్ నారాయణ్-



1956, మార్చి 18న ఆగ్రాలో డా॥ అంబేద్కర్ ఒక చరిత్రాత్మక ప్రసంగాన్నిచ్చారు. "మీకు రాజకీయ హక్కులను సాధించటానికి నేను గత 30 ఏళ్లుగా పోరాడుతున్నాను. పార్లమెంటులో, రాష్ట్రాల అసెంబ్లీల్లో మీకు రిజర్వుడు స్థానాలను సాధించగలిగాను. మీ పిల్లల చదువుకు తగిన ఏర్పాటును చేయగలిగాను. ఇవాళ మనం పురోగమించగలం. విద్య, ఆర్థిక, సామాజిక అసమానతల్ని నిర్మూలించేలా ఈ పోరాటాన్ని సమైక్యంగా కొనసాగించాల్సిన బాధ్యత ఇక మీ భుజాలపై ఉంది" అని ఆయన చెప్పారు.

ప్రభుత్వోద్యోగుల గురించి అంబేద్కర్ ఇలా అన్నారు: "చదువులో మన అణగారిన సమాజంలో కొంత పురోగతి ఉంది. చదువుకోవడం ద్వారా కొంతమంది ఉన్నత పదవులకు చేరుకున్నారు. కానీ ఈ చదువుకున్నవాళ్లు నన్ను మోసం చేశారు. ఉన్నత విద్యను పొందిన తర్వాత వాళ్లు సమాజానికి సేవ చేస్తారని నేను వారి నుంచి ఆశించాను. కానీ ఈవేళ నేను చూస్తున్నది కొంతమంది చిన్న, పెద్ద గుమాస్తాల గుంపుని! తమ బొజ్జల్ని నింపుకోవటంలో తలమునకలైన గుంపు ఇది."

విద్యార్థులు, యువతకు ఆయన పిలుపునిస్తూ, "విద్యార్థులకు నా విజ్ఞప్తి ఇదే. చదువును పొందిన తర్వాత ఏదోక గుమాస్తా పని చేయటానికి బదులు, మీ గ్రామానికి లేదా ప్రాంత ప్రజలకు సేవ చేయండి. దీనివల్ల.. అజ్ఞానం కారణంగా దోపిడీకి, అన్యాయానికి గురవటం ఆగిపోతుంది. సమాజ విముక్తిలోనే మీ విముక్తి ఉంది" అని చెప్పారు.

రాజ్యాంగం అమల్లోకి వచ్చిన ఆరేళ్ల తర్వాత బాబాసాహెబ్ ఎంతో లోతైన, నిర్మొహమాటమైన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ పరిశీలనకు చాలా ప్రాధాన్యత ఉంది. చట్టబద్ధంగా మినహాయింపు కల్పించిన హక్కులు ముఖ్యమైనవే, కానీ విద్య, ఆర్థిక, సామాజిక అసమానతని తొలగించటానికి నిరంతర పోరాటం అవసరం.. అని ఆయన స్పష్టంగా గుర్తించారు. తాను పోరాడి రాజ్యాంగంలో పొందుపరిచేలా చేసిన హక్కుల నుంచి లాభం పొందిన కొద్దిమంది, సొంత ఆదాయాలను పోగేసుకోవటంలో తలమునకలై ఉన్నారని అంబేద్కర్ వేలెత్తి చూపారు. జడలు పరచుకొని ఉన్న అసమానతల్ని, సమాజంలోని అవకాశాలకు నోచుకోని కోట్లాదిమందిని వీరు విస్మరించారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వోద్యోగం కోసం ఎదురుచూసే యువత సమాజాన్ని విముక్తం చేయలేరని మందలించారు. అజ్ఞానం వల్ల దోపిడీకి, అన్యాయానికి గురికావటాన్ని నిర్మూలించి తీరాలని ఉద్ఘాటించారు.

అప్పటి నుంచి, ఆరు దశాబ్దాలకుపైగా గడిచిపోయాయి. అంబేద్కర్ శంకించినదే భవిష్యవాణి అని రుజువైంది. మనం సమానత్వాన్ని, అవకాశాల్ని పెంపొందించటానికి, న్యాయాన్ని పొందటానికి చట్టబద్ధ వ్యవస్థల్ని ఏర్పాటు చేసుకున్నాం. కానీ వాస్తవంలో మాత్రం.. నిజమైన సమానత్వం, అవకాశాలు, న్యాయం మన ప్రజల్లోని అత్యధిక సంఖ్యాకులకు అందటం లేదు. మన రాజ్య వ్యవస్థలు, వాటి పనితీరులోని లోపాల్ని గుర్తించి ఒక క్రమపద్ధతి ప్రకారం సరి చేయటం మాత్రమే ఈవేళ ప్రయోజనకారి పని అవుతుంది.

ఒక వ్యక్తి లేదా కుటుంబం సొంతంగా చేసుకోలేని ఉమ్మడి అవసరాలను తీర్చటానికి రాజ్యవ్యవస్థను మానవ సమాజం నిర్మించింది. రాజ్యవ్యవస్థ సమర్థంగా, నిజాయతీగా పని చేయటం మరి ముఖ్యంగా జనాభాలోని పేదలు, అవకాశాలు అందుకోలేని వర్గాల జీవితాలకు, వారి

జీవనోపాధికి కీలకం! కొందరు లోతైన ఆలోచనాపరులు పలు సందర్భాల్లో చెప్పినట్లు.. సమాజంలోని సంపన్నులు, బలవంతులు, బాగా చదువుకున్నవారు, మంచి ఆదాయమున్నవారు, ఉన్నత వర్గీయులు ప్రభుత్వాన్ని, మిగిలిన సమాజాన్ని పట్టించుకోవటం మానేశారు. వాళ్లకు సెక్యూరిటీ గార్డులున్న సొంత గేటెడ్ కమ్యూనిటీలుంటాయి, వాళ్లకు ప్రత్యేక నీటి సరఫరా, పారిశుద్ధ్య వ్యవస్థ ఉంటుంది, వాళ్లకు సొంత విద్యుత్తు జనరేటర్లు ఉంటాయి, స్టోరేజి బ్యాటరీలతో నిరంతర విద్యుత్తు సరఫరా ఉంటుంది, వాళ్లకు ఖరీదైన, ప్రత్యేకమైన ప్రయివేటు స్కూళ్లు, భారీ ఇన్సూరెన్స్ కవరేజీతో ఏ స్థాయి జబ్బుకైనా వైద్యసేవల్ని అందించగలిగే ప్రయివేటు ఆస్పత్రులు ఉంటాయి, వాళ్లకేదైనా సమస్య ఉంటే శక్తిమంతమైన అధికారులను, రాజకీయ నాయకులను తక్షణం కలిసి పరిష్కరించేసుకోగలరు. సంపన్న, శక్తిమంతమైన వారికి సమర్థవంతమైన, నిజాయతీ కలిగిన ప్రభుత్వం అవసరం లేదు. పరిపాలన ఎంత చెత్తగా ఉన్నా బతకటానికి, ఎదగడానికి వాళ్లకు మార్గాలు అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ వైఫల్యం ఒక పరిధి దాటితేగానీ, వారికి తత్వం బోధపడదు. కానీ ప్రభుత్వం ఏ స్థాయిలో విఫలమైనా తీవ్రంగా నష్టపోయేది పుట్టుకతో వివక్ష బాధితులైన పేదలు, అణగారిన వర్గాలు! సమర్థవంతమైన, నిజాయతీతో, మానవీయతతో కూడిన ప్రభుత్వం వీరి మనుగడకు, ఎదుగుదలకు ఎంతో అవసరం.



ఈవేళ్టి భారతదేశంలో అనేక రంగాలు పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి. కానీ, పుట్టుకతో అసమానతల్ని కొనసాగించటానికి పెద్దఎత్తున కారణమవుతున్న రాజ్యవ్యవస్థ పనితీరు, దాని సంస్థలకు సంబంధించిన ఐదు కీలక రంగాలపై మాత్రమే నేను ఇక్కడ దృష్టి పెట్టాలనుకుంటున్నాను.

వీటిలో మొదటిది, ప్రజలకు కనీస సేవల్ని ప్రభుత్వం సక్రమంగా, కచ్చితంగా అందించటం! మంచినీరు, మురుగు పారుదల, వరద డ్రైనేజీ, పారిశుద్ధ్యం తదితర సేవల్ని అందించటం ప్రభుత్వ మౌలిక బాధ్యత. రోజువారీ జీవితానికి ఎంతో అవసరమైన ఈ సేవలను అందించటంలో ప్రభుత్వం విఫలమైతే, ప్రధానంగా పేదల జీవితాలు దుర్భరంగా మారతాయి, మెరుగైన భవిష్యత్తు కోసం వారు ఎంతో ఆరాటంతో చేసే ప్రయత్నాలకు ఆ మేరకు గండిపడుతుంది. ఇక్కడ ప్రస్ఫుటంగా కనిపించేది, గుర్తించాల్సినది – ఒక సాధారణ పౌరునికి, ఒక అతి దిగువ స్థాయిలో ఉన్నా సరే ప్రభుత్వోద్యోగికీ మధ్య నెలకొన్న భారీ అంతరం, అసమతుల్యత! మన దేశంలో పనిచేసేవారిలో 90 శాతం మందికి తక్కువ జీతాలు, ఆదాయమే ఉన్నాయి. వీళ్లంతా జీవన భద్రతలేకుండా అసంఘటిత రంగంలో ఉన్నవారు లేదా స్వయంఉపాధి పొందుతున్నవారు. దీనివల్ల, ఒక సాధారణ ప్రభుత్వోద్యోగి కూడా ఆర్థికంగా వీరి కంటే ఎక్కువ భద్రతను కలిగి ఉంటాడు, మెరుగ్గా చదువుకుని, విషయ పరిజ్ఞానం కలిగి ఉంటాడు, జనాభాలోని అత్యధికుల కంటే ఎక్కువ పలుకుబడి, అధికారం కలిగి ఉంటాడు! లంచాలు, వేధింపులు, జాప్యాలు లేకుండా సామాన్య పౌరులకు ప్రభుత్వ సేవల్ని సవ్యంగా అందించటంలో స్వతంత్ర భారతదేశ వైఫల్యం వల్ల మన ప్రజలు నిస్సహాయంగా అర్థించేవారుగా మిగిలిపోగా.. ప్రజాసేవకులుగా ఉండాల్సిన ఉద్యోగులు యజమానుల్లా తయారయ్యారు. ఇలా పాత్రలు తారుమారవటం, వలసపాలన నాటి మనస్తత్వం నుంచి బైటపడకపోవటం, లైసెన్స్–కంట్రోల్–పర్మిట్ విధానాలు.. కలగలిసి పేదలకు తీవ్ర నష్టం చేసి దేశాన్ని వెనక్కి గుంజుతూ వచ్చాయి. తమకు హక్కుగా అందాల్సిన మౌలిక సేవలకు దాదాపు 65 శాతం కుటుంబాలు ప్రతి సంవత్సరం లంచాలు చెల్లిస్తున్నాయని సర్వేలు సూచిస్తున్నాయి. వీరంతా బలవంతపు అవినీతి బాధితులు. తమకు అప్పనంగా మేలు చేయమనో, తమ పట్ల పక్షపాతం చూపాలనో వీరు అడగటం లేదు. తమకు హక్కుగా రావాల్సిన సేవలను సక్రమంగా అందించమని అడుగుతున్నారు. కానీ ఆలస్యాలు, వేధింపులు, అవమానాలు, అయోమయాలు, కొన్ని సందర్భాల్లో పూరించలేని నష్టానికి గురై నలిగిపోతున్నారు. పేదల నుంచి లంచాలు వసూలు చేయటం ఒక ఆనవాయితీగా మారిపోయింది. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసి పెట్టటం కోసం వీరు మధ్యవర్తుల సాయం కోరాల్సి వస్తోంది. స్థానిక రాజకీయ కార్యకర్తలు, పలుకుబడి గలవారి మీద ఆధారపడాల్సి వస్తోంది. ఫలితంగా పేదలు రాజకీయ బానిసత్వంలో శాశ్వతంగా మగ్గుతున్నారు. సార్వత్రిక ఓటుహక్కు, ప్రజాస్వామ్యం నానాటికీ బలహీనపడుతున్నాయి.

మౌలిక సేవలను వేగంగా, నిర్దిష్ట కాలపరిమితిలోగా అందించేట్టుగా మనకు సర్వీస్ గ్యారంటీని (హక్కుగా పౌర సేవలకు చట్టబద్ధ ఏర్పాటు) అమల్లోకి తేవాలి. గడువులోగా సేవలను అందించలేకపోతే పరిహారం చెల్లించాలి. యు.కెలో ఈ రకమైన సిటిజన్స్ చార్టర్లను జాన్ మేజర్ ప్రభుత్వం వ్యవస్థీకృతం చేసింది. అనేక దేశాలు దీన్ని అనుసరించాయి. పౌర సేవల్ని సక్రమంగా అందించటానికి భారతదేశంలో ఇప్పటి వరకూ చిత్తశుద్ధితో ప్రయత్నాలు జరగలేదు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సమస్యలు పరిష్కారమయ్యే చోట మినహాయించి, మిగిలిన అన్ని సేవల్లోనూ ఇదే

పరిస్థితి. దీంతో, ప్రజలకనెత్తిన అందనంత ఎత్తులో ఉన్న అధికార వ్యవస్థ, అధ్వాన్న పౌర సేవలు అలాగే కొనసాగుతూ ప్రజల్ని పీడిస్తున్నాయి. దీన్ని సరిదిద్దడానికి బదులుగా, భారత ప్రభుత్వం అడ్డగోలుగా తుగ్లక్ తరహాలో స్పందించింది. పౌర సేవల సంక్షోభం పరిష్కారం కాకపోగా వ్యతిరేక ఫలితాలు వచ్చేలా చట్ట సవరణ చేసింది. 2018లో పార్లమెంటు అవినీతి నిరోధక చట్టాన్ని ఏకగ్రీవంగా సవరించింది. వామపక్షాలు, దళిత, అగ్రకులాలు అనే తేడా లేకుండా అన్ని పార్టీలూ ఈ సవరణలో ప్రభుత్వానికి మద్దతు పలికాయి. చట్టానికి రెండు దిగ్భ్రమ కలిగించే నిబంధనల్ని జోడించారు. మొదటిది, వేధింపులు లేకుండా సకాలంలో నాణ్యమైన పౌర సేవల్ని అందించే జవాబుదారీతనం కలిగిన నిర్మాణాన్ని ఏర్పాటు చేయటానికి బదులు.. ఓ చిన్నపాటి ధ్రువపత్రం కోసమో, విద్యుత్ మీటర్ కోసమో గతి లేక లంచమిచ్చే నిస్సహాయ బాధిత పౌరుడికి ఏడేళ్ల జైలుశిక్ష విధించేలా సవరణ చేశారు. కనీస శిక్ష మూడేళ్లు! దేశంలో ఇలా తప్పనిసరి శిక్ష చాలా నేరాలకు లేదుగానీ, నిస్సహాయ పౌరులకు మాత్రం వర్తింపచేశారు. లాలూచీ అవినీతి అయితే, లంచం ఇచ్చేవాడు, లంచం తీసుకునేవాడు ఇద్దరూ తమ అక్రమ లాభం కోసం దేశానికి నష్టం కలిగిస్తే, న్యాయమైన పోటీని అణగదొక్కితే లేదా ఏ రూపంలోనైనా ప్రజాప్రయోజనాలను కాలరాస్తే.. అప్పుడు మాత్రమే లంచం ఇచ్చేవాడు కూడా లంచం తీసుకునేవాడితో సమానంగా నేరస్తుడవుతాడు. చట్టపరంగా అప్పుడు మాత్రమే ఇచ్చేవాడి మీద కూడా కఠిన చర్యలు తీసుకోవాలి. కానీ బలవంతపు అవినీతికి బాధితులైన నిస్సహాయ సామాన్యులు తమకు హక్కుగా రావాల్సిన జనన లేదా ఆదాయ ధ్రువపత్రం, భూ రికార్డు లేదా హక్కుల రికార్డు పత్రం, నీటి సరఫరా, లేదా విద్యుత్తు కనెక్షన్‌కు గతి లేక లంచాలిస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యానికి, బలవంతపు అవినీతికి బాధితులైనవారికి విధిగా మూడేళ్ల జైలు శిక్ష విధించటం ఎంత క్రూరమైన వైచిత్రి! అటువంటి ధోరణులు పేదరికాన్ని, సామాజిక, ఆర్థిక అసమానతను ఇంకా కొనసాగిస్తాయి. కులపరమైన అణచివేతని, పుట్టుకతో ప్రతికూలతల్ని అధిగమించేలా రాజ్యవ్యవస్థ పేదలు, బలహీనులను బలోపేతం చేస్తుందని బాబాసాహెబ్ ఆశించారు. కానీ దానికి బదులుగా, పేదలను పిండి, వారిని ఇంకా అణగదొక్కే ఒక రాకాసిని మనం సృష్టించాం. చట్టానికి ఇంకో ఘోరమైన సవరణ కూడా చేశారు. గతి లేక లంచం ఇచ్చినవాడిని కఠినంగా శిక్షించటం ఒకపక్కయితే.. లంచం తీసుకునేవాడిని మాత్రం ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా కనీసం విచారణ కూడా చేయకూడదట! గతంలో అధికారుల ప్రాసిక్యూషన్‌కు మాత్రమే ముందస్తు అనుమతి రక్షణ ఉండేది. ఇప్పుడు ఏకంగా ప్రాథమిక విచారణకు కూడా అనుమతి తీసుకోవాలనే నిబంధన పెట్టారు. పేద, నిస్సహాయ పౌరునికి, ఆ పౌరునికి సేవకుడైన ప్రభుత్వోద్యోగికి మధ్య నిచ్చెనమెట్ల అంతరం ఎంత అగాథంలా ఉందో తెలియజెప్పటానికి ఇంతకంటే పెద్ద దృష్టాంతం కావాలా? మనకు నిజమైన జవాబుదారీతనం కావాలి, ప్రభుత్వం నుంచి హక్కుగా జరగాల్సిన పనులకు సర్వీస్ గ్యారంటీ ఏర్పాటు కావాలి, బలవంతపు అవినీతికి బాధితులైన సామాన్య ప్రజలను శిక్షించే క్రూరమైన చట్టసవరణల్ని ఉపసంహరించుకోవాలి. ఇవి చేయకుంటే, ప్రభుత్వ యంత్రాంగపు క్రౌర్యానికి, ద్రోహానికి పేదలు బలిపశువులవటం కొనసాగుతూనే ఉంటుంది.

అంబేద్కర్, ఇతర జాతి నిర్మాతల దార్శనికత, ముందుచూపునకు మనం కృతజ్ఞులమై ఉండాలి. వారి వేసిన పునాది వల్లే మనం ఇంత సంక్లిష్ట భిన్నత్వం ఉన్న దేశంలో కూడా ఐక్యతను, స్వేచ్ఛను కాపాడుకోగలిగాం, బహుభాషల మధ్య భాషా సామరస్యతను పెంపొందించుకోగలిగాం, కొంతమేర మన ఫెడరల్ వ్యవస్థను బలోపేతం చేసుకోగలిగాం. కానీ ఇప్పటికీ మనలోని శక్తిసామర్థ్యాలను పూర్తిస్థాయిలో వికసింప చేసుకోలేకపోతున్నాం. రాజ్యాంగం హామీ ఇచ్చిన న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వాలు.. కులం, పేదరికం కింద నలిగిపోతున్న కోట్లాదిమందికి ఇంకా ఊహకు కూడా అందని విషయాలుగానే మిగిలిపోయాయి.

సమాజంలోని సాంప్రదాయ దృక్పథాలకు – రాజ్యాంగ విలువలు, దార్శనికతకు మధ్య ఎప్పుడూ అంతరం ఉంటుంది. రాజకీయ, పాలన, న్యాయ ప్రక్రియలు, ప్రభుత్వ యంత్రాంగం, పనితీరు.. కుల అణచివేతకు, సమానత్వానిక్కి ప్రతికూలతలకు, అవకాశాలకు, విభజనకు, సామరస్యతకు మధ్య వారధిగా వ్యవహరించాలి! అంబేద్కర్ చేసిన కృషి కొంత ఫలితాన్ని సాధించింది, కానీ ఆయన కలను నెరవేర్చడంలో మనం ఇంకా చాలా వెనుకబడి ఉన్నాం. మనం చేయాల్సింది చాలా ఉంది. ఇందుకు అనుసరణీయమైన, వాస్తవికమైన, ఆచరణసాధ్యమైన, సాధించగల, ఆమోదయోగ్యమైన వ్యవస్థీకృత పాలన, న్యాయ, రాజకీయ సంస్కరణలు అందుబాటులో ఉన్నాయి. మన అనుభవాలు, ఇతర దేశాల్లోని అత్యున్నత పద్ధతులను మదించి తయారుచేసినవి ఇవి. న్యాయం, ఎదిగే అవకాశాలను గనక మనం నమ్ముతూంటే.. పరిష్కారం యథాతథస్థితి కాదు. శక్తిసామర్థ్యాలను వికసింప చేసుకునే అవకాశాలు లేకపోవటం, నివారించదగ్గ బాధలు కొనసాగటం.. ఇవి రెండూ సమాజం చేస్తున్న పెద్దపాపాలని నేను నమ్ముతాను. మన జాతి నిర్మాతల దార్శనికత నుంచి స్ఫూర్తితో, మన అనుభవాలందించిన విజ్ఞత నుండి సృజనాత్మకతతో వ్యవహరించగలిగితే మనం ఆ పాపాల నుండి విముక్తిని సాధించగలం.

✦

# అంబేద్కర్ - దామాషా ఎన్నికల పద్ధతి

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-

డాక్టర్ అంబేద్కర్ నేతృత్వంలో రూపొందించిన రాజ్యాంగాన్ని గనక అమలు చేసివున్నట్లయితే విద్య, ఆరోగ్యం, ఉపాధి, సామాజిక న్యాయం, రాజ్యాధికారం సహా మన దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలు ఇప్పటికే పరిష్కారమయ్యేవి. కొన్ని సమస్యలు అసలు తలెత్తేవి కూడా కాదు. ఎమ్మెల్యేలు లేదా ఎంపీలు ఎన్నికై రావటం, వాళ్లు ఎటుమొగ్గితే అటు అధికారం.. అంతవరకు రాజ్యాంగం అద్భుతంగా అమలు చేస్తున్నారు. మిగతా రాజ్యాంగం తుంగలో తొక్కుతున్నారు.



మన దేశం చాలా అద్భుతమైనదని నమ్మేవాళ్లలో నేను ఒకడిని, గర్వపడేవాళ్లలో ఒకడిని. కానీ నాకు భ్రమలు లేవు. మన ప్రజాస్వామ్యం చాలా అపరిపక్వమైన, పరిమితమైన ప్రజాస్వామ్యం. ఎన్నికల్లో గెలుపుకి, ఎన్నికల్లో ఎవడో ఒకడు గెలిచిన తర్వాత జనం రోడ్డు మీద తిరిగి గందరగోళం చేయాటానికి పనికొచ్చే ప్రజాస్వామ్యం. ఓట్ అండ్ షౌట్ ప్రజాస్వామ్యం! అంతకుమించి నిజమైన ప్రజాస్వామ్యాన్ని మనం స్థాపించలేకపోయాం. ఇది కఠోర వాస్తవం. కొన్ని విషయాల్లో మనతో రోజూ రకరకాలుగా కయ్యానికి కాలు దువ్వుతున్న చైనాలో మనకంటే ప్రజాస్వామ్యం ఉంది. ఈ మాట అనే సాహసం ఈ దేశంలో చాలా కొద్దిమందే చేస్తారు. కానీ వాస్తవం అది. ఏ దేశం అన్నది మనకి ముఖ్యం కాదు. మనం చాలా నేర్చుకోవాలి. ఈ నేపథ్యంలో ఎక్కడ లోపాలు ఉన్నాయి?.. క్లుప్తంగా మూడు అంశాలు ప్రస్తావిస్తాను.

**ఒకటి, అధికారం ఎట్లా వస్తుంది?**

మనది పేరుకి ప్రజాస్వామ్యం. ఓట్లు వేస్తున్నారు.

కచ్చితంగా స్వేచ్ఛగానే ఓట్లు వేస్తున్నారు. బలవంతంగా వేయించటం లేదు. పూర్వం కొంత ఉండేది గానీ, ఇప్పుడు లేదు. దొంగ ఓట్లు కూడా పెద్దగా లేవు. ఓట్లు స్వేచ్ఛగానే వేస్తున్నారుగానీ ఏం జరుగుతోందో తెలంగాణలో ఉన్న మనందరికీ తెలుసు. దేశంలో అందరి కంటే భారీగా ఎన్నికల్లో ఖర్చు పెట్టి రికార్డు సృష్టించాం. మనం గదా ఈ విషయంలో దేశానికి లీడర్లం! హుజూరాబాద్, మునుగోడులో మన ధనరాజకీయం ప్రపంచం మొత్తానికీ తెలిసొచ్చింది. 2019 బ్రిటన్ ఎన్నికల్లో పెట్టిన మొత్తం ఖర్చు కంటే ఎక్కువ కేవలం మునుగోడు ఉప ఎన్నికలో ఖర్చు పెట్టి రికార్డు సృష్టించాం. డబ్బుతో ఓటు కొనటం, తమది కాని డబ్బుతో ప్రభుత్వాలు, పార్టీలు ప్రజల్ని మచ్చికచేసుకోవటం కోసం తాయిలాలతో మభ్యపెట్టటం, కులం, వర్గం, ప్రాంతం, మతం పేరుతో ప్రజల భవిష్యత్తుతో సంబంధం లేకుండా ప్రజల్లో ఉద్రేకాల్ని రేకెత్తించటం, వెర్రెక్కించటం చుట్టూ రాజకీయం తిరుగుతోంది. ఈ మధ్య పార్టీ కూడా ఒక కులం, మతంలాగా అయిపోయింది.

ఈ నేపథ్యంలోనే దామాషా ఎన్నికల పద్ధతి కీలకం.

మన ఎన్నికల వ్యవస్థ ఇప్పుడు ఎలా ఉందీ?.. ఒక్క ఓటు ఎక్కువ వస్తే గెలుపు, ఒక్క ఓటు తక్కువ వస్తే ఓటమి! ఒక్క ఓటు తక్కువ వచ్చాక ఎన్ని ఓట్లు వచ్చినా ఉపయోగం లేదు. మనలాంటి అపరిక్వమైన ప్రజాస్వామ్యంలో, అక్షర జ్ఞానం లేని దేశంలో, పేదరికం ఉన్న దేశంలో, ప్రజాస్వామ్య అనుభవంలేని దేశంలో ఈ వ్యవస్థ పనికొచ్చేది కాదు. అందుకే బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలోని 80 (2) (బి) అధికరణంలో లోక్‌సభకి, 170వ అధికరణం ద్వారా అసెంబ్లీకి దామాషా ఎన్నికలకు అవకాశం ఏర్పాటు చేశారు. అందుకు తగినట్లు ఆ పదాల్ని ఎంతో జాగ్రత్తగా వాడారు.

మన దేశంలో ఉన్న ఎన్నికల వ్యవస్థను రాజ్యాంగం నిర్దేశించలా. తర్వాత మనం సాంప్రదాయంగా పెట్టేసుకున్నాం అంతే. రాజ్యాంగం ఈ మాట చెప్పలా.


దామాషా ఎన్నికల పద్ధతికి రాజ్యాంగంలో పొందుపరిచిన అవకాశం గురించి నాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి చెబితే.. ఆయన నా ఎదురుగానే రాష్ట్రపతి భవన్ నుంచి రాజ్యాంగం ప్రతి తెప్పించారు. అందులో ఉన్న ఏర్పాటును చూపితే అబ్బురపడ్డారు. ఎంత ముందుచూపుతో చేశారు మన నాయకులు జయప్రకాష్ గారూ అన్నారు. ప్రణబ్ చాలా లోతైన పరిజ్ఞానం ఉన్న వ్యక్తి. స్వతంత్రానంతర భారత చరిత్ర ఆయనకి తెలిసినంత చాలామందికి తెలియదు. అర్ధరాత్రి సైతం గడగడా చెప్పగలరు. ఆయన కూడా దామాషా పద్ధతికి ఉన్న అవకాశాన్ని పరిశీలించలా.

మన ప్రస్తుత ఎన్నికల వ్యవస్థ వల్ల.. అధికారం ఎట్లా వస్తుంది అనేది మన దేశంలో ఒక ప్రహసనంగా తయారైంది. మనం తెలుగునాట వల్గర్‌గా ఆ ఎన్నికల రాజకీయం చూపెడుతున్నాం. దూరదృష్టితో మార్పు కోసం పనిచేసే నేతలు ఇక్కడ పుట్టటం దురదృష్టం అనే పరిస్థితి కల్పించాం. సంక్షోభాన్ని అంత తేలిగ్గా ఎదిరించే పరిస్థితులు తెలుగు రాష్ట్రాల్లో లేవు. ఈ ఎన్నికల వ్యవస్థ, ఇందులోని అపశ్రుతులు మన తెలుగునాట దొర్లినంత భయంకరంగా ఈ దేశంలో ఎక్కడా లేదు. మనల్ని అనుకరించి తమిళనాడు, కర్ణాటక మన స్థాయికి వచ్చాయి. క్రమంగా ఈశాన్య భారతంలో సహా పలు ఇతర రాష్ట్రాలూ వస్తున్నాయి.

**రెండోది, అధికారం ఎక్కడ?**

అధికారమంతా పూర్తిగా కేంద్రీకరించి రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి చక్రవర్తిలా వ్యవహరిస్తున్నారు. ఇటీవలికాలంలో అది జాతీయ స్థాయికి ఎగుమతి అయ్యింది. ఉన్నకొద్దీ పూర్వం కంటే ఎక్కువగా ప్రధానమంత్రి చక్రవర్తిలా వ్యవహరిస్తున్నారు. ఇక క్షేత్రస్థాయిలో ప్రజలు ఓటు వేసే యంత్రాలు తప్ప వాళ్లకు ఏమీ లేదు. మధ్యలో మంత్రులు, మిగతావాళ్లంతా ఊరికే ఉత్సవ విగ్రహాలు. కారు, ప్యూను, ఫోను, లైటు తప్ప వారికి ఏమీ అధికారాలుండవు. ఎప్పుడైతే కేంద్రీకరణ జరుగుతోందో నిజమైన ప్రజాస్వామ్యం ఉండదు. కాగితం మీద ప్రజాస్వామ్యం కనిపిస్తుంది. ఓటుకి – మన జీవితానికి మధ్య సంబంధం ఉండదు. ఎప్పుడైతే ఓటుకి – జీవితానికి సంబంధం ఉండదో, ఒక పేద దేశంలో ఓట్లు కొనుక్కోవటం చాలా తేలిక. ఎక్కడ అధికారం ఉంది అన్న దానికి, ఎన్నికలు ఎట్లా జరుగుతాయి అన్న దానికి మధ్య బోలెడంత అవినాభావ సంబంధం ఉంది. నేనెప్పుడూ చెబుతుంటాను. నేనొక అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో ఉంటాను. ప్రతి నెలా మేం అందరం మెయింటినెన్స్ ఫీజు కడుతున్నాం. కాస్త సమర్థంగా వ్యవహరించగలరు అనుకున్న వ్యక్తిని నిర్వహణ కోసం ఎన్నుకున్నాం. ఆయన ఆ పని చేయలేదనుకోండి, గగ్గోలు పెడతాం. ఇంట్లో నీళ్లు రాలేదనుకోండి గొడవ పెట్టేస్తాం. ఆయనొచ్చి, జేపీ గారూ! మీరు మౌనంగా ఉండండి, రూ.100 ఇస్తా అంటే, చెంప మీద కొడతా. నేను డబ్బులిస్తుంటే నువ్వు నాకు వంద రూపాయలు ఇచ్చేదేంటయ్యా అని నిలదీస్తా. ఎందుకంటే.. నేను డబ్బులిచ్చి పోషిస్తున్నాను, నేను ఆయన్ని నియమించుకున్నాను అని నాకు అర్థమవుతోంది. ఆయన్ని ఎందుకు పెట్టుకున్నాను? ఆ లిఫ్ట్ పనిచేయటం కోసం, నీళ్లు రావటం కోసం. ఆయన నాకు డబ్బులిచ్చేదేంటి? లేకపోతే ఆయనొచ్చి, జేపీ గారూ! మీరూ, నేనూ ఒకే కులం, ఒకటే రాష్ట్రం అన్నాడనుకోండి. ఏమి రాష్ట్రమయ్యా నాకు నీళ్లు రాకపోతే అంటాను. ఎప్పుడైతే అధికారం నాకు చేరువగా ఉంటుందో అప్పుడు.. ఎందుకు అధికారం ఉంటున్నది, అధికారం వల్ల నాకేం జరుగుతోంది అనే స్పష్టత వస్తుంది. ఆ నిర్మాణం మన ప్రజాస్వామ్యంలో లోపించింది.

మన ప్రజాస్వామ్యాన్ని కేవలం అట్టహాసంగా, గందరగోళంగా, ఆర్భాటంగా, కోలాహలంగా, తిరునాళ్లలా, సంబరం లాగా అనుకుంటున్నాం. ఆ విషయంలో మనల్ని మించినవాళ్లు లేరు ప్రపంచంలో. ఎంత కోలాహలం, ఎంత హడావుడి, ఎంత గందరగోళం! అది మించి దాన్లో ఏమీ రసం లేకుండా చేశాం. రసహీనమైన ప్రజాస్వామ్యం చేశాం. ఎందుకు ఓటేస్తున్నాం, ఓటుకి – నా జీవితానికి మధ్య సంబంధం ఏంటి? ఏమీ అర్థం కాకుండా చేసే సరికి.. ఓటు అయితే అమ్ముడుపోయే వస్తువు అయ్యింది, లేకపోతే బాంచన్ నీ కాల్మొక్తాలాగా, ఎన్నికైనవాడు నెలకు వెయ్యో, రెండు వేలో



ఇస్తానంటే ఓటు వేసే పరిస్థితి వచ్చింది. కాబట్టి ప్రజల్ని బిచ్చగాళ్లుగా మార్చటం లేదా ఓట్లు కొనటం అనేది కాకతాళీయంగా రాలేదు. అధికారం ప్రజలకు అందనంత దూరంలో పెట్టటం వల్ల వచ్చింది.

అధికారం దగ్గరగా ఉండటం అంటే అర్థం.. ఈ పంచాయతీలకు అధికారం ఇచ్చి కుల వ్యవస్థను కొనసాగించటం కాదు. ప్రస్తుతమున్న గ్రామాలు నా దృష్టిలో పూర్తిగా అయిపోయాయి. నిర్జీవమైనవి. గ్రామాల్లో పెరిగాను నేను. కానీ అక్కడ అధికారాలు ఇవ్వటం పట్ల నాకు భ్రమలు లేవు. ఒక పెద్ద యూనిట్ కావాలి స్థానిక ప్రభుత్వాలకు. చిన్న పట్టణాలు కావాలి. ఒక 30–40,000 జనాభా గల ప్రాంతాలు. అప్పుడు కులవ్యవస్థను చాలావరకు నిర్వీర్యం చేయవచ్చు. అప్పుడు సంఖ్యాబలం, ప్రజల గొంతు అక్కడ ఉంటాయి. కానీ అధికారం అక్కడ ఉండి, నిర్ణయాలు అక్కడ జరగాలి. దాని ఫలితాలు, పర్యవసానాలు ప్రజలు అనుభవించాలి. చెడు జరిగితే నిలబడాలి, మంచి జరిగితే ఆస్వాదించాలి. అప్పుడు ఓటు ఎందుకు వేస్తున్నామో అర్థమవుతుంది. ఈ 70 ఏళ్లుగా ఓటు ఎందుకు వేస్తున్నామో అర్థం కాని వ్యవస్థను నిర్మాణం చేశాం. దీంతో.. ఆపరేషన్ సక్సెస్, పేషెంట్ డెడ్. నేను చాలా పరుషమైన మాటలు మాట్లాడుతున్నానంటే కోపంతో మాట్లాడటంలా. గుండె లోతుల్లో నుంచి మాట్లాడుతున్నా. ఆశావాదంతో మాట్లాడుతున్నా. ఇంత ఆవేదన ఉన్నా కూడా ఆశావాదిని నేను. ఉన్నకొద్దీ ప్రజాస్వామ్యం మరింత పరిణతి చెందుతుంది. కాకపోతే ఎంత వేగంగా జరుగుతుంది అనే ప్రయత్నం లేకుంటే కోట్ల మంది జీవితాలు సమిధలు అయిపోతున్నాయి అనే బాధ. ఈ దేశంలో అక్కడక్కడా ఎదిగిన కొందరిని చూసి ముచ్చట పడుతున్నాం గానీ, ఎంతమంది అవకాశాలు లేక మట్టిలో కలిసిపోతున్నారు! అందుకని తప్ప, ఆశావాదం లేక కాదు. ఈ దేశంలో గత 20–30 ఏళ్లలో చాలా ఆశావాదం నేర్పినవాళ్లలో నేనొకడ్ని.

రెండోది, అధికారం ఎక్కడ అంటే.. చట్టబద్ధపాలన. రాజ్యాంగంలో అద్భుతంగా పొందుపరిచాం. వాస్తవానికి ఈ దేశంలో చట్టం ఉన్నవాడి చుట్టం. అధికారం ఉన్నవాడు, డబ్బు ఉన్నవాడు, కులం బలమో పలుకుబడో ఉన్నవాడి చుట్టం. మనందరికీ తెలుసు సివిల్ వివాదాలుగానీ, క్రిమినల్ వివాదాలుగానీ, మరొకటి గానీ. వివరాల్లోకి వెళ్లక్కర్లా. మరి సాంప్రదాయంగా అధికారం లేక, గొంతుక అణగారిపోయినవారికి, చదువు, డబ్బు లేనివాళ్లకి, పుట్టుకతో వివక్షను గురైనవారికి ఇంక చట్టం ఎందుకు పనికొస్తుంది?.. వాళ్లని అణచివేయటానికి పనికొస్తుంది! కాగితం మీద అధికారం ఉన్నా కూడా, చట్టాన్ని ఎవడు చేతుల్లోకి తీసుకుంటే వాడి చేతుల్లో ఉంది. కాబట్టి చట్టబద్ధపాలన, నిజమైన వికేంద్రీకరణ, మన దేశ పరిస్థితులకు అవసరమైన వికేంద్రీకరణ అవసరం. ఇవి రెండూ చేయకుండా ఉంటే, ఎవడికి అధికారం వచ్చినా ప్రజల చేతుల్లో అధికారం ఉండదు.

**ఇక మూడోది.. అధికారం ఎందుకు?**

పుట్టిన ప్రతి బిడ్డకీ, ఏ తల్లి గర్భాన పుట్టినా కూడా, పుట్టుకతో నిమిత్తం లేకుండా దేవుడో, ప్రకృతో ఇచ్చిన తెలివితేటల్ని పూర్తిగా వెలికితీసి, ఎంత డబ్బున్నవాళ్లతో అయినా, ఎంత కులం ఉన్నవాళ్లతో అయినా, ఏ ఒంటి రంగు వాళ్లతో అయినా పోటీ పడే అవకాశాన్ని ఇవ్వకపోతే అది ప్రజాస్వామ్యం కాదు, అది పూర్తిగా బూటకం. ఈ దేశంలో మనం, ఈ అవకాశాన్ని ఇవ్వటంలో ఘోరంగా విఫలమయ్యాం. మనం చేసిన ఈ పాపం ఇంతా అంతా కాదు. దేవుడు ఉన్నాడో లేడో నాకు తెలియదు గానీ పాపం ఉందని నమ్ముతున్నాను. ప్రకృతి

ఇచ్చిన ప్రతిభాపాటవాలు వికసించకుండా చేస్తే అంతకంటే పాపం ఇంకొకటి లేదు. ఆ పాపం భారతదేశంలో జరుగుతున్నంత.. గతంలో, పూర్వం జరిగింది తీసేయండి, ఈనాడు జరుగుతున్నంత.. ప్రపంచంలో మరెక్కడా లేదు. రెండోది, ఆరోగ్యం. అన్నీ ఫ్రీగా ఇస్తున్నారు. కాగితం మీద చూస్తే విద్య ఫ్రీ. ఆరోగ్యశ్రీ ద్వారా ఆరోగ్యం ఫ్రీ. కానీ ఆరోగ్యం అందటం లేదు. ఆరోగ్యం ఫ్రీగా ఉండటం వేరు, నిజంగా ఆరోగ్యం అందటం వేరు. రెంటికీ తేడా ఉంది. ఫ్రీగా ఆరోగ్యం ఇవ్వొద్దనటంలా. ఫ్రీగా ఇవ్వాలి. ఇంకా ఇద్దాం. ఫీజు రీఇంబర్స్‌మెంట్ అందరికీ ఉంది. కానీ చదువెక్కడ ఉంది? గుండె మీద చేయి వేసుకుని మనం మాట్లాడదాం. నూటికి 80 మందికి, చదువుకున్నాం అనుకునేవాళ్లకి పొట్ట కోస్తే అక్షరం ముక్క రాదు. ఈమధ్య సర్వే చేస్తే తెలంగాణలో నూటికి 50 మంది 14-18 సంవత్సరాల మధ్యలో వయసువారు గడియారం చూసి గంట, నిమిషాలతో సమయం చెప్పలేకపోతున్నారు. మార్కెట్‌లో కూరగాయలో, పండ్లో కొనటానికి 2,750 గ్రాములు తూకపు రాళ్లు పెట్టమంటే నూటికి 50 మంది ఆ పని చేయలేకపోతున్నారు. ఏం మాట్లాడుతున్నాం సామాజిక న్యాయం గురించి? ఏం మాట్లాడుతున్నాం ప్రజాస్వామ్యం గురించి? ఎంత మోసం చేసుకుంటున్నాం మనల్ని మనం! సరైన విద్య, ఆరోగ్యాన్ని అందరికీ అందించలేని ప్రజాస్వామ్యం ప్రజాస్వామ్యం కాదు. కాబట్టి ఎందుకు అధికారం!

ఈ మూడు ప్రశ్నలూ - అధికారం ఎట్లా వస్తున్నది, అధికారం ఎక్కడ ఉంది, ఎందుకు అధికారం పనిచేస్తున్నది.. వీటికి సమాధానాలు మార్చకపోతే ఇది కేవలం కాగితం మీద ప్రజాస్వామ్యం.

**రాజ్యాంగాన్ని మార్చనక్కర్లా**

దీన్ని మార్చటానికి రాజ్యాంగం పూర్తి అవకాశాన్ని ఇచ్చింది. రాజ్యాంగాన్ని మార్చక్కర్లా. ఈ మధ్య కాలంలో ఆ మాటలు కూడా వస్తున్నాయి. నేను చాలా విస్పష్టంగా చెప్పాను. రాజ్యాంగం అవరోధం కాదు. రాజ్యాంగం విద్యను ఇవ్వొద్దని చెప్పలా. ఇవ్వు మొర్రో అని చెప్పింది. ఆరోగ్యాన్ని అందించవద్దని చెప్పలేదు. అందించు మొర్రో అని చెప్పింది. ఎన్నికల వ్యవస్థను మార్చుకోవద్దని చెప్పలా. స్పష్టంగా ఆ మార్గాన్ని ఏర్పరిచింది. మీరెప్పుడూ చూడలా పొరపాటున కూడా. రాజ్యాంగంలో కాదు లోపం ఉన్నది.. రాజకీయంలో ఉంది. నేను కోరేది - ఈ మూడు మార్పుల కోసం కృషిలో అందరూ భాగస్వాములు కావాలని. ఇది ఒక్క రోజు జరగదు. రేపొద్దున జరుగుతుందని అనను. ఈ రెండేళ్లలో, ఒక ఎన్నికలో జరుగుతుందంటే నేను ఊరికే బురిడీ కొట్టి చప్పట్లు కొట్టించుకోవటమవుతుంది. అంతకంటే ఆత్మవంచన ఇంకోటి లేదు. ఇది ఒక జీవితకాల పోరాటం. కానీ ఇది చేయదగిన పోరాటం. ఎందుకంటే, చివరకు మనం గెలిచితీరుతాం.

**ఏమీ జరగదు అనుకోవటం అవాస్తవికం**

ఏమీ జరగదు అనుకుంటే జీవితం ఎందుకు?.. కానీ ఏమీ జరగదనేది వాస్తవం కాదు. నేను చాలా స్పష్టంగా చెప్పగలను.

మొదటిది, ప్రజాస్వామ్యం అత్యంత సంక్లిష్టమైన, కష్టమైన ప్రక్రియ. కుటుంబంలో నలుగురు ఉంటే తన్నుకు చస్తుంటాం. మీ కుటుంబాల సంగతి నాకు తెలియదు గానీ, మా కుటుంబంలో రోజూ తగవులే. ఎందుకంటే మనుషులు కలిసి పనిచేయటం తేలికైన విషయం కాదు. ప్రేమాభిమానాలుంటాయి, జీన్స్ పంచుకున్నాం, ఆస్తిపాస్తులు పంచుకున్నాం.. అయినా కూడా మనం రోజూ తనుకుంటున్నాం. అలాంటిది ముక్కు మొహం తెలియనివాళ్లు.. వాళ్ల జీవితం తెలియదు, ఆ మనుషులు తెలియదు.. వందల మంది, వేల మంది, లక్షల మంది కలిసి ఉమ్మడి ప్రయోజనాల కోసం పనిచేయటం అంటే ఆషామాషీ కాదు. దాంతోపాటు మన దేశంలో కులాలు, వర్గాలు, మతాలు, రకరకాలు అలా పెట్టేసుకున్నాం. వాటికి బానిసలై పోయాం. ఇలాంటి నేపథ్యంలో ఎంత ఓపిగ్గా కృషి చేయాలి!

ప్రజాస్వామ్యం బ్రిటన్‌లో వికసించాలంటే 1000 ఏళ్లు పట్టింది. 1215లో మ్యాగ్నకార్టాతో ఒక రకంగా ప్రజాస్వామ్య ప్రయోగం మొదలైంది. మనం అనుకున్నరీతి ప్రజాస్వామ్యం కాకపోయినా.. రాజు దైవాంశ సంభూతుడు కాదు, ప్రజలతో కాకున్నా రాజుకి, నోబుల్స్‌కి మధ్య ఒక కాంట్రాక్టు ఉన్నది, వాళ్ల పాత్ర వాళ్లు పోషించాలి, రాజు పాత్ర రాజు పోషించాలి అని రాతపూర్వకంగా మొట్టమొదటి కాంట్రాక్టు అది. అందుకని ప్రజాస్వామ్యానికి మూలస్తంభం! అది జరిగి 808 ఏళ్లు అయింది. దానికి ముందే రెండు, మూడు వందల ఏళ్ల క్రితం వైకన్స్ అని స్థానికంగా కౌన్సిల్స్ ఉండేవి. అంటే వెయ్యేళ్ల ప్రయాణం తర్వాత ఒక స్థాయికి వచ్చారు. ఇప్పుడు కూడా బ్రిటన్ మల్లగుల్లాలు పడుతోంది. బ్రెగ్జిట్ ఏమిటీ? ప్రజల్లో ఉన్న ద్వేషాన్నో, కోపాన్నో, అసహనాన్నో రెచ్చగొట్టి వేలంవెర్రిగా ఓట్లు వేయించి గందరగోళం చేశారు. అమెరికాలో డొనాల్ట్ ట్రంప్ ఏంటి? అంతకంటే అసహ్యకరమైన రాజకీయం ఉందా? మనవాళ్లు ఎంత వెధవలైనా అత్యధికులు

అంతకంటే బెటర్. కాబట్టి ప్రజాస్వామ్యం అన్నది అందంగా ఉండదు, తేలిక కాదు, ఒక్క రోజులో రాదు. కానీ నిరంతరం మెరుగుపడుతుంటుంది.

మనం ఎన్ని చెప్పినా కూడా, ఈ 70 ఏళ్ల రాజ్యాంగ పాలనలో ఎన్ని లోపాలున్నా కూడా అప్పటి కంటే మనం ఎంతో మెరుగ్గా ఉన్నాం. కాకపోతే ఉండాల్సిన స్థాయిలో లేం. ఇంకా చాలా చేయాల్సి ఉంది. ఈ వాస్తవాన్ని మర్చిపోతే చిందరవందరైపోతాం, వేడి పెరిగి ద్వేషాన్ని పెంచుకుంటాం, హింస పెరుగుతుంది, ప్రయోజనం ఉండదు. నేను ఈ మాటలు మనస్ఫూర్తిగా చెబుతున్నా. పైపైన పెదాల మీద నుంచి చెప్పటం లేదు. ఉపన్యాసం కోసం చెప్పటం లేదు. ఉపన్యాసాలు వదిలేశాను చాలాకాలం క్రితం.

**ఇదే మనుషులు అక్కడ ఎలా అద్భుతాలు చేశారు?**

రెండోది, ఇంకో దృష్టాంతం. నా మాటల పట్ల విశ్వసనీయతకు కారణమైన కీలకాంశాల్లో ఒకటి ప్రకాశం జిల్లాలో నేను కలెక్టర్‌గా నీటిపారుదల రంగంలో ప్రజల ద్వారా సాధించిన విజయం. కేవలం రెండున్నర సంవత్సరాలలో 452 ఎత్తిపోతల పథకాలు, 3000 గొట్టపు బావులు, 70 నీటిమళ్ళింపు పథకాలు, 18 కాలువ చివరి భూముల పథకాలు రికార్డు స్థాయిలో, రికార్డు సమయంలో రైతులు పూర్తిచేసుకున్నారు. ఏ ఒక్క ఆరోపణ, ఫిర్యాదు లేకుండా అద్భుత ఫలితాలు వచ్చాయి. అందులో ప్రభుత్వం పెట్టిన ఖర్చు రూ.18 కోట్లు. మొత్తం ఖర్చు రూ.42 కోట్లు. సుమారు 2,00,000 (రెండు లక్షలు) ఎకరాలకి నీటి వసతి అందింది. లక్షకు పైగా కుటుంబాలు శాశ్వతంగా బీదరికం నుంచి బయటపడ్డాయి. ఆర్థర్ కాటన్ మహాశయుడి తర్వాత అంత తక్కువ ఖర్చుతో అంత పెద్దఎత్తున నీటివసతిని కల్పించిన కార్యక్రమం యావత్ భారతదేశంలో ఇప్పటికీ లేదనవచ్చు. ఇందులో నేను చేసింది ఏమీ లేదు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు రైతులకు ఎటువంటి అవరోధాలూ లేకుండా చేశాను. ఎప్పుడైనా రోడ్డు మీద వెళ్తుంటే పనిగట్టుకుని ఎవరైనా రైతు పిలిస్తే వెళ్లి చూసిన ఒకటిరెండు సందర్భాలు తప్ప ఒక్క ప్రాజెక్టును కూడా నేను తనిఖీ చేయలేదు. అయినా కూడా రైతులు అద్భుతాన్ని సాధించి చూపారు. బ్యాంకు రుణాలు ప్రతి రూపాయి ఏ బకాయిలు లేకుండా గడువు కంటే ముందే రైతులు తీర్చేశారు, ఏడేళ్ళలో తీర్చాల్సిన రుణాలని 2-3 ఏళ్ళలో తీర్చేశారు. ప్రభుత్వానికి నిర్వహణ వ్యయ భారం లేకుండా ఆ ఖర్చు బాధ్యతను కూడా రైతులే తీసుకున్నారు. ఎందుకిది సాధ్యమైంది? అక్కడా మనం రోజూ చూసే మనుషులే, ఇవే కులాలు, ప్రాంతాలు, అధర్మాలు, విభేదాలు, గొడవలే. ఇవి లేనిచోటు లేదు ఈ దేశంలో. కానీ ఆ మనుషులే, ఇక్కడి ఉప్పుకారం తినే మనుషులే ఇంత అద్భుత విజయాన్ని సాధించారు.. ఒక మనిషి తన జీవితకాలంలో, తనకున్న అవకాశాల్ని ఉపయోగించి సరైన దిశలో ప్రయత్నం చేస్తే ఫలితాలు వచ్చాయా, లేదా? ఒక మనిషి, ఒక రకమైన తీరు, కొన్ని ఏర్పాట్లు చేస్తే ఫలితాలు ఎందుకు వస్తున్నాయి? అది లేనిచోట ఫలితాలు ఎందుకు తక్కువ వస్తున్నాయి ఇదే మనుషులతో?.. అంటే మన ప్రయత్నం వల్ల, మనం డిజైన్ చేసిన పద్ధతుల వల్ల, ఏర్పాటు చేసిన ప్రోత్సాహకాల వల్ల, నిర్మాణం చేసిన వ్యవస్థల వల్ల మార్పు వస్తుంది. ప్రజలకు తమ ప్రయోజనం ఏమిటో తెలియచెప్పి అలాంటి ఏర్పాట్లు చేసినప్పుడు ఇదే మనుషులు అద్భుతాలు సాధిస్తారు. మన రెవెన్యూ వాళ్ల తతంగం మనకి తెలుసు. ఎన్నికల్ని అద్భుతంగా నిర్వహిస్తారే! ఒక ప్రధానమంత్రో, మరో వీఐపీనో వస్తే బ్రహ్మాండంగా చేస్తారే! అకస్మాత్తుగా అంతా స్వర్గంలా అయిపోతుంది. ఒక తుఫాన్ వచ్చిందంటే బాగా చేస్తారు. కానీ ఒక ల్యాండ్ రికార్డు కావాలంటే చావగొడతారు. ఇదే మనుషులు. అలాగే ఇస్రో వంటి కొన్ని సంస్థల్లో పద్ధతుల్ని ఎప్పుడైతే మార్చామో అప్పుడు ఫలితాలు వస్తున్నాయి. ఒక దేశం కూడా అంతే. ఇది బలంగా నమ్మాలి. నా జీవితం మొత్తానికీ ఆలంబన ఇది.

నైతిక విలువలు, నీతి అంటే వినటానికి బాగుంటుంది కానీ, ఒక రకంగా నిరాశావాదం. నీలో నీతి లేదు కాబట్టి దేశం ఇట్టా తగలడిందయ్యా అంటే ఇక గొడవ లేదు మనకి. నేను చాలా మోరల్‌గా కనిపిస్తాను. కానీ అంతకంటే దివాళాకోరు వాదన లేదు. మనందరిలో కూడా ధర్మచింతన ఉంది, అధర్మ ప్రవృత్తీ ఉంది. మానవ సహజం అది. అందుకే రెనాల్డ్ నీబర్ అన్నట్టు, 'మనిషిలోని న్యాయంగా వ్యవహరించే శక్తి వల్ల ప్రజాస్వామ్యం సాధ్యం, కానీ అన్యాయం పట్ల మొగ్గు చూపే మనిషి నైజం వల్ల ప్రజాస్వామ్యం అవసరం'. ప్రతి మనిషిలో రెండూ ఉంటాయి. ఈ రెండూ ఉన్నప్పుడు మనం దేని ప్రేరేపించే వ్యవస్థను నిర్మాణం చేశాం?.. ఎప్పుడైతే ధర్మాన్ని పెంచే వ్యవస్థ నిర్మాణం జరిగిందో, ఆ సందర్భంలో ఫలితాలు వస్తున్నాయి. ఎప్పుడైతే అధర్మానికి పాల్పడ్డా లాభం వచ్చే వ్యవస్థ నిర్మాణమై ఉందో అక్కడ మనం దుర్మార్గాన్ని చూస్తున్నాం. అందుకే బాబాసాహెబ్ వ్యవస్థల గురించి మాట్లాడారు.

**అంబేద్కర్‌కే నా ఓటు**

గాంధీ, అంబేద్కర్ ఇద్దరూ మన దేశానికి అత్యంత

కీలకమైన మూలస్తంభాలు. కానీ నా ఓటు ఎప్పుడూ అంబేద్కర్‌కే. అందుకే లోక్‌సత్తా ఉద్యమంలో గానీ, పార్టీలోగానీ గాంధీ, అంబేద్కర్ ఇద్దరూ ఉంటారు. గాంధీజీ నైతికవాది. అసాధారణ వ్యక్తి. రుషి. భారతదేశాన్ని నిర్మించారు. గాంధీజీ లేకుండా భారతదేశం లేదు. కానీ ఆయన నైతికతను తప్ప వ్యవస్థల్ని ఎప్పుడూ అర్థంచేసుకోలేదు. మనుషులు నైతికంగా ప్రవర్తిస్తుంటే, నీతివంతంగా ఉంటే అంతా అయిపోతుందనుకున్నాడు. అలా అయితే గొడవెందుకు? కానీ సమాజమంతా నీతిమంతంగా ఉండదు. ఆటవికుల నుంచి మనుషులుగా వచ్చాం, ఆటవిక ప్రవృత్తిని అదుపు చేసి మనిషి నైతికంగా ప్రవర్తించాలంటే దానికి తగ్గ వ్యవస్థ కావాలి. అది బాబాసాహెబ్ అర్థం చేసుకున్నారు. రాజ్యాంగం అంటే అది. చట్టం అంటే అది.

అయితే ఎక్కడ సమస్య వచ్చిందంటే, ఉదాత్తమైన ఆశయంతో రాజ్యాంగం రాసుకుని, రాజ్యవ్యవస్థ నిర్మాణం చేసుకుంటే.. వలస పాలన పద్ధతులు గానీ, పురాతన కాలం నుంచి బుర్రలను పట్టిన మకిలిగానీ కొనసాగుతుంటే, ఆ వైరుధ్యం ఉంటుంది. వైరుధ్యాల్ని సమన్వయం చేయటమే రాజకీయం లక్ష్యం. ప్రపంచమంతా ఉంది ఇది. రాజ్యాంగ లక్ష్యాలకు, వలస కాల, సాంప్రదాయ పద్ధతులకు మధ్య ఎప్పుడూ ఘర్షణ ఉంటుంది. అది భారత్‌కి మాత్రమే ప్రత్యేకం కాదు. అమెరికా లాంటి దేశంలో అది అంతర్యుద్ధంగా మారింది. చివరికి ఆ దేశంలో ఏబుల్ బాడీడ్ పురుషుల్లో 10 శాతం మంది చనిపోయారు 1861-65 మధ్యకాలంలో. రాజ్యాంగం ప్రవచించిన ఆశయాలు, కొనసాగుతున్న బానిసత్వం మధ్య పోరాటం వల్ల. ప్రపంచమంతా కూడా ఈ ఘర్షణ ఉంది. అది అనివార్యం. సృజనాత్మక రాజకీయం చేసేది ఏమిటంటే, ఈ ఘర్షణను శాంతియుతంగా పరిష్కరిస్తుంది. ప్రతి స్థాయినీ తర్వాతి స్థాయికి పరిణతి దిశగా తీసుకెళ్తుంది. ఇది ఒకరి గెలుపు, ఒకరి ఓటమి కాదు. ఈ మొత్తం నేపథ్యంలో దామాషా పద్ధతిని పరిశీలించాలి.

**ఇద్దరూ తప్పటడుగు వేశారు..**

**రిజర్వుడు నియోజకవర్గాల బదులు అప్పుడే దామాషా పద్ధతిని ప్రవేశపెట్టాల్సింది**

1932లో ఏం జరిగిందీ? హిందూ మతంలో అణగారిన వర్గాలకు కమ్యూనల్ అవార్డు ప్రకటించారు. అంబేద్కర్ సమర్థించారు. కానీ అప్పటికే ముస్లింలకు కమ్యూనల్ అవార్డు ఇవ్వటం వల్ల హిందూ-ముస్లిం విభజన పెరిగిపోయింది, దేశం ముక్కలయ్యే ప్రమాదముంది, కాబట్టి అణగారిన వర్గాలకు ప్రత్యేక నియోజకవర్గం, ప్రత్యేక ఎన్నికలు పద్ధతిని నేను సహించను ప్రాణం పోయినా అని గాంధీజీ పట్టుపట్టారు. దీంతో చివరికి గాంధీ, అంబేద్కర్ ఇద్దరు నేతలూ రిజర్వేషన్ల దారికి వచ్చారు. నా దృష్టిలో ఇద్దరూ తప్పటడుగు వేశారు. ఆనాడు గనక దామాషా ఎన్నికల పద్ధతి పెట్టినట్లయితే సమస్యకు నిజమైన పరిష్కారం లభించి ఉండేది.

ఇప్పుడు కూడా కొందరు కమ్యూనల్ అవార్డు అంటున్నారు. అది ఈ దేశం అంగీకరించదు. సరైన పద్ధతి కూడా కాదు. ఈ విషయం చాలా స్పష్టంగా చెప్పాలి. ఒక్కో కులానికి ఒక్కో ఎలక్టొరేట్ పెట్టి ప్రత్యేకంగా ఎన్నికలు అంటే ఈ దేశం నడవదు. ఏ దేశం మనుగడ సాగించలేదు. ఇది ఆమోదయోగ్యం కాదు. దామాషా ఎన్నికల పద్ధతి మేలు. కానీ ఇందుకోసం రాజకీయాల్ని కొత్తరీతిలో ఆలోచించాలి.

**సాంప్రదాయ రాజకీయ పార్టీలు మారకపోయినా..**
**దామాషా ఎన్నికల పద్ధతిలో ప్రత్యామ్నాయ పార్టీలు సవాలు విసరగలవు**

ఇప్పుడున్న రాజకీయాలు, ఇప్పుడున్న పార్టీలు, ఇప్పుడున్న నాయకులు ఇట్లానే ఉండి దామాషా పద్ధతి అంటే సాంప్రదాయ రాజకీయ నేతలు వాళ్లకి కావలసినవాళ్లని పెడతారు, కీలు బొమ్మలను పెడతారు. స్థానిక ప్రభుత్వాల్లో రిజర్వేషన్లు ఉన్నా యి. ఏం ఉపయోగం ఉంది? మహిళలకు అధికారం ఇవ్వాలని వాటిని ఏర్పాటు చేశారు. కానీ పంచపతులు వచ్చారు. స్థానిక పాలనలో అధికారం ఎలాగూ లేదు. ఉన్నదానికి కూడా మళ్లీ మగవారి పెత్తనం! స్థానిక ప్రభుత్వాల్లో దళిత, బడుగు వర్గాలకు రిజర్వేషన్లు ఉన్నాయి. ఒక్కరికి కూడా అధికారం ఉండదు. మొత్తం స్థానిక ప్రభుత్వాలను నిర్వీర్యం చేశారు గొడవ లేకుండా. సాంప్రదాయ రాజకీయం మారకుంటే ఇవన్నీ జరుగుతాయి. కానీ సృజనాత్మకంగా ఆలోచించండి.

ఈవేళ మంచి రాజకీయం చేస్తూ, ప్రజల ఆస్తిగా ఉండే పార్టీకి ఈ రాష్ట్రంలో 10% ఓట్లు వచ్చాయనుకుందాం. దామాషా పద్ధతిలో ప్రతి ఓటుకీ విలువ ఉంటుంది కాబట్టి.. ఓటర్లు తాము వేసే పది శాతం ఓట్లకి సీట్లు వస్తాయనుకుంటే, పది శాతం రావటం అసాధ్యం కాదు. 10 శాతం ఓట్లు రావటం ఆషామాషీ కాదు, చాలా మార్పు తెస్తుంది. అప్పుడేమవుతుందీ- ఈ సాంప్రదాయ పార్టీల్లో మార్పు లేకపోయినా, వాళ్ల పెత్తందారీ స్వభావాన్ని కొనసాగిస్తున్నా, తమకు బంట్లుగా ఉన్నవాళ్లని అభ్యర్థులుగా పెడుతున్నా కూడా.. మంచి రాజకీయ

పార్టీకి 10 శాతం వస్తే, ఈ పదితో ప్రత్యామ్నాయాన్ని చూపొచ్చు. అప్పుడు మార్పు కోరే రాజకీయ పార్టీ నేతలు ఒక ఆచరణసాధ్య ప్రతిపక్షమవుతారు. ఈవేళ అలాంటి పార్టీ మనుగడ సాధ్యం కాదు. ప్రస్తుత ఎన్నికల వ్యవస్థలో ప్రత్యామ్నాయ పార్టీ ఎంత చైతన్యాన్ని తీసుకొచ్చినా కూడా 10-15 శాతం ఓట్లు వచ్చినా, మీ ప్రభావం ఏమీ ఉండదు. కానీ దామాషా ఎన్నికల పద్ధతి వస్తే, మీరు బలమైన శక్తి అవుతారు.

సాంప్రదాయ రాజకీయ పార్టీలు మారాలీ అనటంలో సందేహం లేదు. కానీ అవి మారకున్నా కూడా పది శాతం ఓట్లు వచ్చే మంచి రాజకీయ పార్టీ సాంప్రదాయ రాజకీయ వ్యవస్థకు బలమైన సవాలు విసరగలుగుతుంది. ఈవేళ సాంప్రదాయ రాజకీయానికి ఆచరణసాధ్య సవాలు లేదు. ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాల్లో, దక్షిణాదిన. కాబట్టి దామాషా పద్ధతి కాన్సెప్ట్ పరంగా కూడా ఆమోదయోగ్యమైనది, విప్లవాత్మక ప్రభావం చూపగలుగుతుంది.

**మూర్ఖ రాజకీయం వల్ల వెంట్రుకవాసిలో తప్పిపోయింది.. ఇప్పుడు అంత తేలిక కాదు**

నేను దామాషా పద్ధతి కోసం ప్రాణం పెట్టి పోరాడాను 2005లో. వెంట్రుకవాసి దాకా వచ్చింది. ఇలాంటివి నేనెప్పుడూ బహిరంగంగా మాట్లాడను. ఆరోజు దామాషా ఎన్నికల పద్ధతి తేవాలనే ప్రయత్నం దాదాపు నెరవేరే పరిస్థితి వచ్చింది. ఆరోజు జాతీయ స్థాయిలో నాయకత్వం బలహీనంగా ఉంది, బీజేపీ కకావికలంగా ఉంది.. కానీ దురదృష్టం కొద్దీ ఆనాడు దామాషా పద్ధతి కోసం కృషి వీగిపోయింది కమ్యూనిస్టు నేతల వల్ల. ఎవరైతే ఇది కావాలని చెప్పి ఎన్నోసార్లు చెప్పారో.. వాళ్ల వల్ల వీగిపోయింది! సమయం వచ్చింది, గొంతు విప్పండి, మీ ఓటు లేకపోతే ప్రభుత్వ మనుగడ నిలవదు, దీన్ని అవకాశంగా తీసుకోండి, వాళ్లు సిద్ధంగా ఉన్నారు అని ప్రాధేయపడ్డాను. ఒకసారి కాదు, 10 సార్లు, 20 సార్లు. కానీ పిడివాదంతో కూడిన రాజకీయం.. ఆ రాజకీయ పరపతినంతా కూడా ఢిల్లీ ఎయిర్‌పోర్టు ప్రయివేటీకరణను ఆపాలి, ప్రపంచ వాణిజ్య సంస్థ అగ్రిమెంట్లు ఆపాలి, అమెరికాతో న్యూక్లియర్ అగ్రిమెంట్ ఆపాలి అనే వాటి మీద పెట్టి, వ్యూహాత్మకంగా దామాషా ఎన్నికల పద్ధతికి రాజకీయ పరపతిని ఉపయోగిస్తే వృథా అవుతుందనే ఆలోచనతో వ్యవహరించారు. వారికీ రాజకీయంగా నష్టం జరిగింది, దేశం నష్టపోయింది. ఎందుకంటే మళ్లీ ఇప్పట్లో అవకాశం రాదు. ఆనాడు రెండు ప్రధాన రాజకీయ పార్టీలూ కకావికలైపోయాయి. అధికారంలో ఉన్న పార్టీ అకస్మాత్తుగా అధికారంలోకి వచ్చిందిగానీ బలం లేదు, భయంతో ఉన్నారు. ప్రతిపక్షంలో ఉన్న పార్టీ ఎందుకు అధికారం పోయిందో తెలియక గందరగోళంలో ఉన్నారు. దేశమంతా అస్తవ్యవస్తంగా ఉంది. గొప్ప అవకాశం ఉన్న సమయం. నేను అది గమనించి విశ్వప్రయత్నం చేశాను. ఇప్పుడు తేలిక కాదు. అధికారంలో ఉన్న పార్టీకి ఓట్లను మించి సీట్లు వచ్చే వ్యవస్థలో వాళ్ల కాళ్లు వాళ్లు నరుక్కోరు. మీరు ఎన్ని చెప్పినా కూడా జరగదు. ప్రపంచంలో ఎక్కడైనా సరే, అధికారంలో ఉన్నవారి ప్రయోజనం కూడా నిలబడుతుంది, దేశానికి కూడా మంచి జరుగుతుంది అంటే, రెండూ కలపటం సాధ్యంగానీ.. నేను గ్యారంటీగా నష్టపోతాను, దేశం బాగుపడొచ్చు అంటే చచ్చినా చేయరు.

**అధికారంలో ఉన్నవాళ్లు దేశభక్తితో ముందుకొస్తే ఒక ఫార్ములా**

ఇప్పుడు మనం చేయాలీ అంటే, దామాషా పద్ధతిలో ఎక్కువ ఓట్లు వచ్చిన పార్టీకి ఇంకా కొన్ని సీట్లు అదనంగా కలిపే పద్ధతి ఏర్పాటు చేస్తామని అధికార పార్టీకి ప్రతిపాదించటం. అది కూడా అంత తేలిక కాదు. వాళ్లకు చేయాలి అని మనసుంటే మనం ప్రయత్నం చేయటం మాత్రమే.

ఒక 10 శాతం సీట్లు అదనంగా కలుపుతారు కాబట్టి మీకు సీట్ల విషయంలో ఇబ్బంది లేదు, సుస్థిర ప్రభుత్వం సాధ్యమవుతుంది అని వారికి నచ్చచెప్పగలగాలి. అలాగే ఓట్ల విషయంలో కూడా. ఎమ్మెల్యేగా పోటీ చేయటానికి 25 కోట్లు ఖర్చు పెట్టే వాడ్ని పట్టుకుని, వాడిని ప్రాధేయపడి, వాడు ఎంతకాలం ఉంటాడో తెలియకుండా ఉండే బదులు.. మీ సిద్ధాంతం, మీ మీద నమ్మకం ఉన్నవారు ఓట్లు వేస్తారు. పది ఓట్లు తగ్గినా కొంపమునగదు కాబట్టి డబ్బు ఖర్చు ఉండదు. కాబట్టి భయం అక్కర్లేదు అని వాళ్లని ఆలోచింప చేయగలిగితే, వాళ్లు గనక నిజంగా దేశభక్తితో ముందుకొస్తే, రాజకీయంగా కూడా వారికి నష్టం లేదు కాబట్టి అలాంటి దామాషా ఫార్ములాని ఆమోదిస్తే సాధ్యమవుతుంది తప్ప ఇవాళ పరిస్థితి అనువుగా లేదు. కాబట్టి మనం చాలా లోతుగా వ్యవహరించాలి.

అదే సమయంలో రాజకీయ పార్టీలు! దామాషా పద్ధతి పెట్టి రాజకీయ పార్టీలు అలాగే కొనసాగితే, ప్రత్యామ్నాయ పార్టీలు నిలబడితే తప్ప దేశం బాగుపడదు.

**పార్టీల్ని ప్రజాస్వామీకరించటమూ అవసరం**

అంతర్గత ప్రజాస్వామ్యం లేకుండా, సీట్లు ఎవరికి ఇస్తున్నారు అని లేకుండా, పార్టీకి ఎలాగూ కొన్ని ఓట్లు వస్తున్నాయి కాబట్టి నాకు నచ్చిన వాళ్లకు సీట్లు

ఇస్తానంటుంటే ప్రజాస్వామ్యం ఇంకా అసాధ్యమవుతుంది. కాబట్టి అంతర్గత ప్రజాస్వామ్యం. ఒక దేశ నిర్మాణం, ప్రజాస్వామ్యం అంటే రాజ్యాంగం, రాజ్య నిర్మాణం కంటే పార్టీలలో మార్పు ఆ దేశానికి, ప్రజాస్వామ్యానికి ప్రాణం. రోడ్ల మీద యుద్ధాలు చేసే, రక్తపాతం సృష్టించే కుహనా విప్లవాలు కాకుండా నిజమైన విప్లవాలు ప్రపంచ ప్రజాస్వామ్యంలో ఎప్పుడు వచ్చాయి అంటే.. ఒక పార్టీని ఓ నాయకుడు పునర్నిర్మాణం చేయగలిగినప్పుడు. మనం పార్టీలంటే ఓట్ల కోసం, అధికారం కోసం పెనుగులాడే యంత్రాలుగా తప్ప పార్టీల్ని మర్చిపోయాం. పార్టీలు లేవు ఇప్పుడు.. ప్రయివేటు ఎస్టేట్‌లు, జమిందారీలు ఉన్నాయి. పార్టీల్ని మనం ప్రజల ఆస్తులుగా మార్చాలి. వాళ్లు మారేలోగా, అలా ప్రజల ఆస్తులుగా పార్టీల్ని మార్చుకునేలోగా ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీలు నిలదొక్కుకోవాలంటే దామాషా పద్ధతి పనికొస్తుంది. కాబట్టి వాదన కోసం కూడా కమ్యూనల్ ప్రాతినిధ్యం కోసం మాట్లాడటం సరికాదు. ఉద్దేశం మంచిదైనా కూడా వ్యతిరేక ఫలితం వస్తుంది.

అంబేద్కర్ ఎంతో ముందుచూపుతో దామాషా పద్ధతికి ఏర్పాటు చేశారు..

**మనం ఒడుపుగా వ్యవహరించాలి**

దామాషా పద్ధతిని ఒడుపుగా అన్వయించగలగాలి. అందుకు బాబాసాహెబ్‌ను అర్థం చేసుకోవాలి. రాజ్యాంగంలో బహుళ సభ్య నియోజకవర్గాలకి ఏర్పాటు ఉందని అప్పట్లో నాకు తెలియదు. ఎల్‌కె అద్వానీ చెప్పారు ఏదో ఒక సందర్భంలో మాట్లాడుతూ. మొట్టమొదటి రిజర్వేషన్‌లో బహుళ సభ్య నియోజకవర్గాలు ఉండేవి, ఎస్.సి, ఎస్.టి సీటు లేదు ఆరోజు అన్నారు. నేను ఆశ్చర్యపోయాను. తర్వాత చూస్తే 1952, 57 ఎన్నికల్లో రిజర్వుడు సీట్లు కేటాయించలేదు. కొన్ని సీట్లు బహుళ సభ్య నియోజకవర్గాలకు కేటాయించారు. అక్కడ జనరల్ సీటు ఒకరు, ఆ అభ్యర్థితో పాటు ఎస్.సి లేదా ఎస్.టి కూడా గెలిచే ఏర్పాటు చేశారు.

అయితే ఏమయిందీ – ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో వి.వి గిరి గారు ఒక సీటు పోటీ చేస్తే, అదే సీటులో ఇంకో సీటు గిరిజనులకు ఇచ్చారు. వాళ్లు సాధారణంగా మనం చెప్పుకునే ట్రైబల్స్ కాదు. రాజ్ గౌండ్లు. కేంద్రమంత్రులుగా పనిచేసిన సంతోష్ మోహన్ దేవ్ కోవకు చెందినవాళ్లు. చట్టంలో ఉన్న ఏర్పాటు ప్రకారం.. అందరి కంటే ఎక్కువ ఓట్లు వచ్చినవాళ్లు నేరుగా ఎన్నికైపోతారు, రెండో సీటు ఎస్.టి వర్గానికి చెందుతుంది. అక్కడ రాజ్ గౌండ్లు బలమైన కమ్యూనిటీ కాబట్టి మొదటి సీటు వాళ్లకి వచ్చేసింది. రెండో సీటు కూడా రిజర్వేషన్‌లో వారికే వెళ్లింది. దీంతో, రెండో అత్యధిక ఓట్లు వచ్చిన వి.వి గిరి గారు ఓడిపోయారు. అప్పట్లో ఆయన పేరున్న కార్మిక నాయకుడు. అలాంటి పెద్ద నాయకుడు ఓడిపోవటంతో ఎందుకు ఓడిపోయాడు అని లోతుగా ఆలోచించకుండా, ఆ వ్యవస్థను తీసివేసి రిజర్వేషన్లు పెట్టారు నియోజకవర్గాల వారీగా. అదెట్లా సాధ్యమైందని చూస్తే నాకు అర్థమైంది అప్పుడు. రాజ్యాంగంలో అంబేద్కర్ ఆ ఏర్పాటు చేశారు. చాలా ముందుచూపుతో ఏర్పాటు చేశారు. ఆ ఏర్పాటుని ఉపయోగించుకోవాలి.

మన ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళనలో, ప్రజలకు ఓటు విలువ అర్థమవటంలో స్థానిక ప్రభుత్వాల సాధికారత కూడా కీలకం గానీ, ఇప్పటికే బాగా ఆలస్యం చేయటం వల్ల కేవలం ఆ మార్గం ద్వారా మార్పుకు కొన్నేళ్లు పట్టవచ్చు. దామాషా పద్ధతి వల్ల మార్పు తక్షణం మొదలవుతుంది. అందుకే స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేస్తూనే దామాషా ఎన్నికల పద్ధతి కోసం వ్యూహాత్మకంగా గట్టి ప్రయత్నం జరగాలి.

**పరస్పర నమ్మకం, అవగాహన ఉండాలి**

మనం ఒడుపుగా నిర్వచిస్తే, చిత్తశుద్ధితో వ్యవహరిస్తే ఇవాళ కాకపోతే రేపయినా వ్యవస్థను ఒప్పించి దామాషా పద్ధతిని సాకారం చేయవచ్చు. ఎందుకంటే, పార్టీలు కూడా అలసిపోయాయి. ఒక్కో అభ్యర్థి 25 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉండటం, అలాంటివాడి కోసం వెతకటం విపరీత భారంగా మారుతోంది. పార్టీల్లో కూడా అందరూ దుర్మార్గులు కాదు. కానీ గతి లేదు. ఆట నియమాలు అలా ఉంటే ఏం చేస్తాం, ఆట ఆడాలి గదా! అలా ఆడాల్సి వస్తోంది. ప్రయివేటుగా మాట్లాడితే, అందరూ వాళ్ల బాధ మీకు చెబుతారు. ఎందుకిట్లా ఉందో వాళ్లకి అర్థం కాదు. కానీ ఎలా ఉందో వాళ్లకి పూర్తిగా తెలుసు. మనం వాళ్లందరినీ శత్రువులుగా, వాళ్లు మనందరినీ శత్రువులుగా చూస్తూ ఉంటే ఏదీ జరగదు. అలా ఒకరినొకరు నిర్వీర్యం చేసుకోవటం వల్ల ఒరిగేదేమీ లేదు. అది ఈ దేశంలో పుష్కలంగా చేసుకుంటున్నాం. మనకు కొంతమేరయినా పరస్పర నమ్మకం, అవగాహన ఉండాలి. న్యాయబద్ధంగా వ్యవహరించే శక్తి ఎక్కడోకచోట ప్రతి మనిషిలో ఉందని నమ్మాలి మనం. అది నమ్మకపోతే ఈ దేశం ఉండదు. నేను చెప్పే మాటలు అంత తేలిగ్గా రుచించవు. కానీ ముఖ్యంగా మనలాంటి సంక్లిష్టమైన, ఎన్నో గందరగోళాలు, భిన్నత్వాలు, తీవ్ర ఆర్థిక అసమానతలున్న దేశంలో వేరే ప్రత్యామ్నాయం లేదు.

# సుప్రీంకోర్టు తీర్పు వల్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది..
# కానీ మన సమస్య ఎన్నికల సంఘం కాదు: జేపీ




ఎన్నికల కమిషనర్ల నియామకానికి త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసం బలోపేతమయ్యేందుకు దోహదం చేస్తుందని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. 1952 నుంచి ప్రతికూల పరిస్థితుల్లో ఎన్నికల్ని స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా నిర్వహించటంలో ఎన్నికల కమిషనర్లు, విస్తృత పాలనా యంత్రాంగం గొప్ప కృషి చేశారన్నారు.

'ఒక నిరుపేద, అత్యధిక శాతం నిరక్షరాస్య దేశంలో విశ్వసనీయతతో, ప్రశాంతంగా, నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహించటం ద్వారా తొలి ప్రధాన ఎన్నికల కమిషనర్ సుకుమార్ సేన్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు. వ్యవస్థల్ని, ప్రక్రియల్ని నిర్మించి బలోపేతం చేయటంతో కాలక్రమంలో నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణ సంస్కృతి అలవడింది.

1977లో అసాధారణ పరిస్థితుల్లో ఎన్నికలు నిర్వహించాల్సిన సవాలును సీఈసీగా టి.స్వామినాథన్ ఎదుర్కొన్నారు. ఆ ఎన్నికల్లో ఒక బలమైన ప్రధానమంత్రి, ఆమె శక్తిమంతమైన మంత్రులు ఓటమి పాలయ్యారు. 'ఎమర్జెన్సీ' పరిస్థితులు ఉన్నప్పటికీ ప్రజలు నిర్భయంగా ఓటు వేశారు. ప్రభుత్వాన్ని వ్యతిరేకించినందుకు జైలు పాలయిన నేతలు రికార్డు మెజారిటీతో ఎన్నికయ్యారు. ఘర్వాల్ లోక్‌సభ ఉప ఎన్నికల్లో హెచ్‌ఎన్ బహుగుణ

**అధికార పక్షం ఒత్తిళ్లకు లొంగని వ్యక్తులు కేంద్ర ఎన్నికల సంఘానికి నేతృత్వం వహించాలని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది. ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షం/ అతి పెద్ద విపక్ష పార్టీ నేతతో కూడిన త్రిసభ్య కమిటీ సూచన ప్రకారం రాష్ట్రపతి ఎన్నికల కమిషనర్లని నియమించాలని తీర్పు ఇచ్చింది. దీనిపై పార్లమెంటు చట్టం చేసే వరకు ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయని పేర్కొంది. జస్టిస్ కె.ఎం జోసెఫ్, జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ హృషికేష్ రాయ్, జస్టిస్ సి.టి రవికుమార్ ధర్మాసనానికి నేతృత్వం వహించారు.**

### ఇదీ నేపథ్యం

**ఎన్నికల కమిషనర్ల నియామకంలో కార్యనిర్వాహక వర్గం అధికారం చెలాయించటం అధికరణం 324(2)కి విరుద్ధమని, అందువల్ల లోపభూయిష్టంగా ఉన్న ప్రస్తుత ఎన్నికల విధానాన్ని మార్చాలని కోరుతూ ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి.**

### ఆ లోపాన్ని సరిదిద్దాలి

**దేశంలో ఎన్నో రాజకీయ పార్టీలు అధికారంలోకి వచ్చినా ఇంతవరకూ అవేవీ ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియకు నిబంధనలను నిర్దేశిస్తూ చట్టం చేయలేదని**

**ధర్మాసనం గుర్తుచేసింది. అదో లోపమని, అందువల్ల అధికరణం 324 కింద చట్టం చేసే సమయంలో దాన్ని సరిదిద్దాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. 'అధికరణం 324కి విశిష్టమైన నేపథ్యం ఉంది. ఎన్నికల కమిషన్ సభ్యుల ప్రస్తుత నియామకాల్లో కార్యనిర్వాహక వర్గానికి పూర్తిస్థాయి అధికారాలున్నాయి. దాన్ని శాశ్వతం చేసేలా చట్టం ఉండకూడదు. రాజకీయ పార్టీలు చట్టం కోరకపోవటానికి కారణమేమిటో స్పష్టంగా కనిపిస్తోంది. తమ చెప్పుచేతల్లో ఉండే కమిషన్ ద్వారా అజమాయిషీ చెలాయించాలని అధికారంలో ఉన్న పార్టీలు కోరుకుంటాయి' అని పేర్కొంది.**

**ధర్మాసనంలోని న్యాయమూర్తులందరూ ఏకాభిప్రాయంతో వెలువరించిన ఈ తీర్పులో జస్టిస్ అజయ్ రస్తోగి.. ఎన్నికల కమిషనర్ల తొలగింపు విషయంలో అనుసరించాల్సిన మార్గదర్శకాలను నిర్దేశించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగింపు విషయంలో అనుసరించే విధివిధానాలనే కమిషనర్ల తొలగింపుకి అనుసరించాలని తెలిపారు. వారి సర్వీస్ నిబంధనల్లో తేడా ఉండకూడదని, కార్యనిర్వాహక వర్గం జోక్యం నుంచి ఎన్నికల కమిషనర్లకు స్వేచ్ఛనివ్వాలని పేర్కొన్నారు.**

**ఎన్నికల సంఘానికి శాశ్వత సచివాలయాన్ని ఏర్పాటు చేసి దాని ఖర్చులకు అవసరమైన ఆర్థిక వనరులను నేరుగా భారత సంఘటిత నిధి నుంచి మంజూరయ్యేలా నిబంధనల్లో మార్పు చేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది.**

**మీడియా నిష్పాక్షికతపైనా ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. మీడియాలోని ఓ భాగం తన పాత్రను విస్మరించి పక్షపాతంగా తయారైందని పేర్కొంది.**


అధికార పార్టీకి వ్యతిరేకంగా పోటీ చేసినప్పుడు ఆయన్ని ఓడించటానికి భారీ ఎత్తున రిగ్గింగ్ చేయటంతో ఉప ఎన్నిక మొత్తాన్నీ ఎస్ఎల్ షగ్దర్ రద్దు చేశారు. బహుగుణ గెలిచారు! అలాగే పెరిశాస్త్రి అలహాబాద్ లోక్‌సభ ఉప ఎన్నికను, 1989 లోక్‌సభ ఎన్నికలను నిర్భీతితో నిర్వహించారు.

స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎన్నికల నిర్వహణ, ఎన్నికల తీర్పులకు విస్తృత ఆమోదం, శాంతియుతంగా అధికార మార్పిడి విషయాల్లో భారత్‌కు ప్రశంసనీయ రికార్డు ఉంది. అదే సుదీర్ఘ ప్రజాస్వామిక చరిత్ర ఉన్న అమెరికాలో పరిస్థితిని చూడండి. నైజీరియా, అనేక ఇతర దేశాలను చూడండి. మన సంక్షోభం ఎన్నికలను నిర్వహించటంలో లేదు.. పార్టీల నియంతృత్వం, ఓట్ల కొనుగోలులో, రాజకీయాల్ని నేరమయం చేయటం, ప్రభుత్వం తాను చేయాల్సిన మౌలిక బాధ్యతల్ని నెరవేర్చకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలను ఫణంగా పెట్టి సంక్షేమం పేరుతో తాత్కాలిక వ్యక్తిగత ప్రయోజనాలకు పెద్దపీట వేయటం, మితిమీరిన అధికార కేంద్రీకరణ, రాజకీయ సమీకరణ కోసం కులం, మతం, ప్రాంతం వంటివి విచ్చలవిడిగా ఉపయోగించటంలో ఉంది. ఇవన్నీ వ్యవస్థీకృత సమస్యలు.

ఎన్నికల్లో చట్టవిరుద్ధ డబ్బు, ఓట్ల కొనుగోలు అవసరం లేకుండా మెరుగైన ఎన్నికల వ్యవస్థ ఏర్పాటు, చట్టబద్ధపాలన, ఓటుకి-ప్రజల జీవితాల్లో ఫలితాలకి, చెల్లించే పన్నులకి-సేవలకి మధ్య సంబంధం ఉండేలా నిజమైన వికేంద్రీకరణ మనకు అవసరం. ఎన్నికల సంఘం, ఎన్నికల నిర్వహణ పాత్ర ఇందులో పరిమితం. ఈలోగా, ప్రస్తుత సోషల్ మీడియా యుగంలో, విభజనలు, పరస్పర అపనమ్మకం పెరుగుతూ వ్యవస్థల పట్ల విశ్వసనీయత తరుగుతున్న తరుణంలో.. ఎన్నికల సంఘం, ఎన్నికల నిర్వహణ పట్ల విశ్వసనీయతను, ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించటం స్వాగతించదగ్గ పరిణామం. కానీ మన కోసం, భవిష్యత్ తరాల కోసం మన ప్రజాస్వామ్యాన్ని క్రియాశీలం చేయాలంటే ఇంకా చాలా చేయాల్సి ఉంది' అని జేపీ పేర్కొన్నారు.

# వాతావరణ మార్పులపై సమయం మించిపోతోంది

పారిశ్రామికీకరణకు ముందునాటితో పోలిస్తే భూతాపంలో పెరుగుదలను 1.5 సెల్సియస్‌కు పరిమితం చేయాలన్న కీలక లక్ష్యాన్ని ప్రపంచ దేశాలు అందుకోలేకపోవచ్చని వాతావరణ మార్పులపై ఏర్పడ్డ ఐక్యరాజ్యసమితి కమిటీ – ఐపీసీసీ హెచ్చరించింది. అయితే ఈ దశాబ్దంలో శరవేగంగా చేపట్టే ఉపశమన చర్యలతో ఈ పరిస్థితిని నివారించవచ్చని ఇటీవల విడుదల చేసిన 'సింథసిస్ రిపోర్టు'లో పేర్కొంది. 1.5 డిగ్రీల సెల్సియస్ లక్ష్య సాధనకు అన్ని రంగాల్లోనూ గ్రీన్‌హౌస్ ఉద్గారాల తగ్గింపు వేగంగా, నిరంతరంగా సాగాలని తేల్చి చెప్పింది. 'ఇప్పుడు మనం చర్యలు చేపడితే.. అందరికీ ఆవాసయోగ్య పరిస్థితులను కల్పించొచ్చు' అని ఐపీసీసీ ఛైర్‌పర్సన్ హోసంగ్ లీ పేర్కొన్నారు. మానవాళి చాలా పలుచటి హిమఫలకంపై ఉందని, అది కూడా వేగంగా కరిగిపోతోందని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ హెచ్చరించారు. 'ఇది ఒక టైమ్‌బాంబు లాంటిది. సమయం మించిపోతోంది. వాతావరణ కార్యాచరణలో పెద్ద ముందడుగు వేస్తే 1.5 డిగ్రీల సెల్సియస్ లక్ష్యాన్ని సాధించవచ్చు' అని పేర్కొన్నారు. ధనిక దేశాలు 2040 నాటికి 'నెట్ జీరో' ఉద్గార స్థాయిని సాధించాలన్నారు. వర్ధమాన దేశాలు 2050లో ఈ లక్ష్యాన్ని అందుకోవాలన్నారు. ఓఈసీడీ దేశాలు 2030 కల్లా బొగ్గు వినియోగాన్ని ఆపేయాలని, మిగతా దేశాలు 2040 కల్లా ఆ లక్ష్యాల్ని అందుకోవాలని కోరారు. ఈ నివేదికను భారత్ స్వాగతించింది. వనరులను ఆచితూచి వినియోగించుకోవాలన్న ప్రధాని మోదీ దార్శనికతకు ఇది అద్దం పడుతోందని యూనియన్ పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ పేర్కొన్నారు. వాతావరణ కార్యాచరణకు అభివృద్ధి చెందిన దేశాల నుంచి వర్ధమాన దేశాలకు అందుతున్న నిధులు




ఏమాత్రం సరిపోవన్నారు.

**ఐపీసీసీ నివేదికలోని కొన్ని ముఖ్యాంశాలు:**

+ ప్రపంచవ్యాప్తంగా 10 శాతం కుటుంబాల తలసరి కర్బన ఉద్గారాలు అధికంగా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా అన్ని కుటుంబాలు వెలువరించే ఉద్గారాల్లో వీరి వాటా 35-45 శాతంగా ఉంది. ఈ జాబితాలో కిందస్థాయిలో ఉన్న 50 శాతం కుటుంబాలు కేవలం 13-15 శాతం ఉద్గారాలను వెలువరిస్తున్నాయి.
+ భూతాపంలో పెరుగుదలకు శిలాజ ఇంధనాల వినియోగమే ప్రధాన కారణం. 2019లో ప్రపంచ గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాల్లో 79 శాతం.. ఇంధనం, పరిశ్రమలు, రవాణా, భవనాల నుంచే వచ్చాయి. వ్యవసాయం, అడవులు, ఇతర రంగాల వాటా 21 శాతం.
+ వాస్తవ అవసరాలకు అనుగుణంగా వర్ధమాన దేశాలు, ముప్పు ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, సమూహాలకు వాతావరణ కార్యాచరణ ధనిక దేశాలు అందించాలి.
+ 1.5 డిగ్రీల లక్ష్యాన్ని సాధించాలంటే 2030 నాటికి కర్బన ఉద్గారాలను సగానికి తగ్గించాలి.

# అసెంబ్లీలో జుగుప్సాకర ధోరణులను నియంత్రించాలి

**ప్రజాసమస్యలపై చర్చించాల్సిన అసెంబ్లీలో వికృత చేష్టలు ఆపాలని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. రాష్ట్రంలో ఎన్నో సమస్యలున్నాయని, వాటిపై మాట్లాడకుండా సామాజిక వర్గాల పేరుతో రాజకీయాలు చేయటం, పరస్పర దాడులు సరికాదన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తీరుపై ఆయన పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో మీడియాతో మాట్లాడారు. నేతలు కొంతయినా ఇంగితజ్ఞానాన్ని ప్రదర్శించి ప్రజాసమస్యలకు పరిష్కారాల గురించి మాట్లాడాలన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నేతలు ఇష్టారాజ్యం ప్రచారం చేశారని, ప్రలోభాలకు గురిచేస్తూ పంపకాలు చేశారని విజయనగరంలో బాబ్జీ అన్నారు. ప్రధానంగా అధికార పార్టీ నేతల తెగింపు పరాకాష్టకు చేరాయన్నారు. కనీస విద్యార్హతలు లేనివారితో కూడా ఓట్లు వేయించారన్నారు. ఈ ఎన్నికల తీరు చూస్తే వచ్చే శాసనసభ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం పరిస్థితేంటనే ఆందోళన కలుగుతోందన్నారు.**







చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తికి ఆంధ్రప్రదేశ్‌లో మొదటిసారిగా గుంటూరు సమీపంలో జిందాల్ గ్రూప్ ఏర్పాటు చేసిన ప్లాంట్‌ను ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. విజయవాడ, గుంటూరు, చుట్టుపక్కల కొన్ని మునిసిపాలిటీల నుంచి చెత్తను ప్రభుత్వ సహకారంతో ఇక్కడకు తరలిస్తారు. వాణిజ్య కలాపాల్లో భాగంగా ప్లాంట్ విద్యుత్‌ను సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్‌తో సంధానం చేశామని, విశాఖపట్నంలో నెలకొల్పిన మరో పెద్దప్లాంట్ కూడా విజయవంతంగా నడుస్తోందని సంస్థ తెలిపింది.













# భాగ్యమ్మ పోరాటపటిమ ఆదర్శప్రాయం

మద్యం బెల్టు దుకాణాల్ని నిర్మూలించాలని, కఠిన మద్యనియంత్రణ అమలు చేయాలనే డిమాండ్‌తో 2007లో పెదగొట్టిపాడు దళితవాడ నుంచి గుంటూరు కలెక్టరేట్ వరకు లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చేసిన పాదయాత్రలో కీలక భూమిక పోషించిన జొన్నలగడ్డ జైభాగ్యమ్మ పోరాటపటిమ ఆదర్శప్రాయమని లోక్‌సత్తా పార్టీ ఏపీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మాదాసు భానుప్రసాద్ అన్నారు. పెదగొట్టిపాడులో ఇటీవల నిర్వహించిన భాగ్యమ్మ సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. లోక్‌సత్తా మద్యనియంత్రణ పోరాటం నుంచి నాయకురాలుగా ఆవిర్భవించిన భాగ్యమ్మ ఆ తర్వాత 2012లో ప్రత్తిపాడు నియోజకవర్గ ఉప ఎన్నికలో కూడా పార్టీ తరపున పోటీ చేసి ప్రజాసమస్యలపై అంకితభావంతో కృషి చేశారన్నారు. మద్యంపై ఆనాడు లోక్‌సత్తా చేసిన పోరాటం ఈవేళ కూడా తెలుగునాట అవసరమన్నారు. మహిళా నాయకురాలు పద్మజారాణి మాట్లాడుతూ, భాగ్యమ్మ పోరాటం పెదగొట్టిపాడు దళితవాడను సమస్యలపై ఏకతాటిపైకి తీసుకొచ్చిందన్నారు.

## మహిళా సాధికారతకు చర్యలేవీ?

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సామాజిక మాధ్యమాల్లో, బయల ఎంతో హడావుడి చేసిన వివిధ పార్టీ నాయకులు, అధికారులు రాజకీయాల్లో, పదవుల్లో మాత్రం వారిని అణగదొక్కుతున్నారని లోక్‌సత్తా పార్టీ ఏపీ రాష్ట్ర నేత ఆకుల దామోదరరావు బొబ్బిలిలో అన్నారు. ప్రజలు ఎన్నుకున్నది మహిళలనైతే, వారి బదులు వారి భర్తలు పెత్తనం చేస్తున్నారన్నారు. సర్పంచ్ ప్రతినిధి, ఎంపీపీపీ ప్రతినిధి, కౌన్సిలర్ ప్రతినిధి అనే కొత్త పదవులు ఏ రాజ్యాంగంలో ఉన్నాయో వారికే తెలియాలన్నారు. నా అక్కచెల్లెమ్మలకు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో సముచిత స్థానం ఇస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చెప్పుకుంటుంటే, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం పూర్తి వ్యతిరేకంగా ఉందన్నారు. అదేరీతిలో మహిళలు, అణగారిన వర్గాల ప్రతినిధులు పెద్దసంఖ్యలో ఉన్న స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, నిధులు లేకుండా చేశారన్నారు. స్థానిక ప్రభుత్వాల నిర్వీర్యం, పురుషాధిక్యతల వల్ల బడుగు బలహీన వర్గాలకు రాజకీయ సాధికారత కొరవడుతోందన్నారు. సమాజం, రాజకీయ, పాలనా వ్యవస్థలు మేలుకోవాలన్నారు. స్థానిక ప్రభుత్వాలకు సాధికారత కల్పించాలని, మహిళల స్థానంలో పురుషులు పెత్తనం చేయకుండా కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

## 'స్పందన' అర్జీలపై నిర్లక్ష్యం

ప్రజల సమస్యలపై 'స్పందన' కార్యక్రమంలో తీసుకునే ఫిర్యాదుల అర్జీలపై దిగువ స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, విచారణ పేరుతో బెదిరింపులకు దిగటం, బలవంతపు రాజీలు చేయటం వంటి వాటికి పాల్పడుతున్నారని లోక్‌సత్తా పార్టీ నేత దేవర శ్రీకృష్ణ అన్నారు. ఫిర్యాదుపై చర్యలు ఏ దశలో ఉన్నాయని సమాచారం అడినప్పుడు సరైన సమాధానం ఇవ్వటం లేదన్నారు. తాము చెప్పిన రీతిలో రాజీ పడక పోతే ఎస్.సి, ఎస్.టి ఎట్రాసిటీ కేసులు పెడతామని కొన్ని సందర్భాల్లో బెదిరిస్తున్నారన్నారు. ఈ సమస్యపై కడపలో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్య పరిష్కారంపై ఫిర్యాదు దారునికి తెలియచేసి సంతకం తీసుకోవాలని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. త్వరలో ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులను కలుస్తామని తెలిపారు. సమావేశంలో టీడీపీ, వామపక్ష, కాంగ్రెస్ నేతలు లక్ష్మిరెడ్డి, కె.ఆంజనేయులు, రాము, సత్తార్, అఖిల పక్ష కమిటీ కన్వీనర్ సి.ఆర్.వి ప్రసాద్, మైనారిటీ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఆలోచన, అనుభవం, అచ్చుపుస్తకం!

## -కె.శ్రీనివాస్, సీనియర్ సంపాదకులు

జెనరేషన్ జడ్ లేదా జెనరేషన్ జి. 1990ల చివరి సంవత్సరాల నుంచి 2010 మధ్య కాలంలో పుట్టినవాళ్లు. వీళ్లని జెన్ జీయర్లు అని జూమర్లు అని కూడా అంటారు. వీళ్లు మిలెనియల్స్ అని పిలిచే జనరేషన్ ఎక్స్ పిల్లలన్నమాట. ఎక్స్ కంటె ముందు తరం బేబీ బూమర్స్, జెన్ జీయర్ల తరువాత వచ్చే తరం జెన్ ఆల్ఫా. ఇదంతా పశ్చిమదేశాలలో ప్రాచుర్యంలో ఉన్న సామాజిక సాంస్కృతిక తరాల వర్గీకరణ. ఇప్పుడు పాతికేళ్లకు అటూ ఇటూగా ఉన్నవాళ్ల దగ్గర నుంచి పది పన్నెండేళ్ల వయసువారి దాకా ఉన్న జెన్ జీయర్లు, ఇంటర్నెట్ అవతరించిన తరువాత పుట్టి, దాని వ్యాప్తిని, స్మార్ట్ ఫోన్ల ఉధృతిని మొదటగా అనుభవంలోకి తీసుకున్నవాళ్లు. వీళ్లు డిజిటల్ దేశానికి మూలవాసులు. ముందుతరం వాళ్లకంటె వీళ్లు యవ్వనాన్ని నిదానంగా గడుపుతున్నారు. 1960ల తరంతో పోలిస్తే ఏమంత సుఖవాదులు కూడా కాదు. మద్యం, సిగరెట్ వంటి సాంప్రదాయ వ్యసనాలు తక్కువే. ఇట్లా ఈ తరానికి ఎన్నో కొత్త లక్షణాలున్నాయి. అనేక కొత్త సమస్యలూ ఉన్నాయి. ఎలక్ట్రానిక్ వస్తువులతో ఎక్కువ సమయం గడుపుతారు. సెక్స్ చాట్ ఎక్కువే చేస్తారు కానీ, వాటి ఫలితాల గురించి, అసలు ఏ పర్యవసానాల గురించీ ఆలోచించరు. అచ్చు పుస్తకాల జోలికి వెళ్లరు, లేదా అతి తక్కువగా చదువుతారు. వీళ్లకు దేనిమీదా ధ్యాస నిలవదు, పదజాలం తక్కువ. చొరవా చాకచక్యమూ ఎక్కువే అయినా, బుర్ర తక్కువ.

పైన చెప్పిన విశేషాలన్నీ ప్రధానంగా అమెరికా, ఆస్ట్రేలియాల్లో, యూరప్ దేశాల్లో యువతరానికి సంబంధించినవి. సంపన్నదేశాలలో పెద్ద పెద్ద ఉద్యోగావకాశాలన్నీ, ఆసియన్ దేశాల యువకులకు రావడానికి కారణం, స్థానిక జెన్ జీయర్లలో కనిపించే క్షీణలక్షణాలే అని సామాజిక జనాభాశాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రపంచీకరణ కాలంలో, ఒక తరం లక్షణాలు కొన్ని ప్రాంతాలకే పరిమితమై ఎంతో కాలం ఉండవు. భారత్ వంటి ఆసియన్ దేశాలలో కనీసం కొన్ని ఉన్నత సామాజిక శ్రేణుల్లో జెన్ జీయర్ లక్షణాలు ఇప్పటికే ఉండి ఉంటాయి. త్వరలో అవి బలంగానే వ్యక్తమవుతాయి, విస్తరిస్తాయి కూడా. ఇప్పుడు యువతరం అంటే దీర్ఘకాలం కొనసాగే జనాభా కాబట్టి, వారి గురించి కలవరంతో ఈ వివరాలు తెలుసుకుంటున్నాము. కానీ, ఇప్పుడు సజీవంగా ఉన్న మునుపటి తరాలు కూడా ఈ లక్షణాలకు కొద్దోగొప్పో లోనవుతున్నాయి. కారణం, డిజిటల్ సాధనాలు, సామాజిక మాధ్యమాలు. ఈ రెంటికీ సానుకూల లక్షణాలు లేవని కాదు, వాటి వల్ల సమకూరిన సార్వజనీనత, ప్రజాస్వామికత లేవని



కాదు. భౌతికంగా, సారాంశంలోనూ కూడా డిజిటల్ సాధనాలు, తగినంత శ్రేష్ఠతను, జవాబుదారీతనాన్ని ప్రదర్శించలేకపోవడం కారణంగా మనుషులకు, సమాజానికీ దీర్ఘకాలికమైన చెరుపు చేస్తున్నాయి.

అమెరికాలో జెన్ జీయర్ల మీద తాజాగా ఒక అధ్యయనం చేశారు. ఆ తరం వారిలో నూటికి 33 మంది, వైద్య సలహాల విషయంలో డాక్టర్ల కంటె టిక్ టాక్ వీడియోలనే ఎక్కువ విశ్వసిస్తున్నారట. మరో 44 శాతం మంది యూట్యూబ్ వీడియోలను అధికంగా నమ్ముతున్నారట. ప్రతి అయిదుగురిలో ఒకరు డాక్టర్ దగ్గరకు వెళ్లడానికి ముందు టిక్ టాక్ చూస్తారట. వైద్య వ్యయం అధికంగా ఉండటం వంటి ఇతర కారణాలు ఉన్నాయి కానీ, అరచేతిలో ఎప్పుడూ సిద్ధంగా ఉండే స్మార్ట్ ఫోన్, నిపుణుల కంటె సామాజిక మాధ్యమాలలో ఉండే ప్రభావకారులు (ఇన్ఫ్లుయన్సర్స్) యువత నిర్ణయశీలతపై పెత్తనం చేస్తున్నాయని అర్థమవుతోంది. మరేదో కారణంతో టిక్ టాక్‌ను అమెరికా కూడా నిషేధించే దారిలో ఉన్నది కానీ, సమస్య టిక్ టిక్ కాదు. డిజిటల్ మాధ్యమాలలో వినోదం, విజ్ఞాన విషయాలపై పరిచయాత్మక లఘు చిత్రాలు ఉండవచ్చు, తప్పు లేదు. కానీ, జ్ఞాన గ్రహణ విధానంలో ప్రధానంగా దేనిమీద ఆధారపడుతున్నాము అన్నది ప్రశ్న.

మానవచరిత్రలో లేఖనం, పఠనం ఎన్నో మజిలీలు దాటుకుని ఇప్పటి స్థితికి వచ్చాయి. రాతిమీద, రాగిరేకుల మీద, తాటియాకుల మీద, వస్త్రాల మీద, ముతక కాగితం మీద అక్షరాలు ఆయా దశలలో వేర్వేరు స్థాయిలలో సమాచారాన్ని,

సందేశాలను, విజ్ఞానాన్ని, సృజనాత్మక అనుభవాన్ని అందించడానికి ప్రయత్నించాయి. అభివృద్ధి క్రమంలో జ్ఞాన ప్రసార సాధనాలు, రూపాలు కూడా మారడం సహజమే. సుమారు మూడు నాలుగు వందల సంవత్సరాల నుంచి ఉనికిలో ఉన్న కాగితపు పుస్తకం, ఆధునిక యుగంలో మనిషికి గొప్ప సాహచర్యం అందించింది. ఇప్పుడు, డిజిటల్ సాధనాలు, ఈ సాహచర్యాన్ని బలహీనపరుస్తున్నాయి. అంతేకాదు, అక్షరం చేసిన ప్రయాణం ఇంతకాలం మానవ మేధను మరింత విస్తృతం, దృఢం చేస్తూ రాగా, డిజిటల్ మజిలీ బలహీనపరుస్తున్నది, జ్ఞానేంద్రియాల గ్రహణపారీణతను అణచివేస్తున్నది.

రోజుకు కనీసం ఇరవై నిమిషాలు చదివే పిల్లలకు, ఏడాదికి ఇరవై లక్షల పదాలతో పరిచయం ఏర్పడుతుందట. టీనేజిలో చదివే అలవాటున్నవారికి, చదవనివారితో పోలిస్తే 25 శాతం అధిక పదజాలంతో పరిచయం ఉంటుందట. చిన్నతనం నుంచి చదివే అలవాటున్నవారు, పెద్దవయసులో ఎక్కువ సమయం చదివేవారు వృద్ధాప్యంలో మేధాశక్తి క్షీణతను తక్కువగా ఎదుర్కొంటారట. పుస్తకపఠనం మానసిక ఒత్తిడిని 70 శాతం దాకా తగ్గిస్తుందట. నిద్రపోవడానికి ముందు చదివేవారిలో నిద్ర నాణ్యత యాభై శాతానికి పైగా పెరుగుతుందట. నవలలు, కథలు వంటి కాల్పనిక వచన సాహిత్యం చదివేవారికి, ఉద్యోగ వ్యాపారాలలో నిర్ణయ కౌశల్యం బాగా పెరుగుతుందట. అమెరికాలో ఏటా 75 వేల డాలర్ల ఆదాయం కలిగినవారిలో నూటికి 86 మంది ఏడాదికి కనీసం ఒక పుస్తకం అయినా చదువుతారట. అమెరికాలో ఒకప్పుడు వయోజన జనాభాలో సగం మంది దాకా సాహిత్యాన్ని చదివేవారట. ఇప్పుడు ఆ శాతం బాగా తగ్గిపోయింది. అమెరికా కంటె, అనేక యూరప్ దేశాల కంటె భారతదేశంలోని చదువరులలో వారంలో పుస్తక పఠనం చేసే గంటల సంఖ్య అధికంగా ఉన్నది. కానీ, భారతదేశంలో అక్షరాస్యత, పాక్షిక అక్షరాస్యత పాళ్లను, విద్యాధికులలో కూడా చదువరుల సంఖ్యను పరిగణలోకి తీసుకుంటే, పరిస్థితి ఏమంత ఆశావహంగా లేదు. ఇక వేగంగా వ్యాపిస్తున్న డిజిటల్ సాధనాల కారణంగా, అనేకమంది పరిమిత అక్షరాస్యులు, విద్యాధికులు పుస్తక పఠనానికి దూరంగా ఉంటున్నారు.

కేవలం పుస్తక పఠనానికి ఉద్దేశించిన కిండిల్ వంటి ఈ-రీడర్ల వల్ల అపకారం కంటె ఉపయోగమే అధికం. సంపన్నదేశాలలో సైతం ఈ-రీడర్ల పఠనాన్ని పుస్తక పఠనంతో సమానంగా పరిగణిస్తున్నారు. పుస్తకం చదువుతున్న అనుభూతినే ఇవ్వడం, ఒక చిన్న సాధనంలో అనేక పుస్తకాలు నిల్వ చేసుకునే, చదువుకునే అవకాశం ఉండడం, నిర్మితంగా నిఘంటువు ఉండడం వంటి సదుపాయాలతో కాగితపు పుస్తకాన్ని మించిన ప్రయోజనం ఈ-రీడర్లు అందిస్తున్నాయి. సాధ్యమైనంత వరకు ఈ-రీడర్ల తెర కాంతి కంటికి అలసట కలిగించకుండా కూడా ఈ-రీడర్లు జాగ్రత్త వహిస్తున్నాయి. దురదృష్టవశాత్తూ, ఈ-రీడర్లను మరింతగా అభివృద్ధి చేయడం మీద ఆయా కంపెనీలు శ్రద్ధ వహించడం మానేశాయి. స్మార్ట్ ఫోన్లలోనే ఈ-రీడింగ్ యాప్‌లను జోడించి, అందించడం మీదే దృష్టి పెట్టాయి. అమెజాన్ కూడా ఫైర్ టాబ్లెట్, ఫోన్ల తయారీ చేపడుతోంది. పుస్తకానికి, ఈ-రీడర్‌కు ఉండే ప్రధాన లక్షణమైన ఏకాగ్రతను స్మార్ట్ ఫోన్లు దెబ్బతీస్తాయి. కంటికి హాని కలిగిస్తాయి. మేధాశక్తిని బలహీనపరుస్తాయి.

పుస్తకం చదవడానికి మనం ఉద్యుక్తులమవుతున్నప్పుడు, కాలాన్ని, స్థలాన్ని ఏర్పరచుకుంటాము. అంతరాయాలు అసలే ఉండలేవనలేము కానీ, పరిమితం చేసుకోగలుగుతాము. పఠనంలోకి దిగిన తరువాత ఒక ఆవరణలోకి ప్రవేశించి, అందులోనే నిమగ్నం అవుతాము. పదే పదే దృశ్యాన్ని రిఫ్రెష్ చేసే తెర ఉండదు, ఉన్నట్టుండి పలకరించే నోటిఫికేషన్లు ఉండవు, లింకులతో మరేదో పాప్ అప్‌లతో మన దృష్టి మరోవైపు మళ్లదు. అక్షరాల నుంచి కాల్పనిక సాహిత్యమో, కవిత్వమో, విజ్ఞాన విషయమో, సిద్ధాంత అంశమో మన బుద్ధి జాగ్రత్తగా, ఒక క్రమపద్ధతి ప్రకారం గ్రహిస్తూ ఉంటుంది. చదువుతున్నప్పుడు అనుభూతి కానీ, అధ్యయనం కానీ ఆయా పాఠ్యాలు అందించే తీరులో పాఠకులకు అందుతాయి. సృజనను గ్రహించి, దృశ్యాలనో, భావుకతనో ఊహించుకుంటాము. పాత్రలకు రూపురేఖలను ఆపాదించుకుంటాము. చిత్రించిన పరిస్థితులను, వాటిలోని సమస్యలను అర్థం చేసుకుంటాము, ఒక సావధానస్థితిలో విజ్ఞానాంశాలను నిక్షిప్తం చేసుకుంటాము, డిజిటల్ సాధనాలతో చదువు మనలను నిలకడగా ఉండనివ్వదు. తేలికపాటి చదువుకు, వినోద రచనలకు కొంత పనికివస్తుందేమో కానీ, అవగాహనకు, అధ్యయనానికి, అభ్యసనానికి డిజిటల్ సాధనాలు పెద్దగా ఉపయోగపడవు.

ప్రపంచంలో అన్ని దేశాలూ విద్యాభ్యాసంలో అచ్చుపుస్తకాలను, చేతిరాతను విధిగా కొనసాగిస్తున్నాయి. ఫోన్ కెమెరాలు వచ్చినా సాంప్రదాయిక కెమెరాలే గౌరవం అందుకుంటున్నాయి. డిజిటల్ రూపంలో వచ్చే పుస్తకాలు, ఫోటో తీసిన పేజీలలో అక్షరాలను కూడా వేరుచేసి చదవగలిగిన టెక్నాలజీ, ఈ-రీడర్లు ఇవన్నీ పుస్తకాల ప్రయాణంలో ముఖ్యమైన పురోగతులే. కానీ, అనేక తపోభంగాలకు ఆస్కారమిచ్చే స్మార్ట్ ఫోన్లు, టాబ్లెట్లు అధ్యయనానికి, అభిరుచి పఠనానికి పనికిరావు. సమాచార సమృద్ధి వల్ల, అనేక వాచకాల ముమ్మరం వల్ల జ్ఞానం పెరగదు. తార్కిక శక్తి, వివేచన, ఊహాసామర్థ్యం వీటికి ఆస్కారమిచ్చే జ్ఞాన ప్రసార సాధనం మన బౌద్ధిక, మానసిక వికాసానికి పూచీపడుతుంది. ప్రస్తుతానికి, అది అచ్చు పుస్తకం.

ఈ ఏడాదికి పుస్తకాల రుతువు హైదరాబాద్ బుక్ ఫెయిర్‌తో మొదలైంది. ఆ తరువాత విజయవాడలో కొనసాగింది. ఆ తరువాత మరిన్ని పట్టణాలలో, జిల్లా కేంద్రాలలో పుస్తకాల జైత్రయాత్ర కొనసాగుతుంది. అచ్చుపుస్తకమే ఎందుకు చదవాలో తెలుసుకుని చదువుదాం. కొత్త పుస్తకపు పరిమళంతో గుప్పుమందాం.

(కర్టెసీ: ఆంధ్రజ్యోతి)

# ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ 2023-24

ఆదాయానికి, ఖర్చుల అంచనాలకు మధ్య అంతరం ఎక్కువగా ఉందని గత రెండు బడ్జెట్‌లలో స్పష్టమైన సంకేతం కనిపిస్తున్నా ఈ ఏడాది కూడా అదే ఒరవడిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆర్భాటపు అంకెలతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. మద్యనిషేధం హామీని కనీసం మద్యనియంత్రణ స్థాయిలోనన్నా అమలు చేయకుండా, అమ్మకపు టార్గెట్లు పెంచి మరీ ఆదాయమార్గం చేసుకుంది.

ఆంధ్రప్రదేశ్ 2023-24 బడ్జెట్‌ను ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శాసనసభలో ప్రవేశపెట్టారు. నవరత్నాలు, ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న పథకాల ఆధారంగా రూపొందించిన అభివృద్ధి కార్యక్రమాల ద్వారా సుస్థిరాభివృద్ధి సాధన కోసం ఒక సమ్మిళిత విధానాన్ని తమ ప్రభుత్వం అవలంబించిందన్నారు. మొత్తం రూ.2,79,279.27 కోట్లతో బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ముఖ్యాంశాలు:

**సంక్షేమం పేరుతో అమలు చేస్తున్న పథకాలకు బడ్జెట్‌లో రూ.51,345.89 కోట్లు కేటాయించారు**

- సాధారణ విద్యకు రూ.32,198.39 కోట్లు, ఇందులో పాఠశాల విద్యకు రూ.29,690.71 కోట్లు
- గ్రామీణాభివృద్ధికి రూ.17,531.79 కోట్లు
- వైద్య రంగానికి రూ.15,882.34 కోట్లు
- నీటిపారుదల, వరదల నియంత్రణకు రూ.11,908.10 కోట్లు

**వీటిలో రంగాలవారీ కేటాయింపులు (శాతాల్లో):**

- సాధారణ విద్య - 16.87
- క్రీడలు, యువజన సర్వీసులు - 0.07
- సాంకేతిక విద్య - 0.27
- కళలు, సంస్కృతి - 0.01
- వైద్యం - 8.32
- తాగునీరు, పారిశుద్ధ్యం - 1.15
- గృహనిర్మాణం - 3.3
- పట్టణాభివృద్ధి - 4.92
- సమాచార పౌర సంబంధాలు - 0.15
- సంక్షేమం - 26.9
- ఉద్యోగ, ఉపాధి కల్పన - 0.55
- సామాజిక భద్రత, సంక్షేమం - 2.07
- వ్యవసాయం, అనుబంధ సేవలు - 7.36
- గ్రామీణాభివృద్ధి - 9.19
- నీటి పారుదల, వరద నియంత్రణ - 6.24
- ఇంధనం - 3.43
- పరిశ్రమలు, ఖనిజాలు - 1.36



- శాస్త్ర, సాంకేతిక, పర్యావరణం - 0.01
- పర్యావరణ సేవలు - 2.42
- పెట్టుబడి వ్యయం కేవలం 11%

మౌలిక వసతులు, సాగునీటి ప్రాజెక్టులు వంటి కీలక నిర్మాణ రంగాలపై చేసే ఖర్చు రాష్ట్ర దీర్ఘకాల అభివృద్ధికి వీలు కల్పిస్తుంది. కానీ బడ్జెట్‌లో కొన్నేళ్లుగా మూలధన వ్యయ కేటాయింపులు తక్కువగా ఉంటున్నాయి. నవరత్నాలకు, ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలకు తప్ప.. వ్యవసాయం, సాగునీరు వంటి రంగాలకు అంతంతమాత్రం కేటాయింపులతో సరిపెడుతున్నారు. నవరత్న పథకాల కోసం ఖర్చు చేస్తున్న నిధుల్నే.. వివిధ కార్పొరేషన్లకు కేటాయింపులుగా చూపించారు. ప్రస్తుత బడ్జెట్‌లోనూ ఇదే ధోరణి కనిపించింది.

పెట్టుబడి కేటాయింపుల్లో కూడా ఖర్చు చేసే మొత్తం ఇంకా తక్కువగా ఉంటోంది. గతేడాది బడ్జెట్‌లో మూలధన వ్యయంగా రూ.30,679 కోట్లు ప్రతిపాదించారు. కానీ 2023 జనవరి వరకు ఉన్న అధికారిక గణాంకాల ప్రకారం పది నెలల్లో కేవలం రూ.7,367 కోట్లు ఖర్చు పెట్టారు. మూలధన వ్యయాన్ని ప్రస్తుత బడ్జెట్‌లో రూ.31,061 కోట్లుగా చూపించారు. మొత్తం అంచనాల్లో ఇది కేవలం 11 శాతం మాత్రమే.

**అప్పులు, వడ్డీల భారం**

కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన రూ.1.80 లక్షలకు పైగా కోట్ల పెండింగ్ బిల్లులు, ప్రభుత్వోద్యోగులకు పెండింగ్‌లో ఉన్న రూ.16,000 కోట్ల బకాయిలు ఎలా చెల్లిస్తారో బడ్జెట్‌లో స్పష్టం చేయలేదు. రూ.73,055 కోట్లు వివిధ రుణాల రూపంలో సమీకరించుకోవాలని ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించారు. 2022-23 బడ్జెట్‌లో రూ.65,031 కోట్లు అప్పు చేయనున్నట్టు ప్రతిపాదించిన ప్రభుత్వం, సవరించిన అంచనాల్లో రూ.64,303 కోట్లుగా చూపింది. కానీ వాస్తవంగా అప్పులు ఇంకా చాలా ఎక్కువగా ఉన్నాయని అంచనా.

## రాష్ట్ర బడ్జెట్ 2023 సమగ్ర స్వరూపం (అంకెలు రూ.కోట్లలో)

| వివరం | 2022-23 బడ్జెట్ అంచనాలు | 2022-23 సవరించిన అంచనాలు | 2023-24 బడ్జెట్ అంచనాలు |
|---|---|---|---|
| ఎ. ప్రారంభ నిల్వ | 1824.28 | -64.8 | 177.96 |
| బి. రెవెన్యూ వసూళ్లు | 1,91,225.11 | 1,76,448.39 | 2,06,224.01 |
| 1. కేంద్ర పన్నుల్లో వాటా | 33,050.00 | 38,176.74 | 41,338.02 |
| 2. పన్ను ఆదాయం | 91,049.61 | 84,389.37 | 1,02,651.35 |
| 3. పన్నేతర ఆదాయం | 11,092.50 | 6,511.04 | 15,400.00 |
| 4. గ్రాంట్లు | 56,033.00 | 47,371.24 | 46,834.64 |
| సి. మూలధన వసూళ్లు | 65,031.45 | 64,303.71 | 73,055.26 |
| 5. బహిరంగ మార్కెట్ రుణాలు | 55,000.00 | 57,478.00 | 63,000.00 |
| 6. స్వల్పకాలిక రుణాలు | 2,416.00 | 0 | 0 |
| 7. కేంద్ర ప్రభుత్వం నుంచి రుణాలు | 5,000.00 | 5,500.00 | 6,522.09 |
| 8. ఇతర రుణాలు | 2,400.00 | 2,000.00 | 2,500.00 |
| 9. డిపాజిట్లు, లావాదేవీలు (నికరం) | 178.29 | -727.93 | 976.85 |
| 10. రుణాలు, అడ్వాన్సులు | 37.16 | 53.64 | 56.32 |
| 11. ఇతర వసూళు | 0 | 0 | 0 |
| 12. కంటింజెన్సీ నిధి | 0 | 0 | 0 |
| డి. మొత్తం వసూళ్లు | 2,56,256.56 | 2,40,752.10 | 2,79,279.27 |
| ఇ. రెవెన్యూ వ్యయం | 2,08,261.26 | 2,05,555.95 | 2,28,540.71 |
| 13. ఇందులో వడ్డీ చెల్లింపులు | 21,340.16 | 25,288.18 | 28,673.71 |
| ఎఫ్. మూలధన వ్యయం | 30,679.57 | 16,846.69 | 31,061.04 |
| జి. రుణాలు, అడ్వాన్సులు | 1045.55 | 1816.14 | 1266.10 |
| హెచ్. మూలధన చెల్లింపులు | 16,270.18 | 16,290.56 | 18,411.42 |
| ఐ. మొత్తం వ్యయం | 2,56,256.56 | 2,40,509.34 | 2,79,279.27 |
| జె. ముగింపు నిల్వ | 1824.28 | 177.96 | 177.96 |
| కె. రెవెన్యూలోటు (బి-ఇ) | -17,036.15 | -29,107.56 | -22,316.70 |
| ఎల్. ద్రవ్యలోటు | -48,724.11 | -47,716.75 | -54,587.52 |
| ఎం. ప్రాథమిక లోటు | -27,383.95 | -22,428.57 | -25,913.81 |

కొత్త బడ్జెట్‌లో ప్రతిపాదించిన డెబ్బై వేల కోట్ల పైచిలుకు అప్పులు కూడా ప్రభుత్వ కార్పొరేషన్లు వంటి వాటి ద్వారా రుణాల్ని కలిపితే భారీగా పెరిగే అవకాశం ఉంది. బడ్జెట్‌లో చూపించిన అప్పుల్ని మినహాయిస్తే.. రెవెన్యూ రాబడి కింద రూ.2,06,224.01 కోట్లు వస్తాయని ప్రభుత్వం లెక్కించింది. రెవెన్యూ ఖర్చులు రూ.2,28,540 కోట్లు చూపింది. ఈ బడ్జెట్‌లో దాదాపు రూ.47,084 కోట్లు అప్పులు తీర్చేందుకు, వడ్డీలు చెల్లించేందుకే కేటాయించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అప్పులు తీర్చటానికి అప్పులు చేయాల్సి వస్తోందని తాజా బడ్జెట్ స్పష్టంగా తెలియచేస్తోంది.

- 2023-24 ఆర్థిక సంవత్సరం చివరినాటికి రాష్ట్రంలో రూ.4,83,009 కోట్ల రుణం (పబ్లిక్ డెట్) ఉంటుందని ప్రభుత్వం లెక్కలు వేసింది. ఇది జీఎస్‌డీపీలో 33.32 శాతం. ఒకవైపు ప్రభుత్వం తెచ్చిన రుణాలు, వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాలు సమీకరిస్తూ వాటి ఖాతాల్లోనే ప్రభుత్వమూ ఖర్చులు చూపిస్తున్న నేపథ్యంలో ఈ లెక్కల విశ్వసనీయత ప్రశ్నార్థకమవుతోంది. కార్పొరేషన్ రుణాలను ప్రభుత్వం సమగ్రంగా వెల్లడించలేదు. మొత్తం కార్పొరేషన్ల రుణాలను పరిగణలోకి తీసుకుంటే జీఎస్‌డీపీలో రుణాల శాతం ఇంకా పెరిగిపోతుంది.

**మద్యం ఆదాయ మార్గం**

- మద్యం విక్రయాల ద్వారా ఒక్క ఎక్సయిజ్ సుంకం పద్దు కిందే 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.18,000 కోట్ల ఆదాయం రాబట్టాలని బడ్జెట్‌లో ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. మద్యం విక్రయాల విలువలో స్టేట్ ఎక్సయిజ్ కాకుండా అదనంగా వ్యాట్, స్పెషల్ మార్జిన్

**వ్యవసాయానికి రూ.41,436 కోట్లు - చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం**

చిరుధాన్యాల సమగ్ర సాగు విధానంలో భాగంగా వచ్చే అయిదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల ఎకరాల్లో వాటి సాగును ప్రోత్సహించనున్నట్లు వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఏడు లక్షల మంది రైతులకు రూ.455 కోట్లతో టార్పాలిన్లు, స్ప్రేయర్లు అందిస్తామన్నారు. రూ.41,436.29 కోట్లతో రూపొందించిన 2023-24 వ్యవసాయ బడ్జెట్‌ను ఆయన అసెంబ్లీలో ప్రవేశపెట్టారు.

## ఆదాయం, అంచనాల మధ్య అంతరం

2021-22లో అంచనాలు, సవరించిన అంచనాలు, వాస్తవ లెక్కలు, 2022-23 బడ్జెట్ అంచనాలు, వాస్తవ లెక్కలు చూస్తే ప్రస్తుత బడ్జెట్ లెక్కలు ఎంతవరకు విశ్వసనీయమైనవనే అనుమానాలకు తావిస్తున్నాయి. ప్రతిపాదిత బడ్జెట్ అంకెలు ఫ్యాన్సీగా ఉండటాన్ని చూస్తే గణాంకాలపై ఇంకా అనుమానాలు కలుగుతాయి. 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వాస్తవ లెక్కల్ని తాజాగా తేల్చారు. వాటినే పరిగణలోకి తీసుకుంటే.. నాడు ప్రభుత్వం రూ.1,77,196.48 కోట్ల రెవెన్యూ రాబడి వస్తుందని ఆశించింది. చివరకు లెక్కలు తేలేసరికి ఆ మొత్తం రూ.1,50,552.49 కోట్లకే పరిమితమైంది. దాదాపు రూ.27 వేల కోట్ల రాబడి తగ్గిపోయింది. గతేడాది బడ్జెట్ నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1,91,225 కోట్ల రాబడిని అంచనా వేశారు. పది నెలల రాబడి, రెండు నెలల అంచనాల ఆధారంగా అది రూ.1,76,448 కోట్లకే పరిమితమవుతుందని భావిస్తున్నారు. రాబడి ఎంత తగ్గితే అంతమేర అప్పులు పెరిగే అవకాశముంది. అలాగే కేంద్రం నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.56,033 కోట్లు వస్తాయని అంచనా వేయగా, తాజాగా సవరించిన లెక్కల్లో అది రూ.43,371 కోట్లకు పరిమితం చేశారు.

వంటి ఇతరత్రా పన్నులు కూడా ఉంటాయి. ఈ మేరకు ఆదాయం సమకూరాలంటే కనీసం రూ.30-33,000 కోట్ల మేర మద్యం విక్రయాలు జరపాలని అంచనా వేస్తున్నారు. 2019-20లో రూ.20,928 కోట్లు, 2020-21లో రూ.20,189 కోట్లు, 2021-22లో రూ.25,023 కోట్ల విలువైన మద్యం అమ్మిన రాష్ట్ర ప్రభుత్వం 2022-23లో ఫిబ్రవరి వరకు రూ.26,500 కోట్ల మద్యం విక్రయించినట్టు అంచనా. ఈ ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేనాటికి రూ.28,000 కోట్ల విలువైన మద్యం అమ్ముతుందని అంచనా.

రాబోయే కొన్నేళ్లలో మద్యంపై వచ్చే ఆదాయాన్ని హామీగా చూపించి ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ (ఏపీఎస్‌బీసీఎల్) ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వేల కోట్లు అప్పు చేసింది. ఏపీఎస్‌బీసీఎల్ బాండ్లను వేలం వేసి అధిక వడ్డీకి రూ.8,300 కోట్ల రుణం తీసుకొచ్చింది. ఈ అప్పులు తీర్చాలంటే ఏపీఎస్‌బీసీఎల్ వ్యాపారాన్ని మరింత విస్తరించాలి. మద్యం అమ్మకాలను పెంచుకోవటం ద్వారానే ఇది సాధ్యమనే మాట వినిపిస్తోంది.

## సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలకు అన్యాయం: భీశెట్టి బాబ్జీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపులకు, అభివృద్ధిపై ఖర్చులకు పొంతన లేదని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విజయనగరంలో మీడియాతో మాట్లాడుతూ అన్నారు. పెండింగ్‌లో ఉన్న సాగు, తాగునీటి ప్రాజెక్టులకు, కొత్త, మూతపడిన పరిశ్రమలకు తగిన కేటాయింపులు లేవన్నారు. కీలకమైన వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, పురపాలక పట్టణాభివృద్ధి శాఖలదీ అదే పరిస్థితి అన్నారు. గొప్పల కోసం బడ్జెట్‌ను రూ.2.79 లక్షల కోట్లుగా ప్రకటించారన్నారు. యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల మధ్య తేడాలను స్పష్టం చేయలేదని, అంకెల గారడీ చేశారన్నారు. సమావేశంలో లోక్‌సత్తా జిల్లా ప్రతినిధి అల్లంశెట్టి నాగభూషణం పాల్గొన్నారు.






# ఏపీ సామాజిక, ఆర్థిక సర్వే నివేదిక

ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయంలో 13.98% వృద్ధి నమోదైందని 2022-23 సామాజిక, ఆర్థిక సర్వేలో రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. గతేడాదితో పోలిస్తే రూ.26,931 కోట్లు పెరిగిందని వెల్లడించింది. దేశ తలసరి ఆదాయంలో వృద్ధి కంటే ఇది అధికమని తెలిపింది. 2022-23 సంవత్సరంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) రూ.13.17 లక్షల కోట్లకు చేరిందని, 16.22% వృద్ధి నమోదైందని పేర్కొంది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సచివాలయంలో సామాజిక, ఆర్థిక సర్వే నివేదికను విడుదల చేశారు. ప్రధానాంశాలు:

- రాష్ట్ర స్థూల ఉత్పత్తి 2021-22లో రూ.11,33,837 కోట్లు ఉండగా, 2022-23లో రూ.13,17,728 కోట్లుగా అంచనా వేశారు.
- రాష్ట్ర తలసరి ఆదాయం 2021-22లో రూ.1,92,587 ఉండగా.. 2022-23లో రూ.2,19,518కి చేరుతుందని లెక్కేశారు.

**రంగాలవారీ వృద్ధి (ప్రస్తుత ధరల ప్రకారం)**

- **వ్యవసాయం:** 20.72%, ఉద్యానం 12.58%, పశు సంవర్ధకం 7.32%, మత్స్యరంగం 19.41%
- **పారిశ్రామికం:** ఖనిజ తవ్వకాలు 15.81%, ఉత్పత్తి 11.81%, విద్యుత్తు, గ్యాస్ ఇతరాలు 30.96%, నిర్మాణం 16.94%
- **సేవారంగం:** వాణిజ్యం, హోటళ్లు 28.42%, రైల్వే 17.82%, రవాణా, ఇతరాలు 21.64%, రియల్ ఎస్టేట్ 13.14%

**నవరత్నాల అమలుతో ప్రగతి**

నవరత్నాల అమలులో భాగంగా నగదు బదిలీ ద్వారా రూ.1.97 లక్షల కోట్లను ప్రజల ఖాతాలో జమ చేసినట్లు ఆర్థిక సర్వే నివేదికలో ప్రభుత్వం పేర్కొంది. విద్యారంగంలో మన బడి 'నాడు-నేడు' పథకం అమలు ద్వారా మూడేళ్లలో 57,189 పాఠశాలలు, 3,280 విద్యాసంస్థల్లో మౌలిక సౌకర్యాల అభివృద్ధికి రూ.16,022 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపింది.

- రైతు భరోసాకు రూ.27,063 కోట్లు, ఉచిత పంటల బీమాకు రూ.6,872 కోట్లు, సున్నా వడ్డీ, పంట రుణాలకు రూ.1834 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించింది. ఆక్వా రైతులకు విద్యుత్తు రాయితీ కింద రూ.2747 కోట్లు, వ్యవసాయ విద్యుత్తు రాయితీకి రూ.27,800 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించింది.
- పెట్టుబడుల సదస్సులో రూ.13.42 లక్షల కోట్లకు 378 ఒప్పందాలు కుదుర్చుకోవటం ద్వారా 6 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని తెలిపింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) రంగంలో రూ.19,115 కోట్ల పెట్టుబడితో 69 భారీ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది.
- సుస్థిర లక్ష్యాల సాధన (ఎస్‌డీజీ)లో రాష్ట్రం నాలుగవ ర్యాంకు సాధించినట్లు తెలిపింది. ఎస్‌డీజీ సాధనకు నవరత్నాలను అనుసంధానించినట్లు పేర్కొంది.
- జిల్లాల పునర్వ్యవస్థీకరణ, రైతు భరోసా కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల విధానం, రీ సర్వే, భూ హక్కు, భూ రక్ష, స్పందన కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు వివరించింది.

# కొద్దిపాటి త్యాగాలతో మార్పు సాధ్యం

## డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్‌తో కటారి ముఖాముఖి (మూడో భాగం)

**కటారి:** దేశవ్యాప్తంగా ఆజాదీగా అమృతోత్సవాల పేరుతో పెద్ద ఎత్తున సంబరాలు జరిగాయి. అయితే వందేళ్ల సంబరాలకు వెళ్లే లోపు ఏం చేయాలనే దిశా నిర్దేశం ఎక్కడా లేదు. సంబరాలు తప్ప లోతైన చర్చ ఏ అంశం మీదా కూడా దేశంలో జరగడం లేదు. ఏ అంశాలపై చర్చించుకుంటే బాగుంటుంది.

**జేపీ:** దేశంలో చర్చ చాలా నాసిరకంగా ఉంది. చట్ట సభల్లోనూ నాసిగా ఉన్నాయి. పత్రికల్లో చర్చ కూడా చాలా అసంపూర్ణంగా, తాత్కాలికమైన రాజకీయ అంశాలకే పరిమితమైంది. మీడియా కూడా బాధ్యత తీసుకోవాలి. మేధావులు అనే వారు సైతం చాలా మంది ఏది పడితే అది అవాకులు చవాకులు అందరిపైనా పెట్టి మాట్లాడటం తప్ప లోతుగా చర్చ లేదు. గుడ్డివాళ్ల ప్రపంచంలో ఒంటి కన్నువాడే మహారాజు అంట..కాబట్టి కొద్దిపాటి మాటకారితనం ఉంటే మేధావులుగా చలామణి అయిపోతున్నారు. అప్పుడు లోతుకు వెళ్లాల్సిన అవసరం లేదు. మన దేశంలో అది జరుగుతోంది. చాలా మంది మేధావులు అనేవాళ్లకు కూడా విషయం మీద అధికారం లేదు, వాస్తవాలు తెలుసుకునే ఓపిక లేదు. ఏదో ఆ సందర్భాన్ని బట్టి మాట మాట్లాడేస్తాం. అది పెద్దమనిషి మాటగా చలామణి అయిపోతుంది. ఈ కారణంగా చర్చ దెబ్బతిన్న మాట వాస్తవమే. నా దృష్టిలో ఐదారు అంశాలు చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి. చాలా ఏళ్లు కొన్ని పొరపాట్లు చేశాకా, 1991లో మార్పులు వచ్చాకా, ఇటీవల కొన్ని మార్పులు వచ్చాకా, మొట్టమొదటిసారిగా 25 ఏళ్లపాటు ఏడెనిమిది శాతం ఆర్థికాభివృద్ధి ఆగకుండా జరిగే అవకాశం మన ముందు ఉంది. కానీ గ్యారెంటీ లేదు. దానికి ఇవాళ సరైన ఏర్పాటు జరగాలి. అది జరగకపోతే మనం ఎన్ని కబుర్లు చెప్పుకున్నా ఉపయోగం లేదు. ప్రజల జీవితాల్లో మార్పు రావాలి..దానికి కీలకమైన అవరోధాలు కొన్ని ఉన్నాయి. మౌలిక సదుపాయాల విషయంలో మన సమాజంలో లోతుగా ఆలోచించాలి. ఎక్కడ పొరపాటు జరిగింది..ఎక్కడ బలముంది..భవిష్యత్తు బాగోవాలంటే ఏం చేయాలనే ఆలోచన ఉండాలి. ఒకప్పుడు కంప్యూటర్లు వస్తే దేశం నాశనం అవుతుందని ప్రతీ పార్టీ ఏటా సమ్మె చేసేది..ఇప్పుడా




పరిస్థితి లేదు. ఇది అర్థం చేసుకోవడానికి చాలా కాలం పట్టింది. అలాగే చాలా అవసరమైన పనులు చేస్తే ఈ దేశం కొంప మునిగిపోతుందనే ధోరణి చాలా ఉంది. మనందరం గొంతు కలిపి ఆర్థికాభివృద్ధికి చేతులు కలిపి వాస్తవాల ఆధారంగా ప్రజలకు మార్గం చూపే ప్రయత్నం చేయాలి. దీనిలో కొన్ని సందర్భాల్లో ఇబ్బందులు ఉన్నాయి. ఎందుకంటే అందరూ ఒక దారిన పోతుంటే మనం వాస్తవం ఏదో ఆ దారిన పోవడం తేలికైన విషయం కాదు. నాకు ఆ విషయంలో చాలా అనుభవం

ఉంది. దీర్ఘకాలం గురించి ఆలోచించాలి కానీ, ఇవాళ చప్పట్లు కోసం మనం ఆలోచించకూడదు. రెండోది.. రాష్ట్రాలు, జాతీయ స్థాయిలో కొంతమేరకు ఆర్థిక క్రమశిక్షణ లోపించినప్పుడు శ్రీలంకలో ఏమైందో మనం చూశాం. ఎట్టి పరిస్థితుల్లోనూ మన రాష్ట్రాల్లో, జాతీయ స్థాయిలో ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే కొన్ని కట్టుబాట్లు మనం చేసుకోవాలి. ఎప్పుడైతే స్వయం క్రమశిక్షణ లేదో, మన క్రమశిక్షణను అంతర్గతంగా పాటించడం లేదో అప్పుడు బయట నుంచి కొన్ని సంస్థాగత ఏర్పాట్లు కావాలి. అది లేకపోతే మనం చెప్పే మాటలన్నీ అనవసరం. శ్రీలంక వెళ్లి దేశంలో ప్రజాస్వామ్యం అంటే వాడు చెప్పుతో కొడతాడు..నాకు పెట్రోలు దొరకడం లేదు..ఇంట్లో గ్యాస్ లేదు..కరెంటు లేకుండా ఉంటే దేశం గురించి, ప్రజాస్వామ్యం గురించి ఏం మాట్లాడుతున్నావు.. నువ్వు అంటాడు. ముందు మనుగడ కదా కావాల్సింది. ఆ పరిస్థితి రాకుండా కాపాడుకోవాలి. దానికి మన సర్వశక్తుల్ని కాపాడుకోవాలి. ఇవన్నీ పక్కన పెట్టేస్తే, ఇవాళ విద్యా, ఆరోగ్యం. విద్యకు మంచి విధానం ఉంది. అమలు కావాలి. ఆరోగ్యరంగానికి చాలా తక్కువ ఖర్చు పెడుతున్నాం. అవగాహన లేదు. జేబులోనుంచి ఖర్చు పెడుతూ కోటానుకోట్ల మంది బీదరికంలోకి జారిపోతున్నారు. మూడోది.. చట్టబద్ధ పాలన. ప్రజాస్వామ్య దేశాల్లో చట్టబద్ధ పాలన మన కన్నా అధ్వానంగా కొన్ని దేశాలు మాత్రమే ఉన్నాయి. పాకిస్తాన్‌లో అలా ఉంటుంది. అధికారంలో ఉంటే పూజిస్తారు. అధికారం పోతే తలకాయ తీసేస్తారు..మనం ఇంకా ఆ స్థాయికి రాలేదు. అది కాదు మనకు కావాల్సింది. కచ్చితంగా చట్టబద్ధ పాలన కావాలి. పోలీసు, న్యాయవ్యవస్థపై నమ్మకం పెరగాలి. మన మహిళలకు భద్రత కలగాలి. వేగంగా సకాలంలో నిష్పక్షపాతంగా న్యాయం అందాలి. చట్టం అందరినీ సమానంగా వాస్తవ రూపంలో అందాలి. ఇది చట్టబద్ధ పాలన. మనం దానికి చాలా వేల మైళ్ల దూరంలో ఉన్నాం. అది లేకపోతే ఈ దేశ భవిష్యత్తు చాలా గందరగోళంలో పడుతుంది. ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది. అంతకు మించి ప్రజలు డబ్బున్న వాడు ఒక రకంగా డబ్బు లేనోడు ఒక రకంగా, పదవి ఉంటే ఒక రకంగా, పదవి లేకుంటే ఒక రకంగా, అగ్రకులం వాళ్లంటే ఒక రకంగా, బీద కులం ఇంకో రకంగా ఉంటే ఇంకేమి సమాజం ఇది. మౌలికమైన విషయం చట్టబద్ధ పాలన. దాని గురించి ఎవరూ మాట్లాడటం లేదు. మోదీ గారు నామీద దండెత్తారు అంటున్నారు తప్ప..దండెత్తే అవసరం లేకుండా చేయడం ఎలా అనడం లేదు. నేనొస్తే రేపు నేను దండెత్తుతా అంటున్నారు. ఓ నువ్వు అలా చేశావా, రేపు మేమూ వస్తాం.. మేము తీస్తం కదా నీ మీద అస్త్రం అంటున్నారు. ఇది కాదు దేశాన్ని మార్చే తీరు. చట్టబద్ధ పాలన ఉంటే మోదీ కాదు ఎవరు వచ్చినా ఏమీ లేయలేరు. అలాంటి వ్యవస్థను నిర్మాణం చేసుకోవాలి. తర్వాతది అధికార వికేంద్రీకరణ. గతంలో కోటి సంతకాల సేకరణ చేపట్టాం. దాన్ని కొంత వినూత్నరూపంలో తీసుకురావాలి. పట్టణ ప్రాంతాల నుంచి రావాలి. ఎందుకంటే గ్రామాలను నిర్వీర్యం చేసి పారేశాం. గ్రామాల నుంచి నాయకత్వం లేకుండా చేశాం. గ్రామాల్లో శక్తి ఉన్నవారు, చదువు ఉన్నవారు, కొంత పనికొచ్చే వారు అంతా పట్టణాలకు వలస రావడం అనివార్యమైంది. గ్రామాల్లో ఆర్థిక వ్యవస్థ అంతా కుప్పకూలిపోయింది. గ్రామాల్లో ఏమైనా ప్రజలు పొరపాటున తెలివి తెచ్చుకుంటారేమోనని అటు సారాయితో పార్టీలుగా చీల్చి మనుష్యుల మధ్య తగాదాలు పెట్టేశాం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుపడాలంటే చిన్న పట్టణాలు పెరగాలి. కోవిడ్ సమయంలో మనం చూశాం. లాక్‌డౌన్ పెడితే ఎంతో మంది నడుచుకుంటు పట్టణాల నుంచి గ్రామాలకు వెళ్లారు. నగరీకరణ అనివార్యం కానీ చిన్న చిన్న నైపుణ్యాలతో అందరూ నగరాలకు వలసరావాల్సిన అవసరం లేదు. మౌలిక సదుపాయాలు కలిగి పక్కనే చిన్న పట్టణాలకు వెళ్ళొచ్చు. అయితే నగరానికి వలస వచ్చే వారికి మౌలిక సదుపాయాలు కల్పించాలి. లేకపోతే కోవిడ్ టైమ్‌లో మనం చూసిన పరిస్థితే ఉత్పన్నం అవుతుంది. ఇవన్నీ కాకుండా సమయం సందర్భాన్ని బట్టి రాజకీయ పార్టీలను మార్చాలి. ఈ రోజు చాలా పార్టీలు ప్రైవేటు ఆస్తులుగా మారిపోయాయి. నిసిగ్గుగా మనం చెప్పాలి. ఉన్నంతలో కొద్దిగా పార్టీగా బీజేపీ ఉంది కాబట్టి పోటీ లేకుండా పోయింది. పార్టీ వ్యవస్థను సంస్కరించడానికి చట్టబద్ధమైన ఏర్పాట్లు కావాలి. ఇది ఒకటి రెండు రోజుల్లో జరగదు. ఎప్పుడొస్తుందో ఆ కాలం అప్పటి వరకు వేచి ఉండి ప్రజల్లో ఆలోచన తీసుకురావాలి. ఎన్నికల వ్యవస్థ మారాలి. ఓట్ల కొనుగోలు ఆగాలి. కాబట్టి ఎజెండా చాలా స్పష్టమైంది ఉంది. ప్రాధాన్యతల విషయంలో ఎన్నికల వ్యవస్థ నుంచి మొదలు పెట్టకుండా..నేను తీసుకునేది జనం జీవితాల్ని ప్రభావితం చేసే అంశాల్ని. వచ్చే 25 ఏళ్లలో అటు ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవాలి..సమాజాన్ని కాపాడుకోవాలి. శక్తిని పెంచాలి. ఎదిగే అవకాశాల్ని కల్పించాలి. అది సాధ్యం నేను పూర్తిగా నమ్ముతున్నాను. ఆ వనరులు మనకు ఉన్నాయి. రానున్న తరాల కోసం కొద్దిపాటి త్యాగం చేయాలి. చైనా ప్రజలు అలా త్యాగాలు చేశారు. అందుకే అమెరికా లాంటి దేశాలను సైతం ఈ రోజు చైనా గడగడలాడిస్తోంది. మంచో చెడో పక్కన పెట్టండి. మన దేశం ఆ రకమైన స్టెప్ తీసుకోగలదా? ఎందుకంటే మనకు ఆ బలం రాలేదు. అది రానప్పుడు పేదవాని కోపం పెదవికి చేటు. చైనా చేస్తున్న పనిలో దుందుడుకుతనం ఉంది. అది చేయాలని నేను అనడం లేదు. కానీ ముందు ఆ స్థాయికి చేరుకోవాలి. చైనా అంటే గడగడలాడుతున్నారు. మనం దరిదాపుల్లో కూడా లేము. కచ్చితంగా ఆ స్థాయికి రాగలం. అంతకు మించి ఈ దేశంలో ప్రజల జీవితాల్ని మార్చగలం. ఈ 25 ఏళ్లు నా దృష్టిలో కీలకం. ఆనాటికి మా తరంలో చాలామంది దాదాపు ఉండం. ఉన్నా కూడా మేం పూర్తిగా వయసుడిగిన వాళ్లం అవుతాం. కానీ ఈ 25 ఏళ్లలో దేశం నూటికి నూరు శాతం బాగుపడుతుందనే నమ్మకం నాకు ఉంది.


(ఇంకా ఉంది...)

(గత సంచిక తరువాయి)

# అందరికీ ఆరోగ్యానికి ఆచరణసాధ్య నమూనా

**సమర్థవంతం / అందుబాటు / అతి తక్కువ వ్యయం**

**జులై 2021** (తెలుగులో స్థూల అనువాదం)



**(గమనిక: ప్రజలపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా భారతదేశంలో అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని జీడీపీలో అతి తక్కువ వ్యయంతో అందించేందుకు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) ఇంగ్లీషులో రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానానికి స్థూలంగా తెలుగులో చేసిన అనువాదమిది. ఇందులో పట్టికలు, గణాంక పటాలు, అనెగ్జర్ల వివరాలుండవు. ఆరోగ్య విధానంపై రూపొందించిన పుస్తకంలో పూర్తి సమాచారం ఉంటుంది)**

నాణ్యమైన సేవలను అందించటంలో ప్రయివేటు రంగంతో పోటీపడేందుకు ప్రభుత్వ బోధనాస్పత్రులను, జిల్లా ఆస్పత్రులను గణనీయంగా మెరుగుపరిచి వరుసగా మొదటి అంచె, రెండవ అంచె (టయర్ 1, టయర్ 2) తృతీయ స్థాయి వైద్య సేవల కేంద్రాలుగా మార్చటం తప్పనిసరి. ఇదే సమయంలో ఉప-జిల్లా ఆస్పత్రులను, సి.హెచ్.సిలను మెరుగైన మౌలిక పద్ధతులు, నైపుణ్యాలు, పరికరాలతో బలోపేతం చేయాలి. అందించిన సేవలకు ఆదాయం లభించే నేపథ్యంలో, ద్వితీయ సేవల వైద్యుల అవసరాలకు తగ్గట్లు, ప్రయివేటు ఆర్థిక చొరవతో ఈ ఆస్పత్రులకు సాధనాసంపత్తిని సమకూర్చి, ఖరీదైన డయాగ్నొస్టిక్‌లను ఉమ్మడి వినియోగంలోకి తేవటం ఎంతో సులభంగానే సాధ్యం. ఒక్కసారి ఇది పూర్తయితే, ద్వితీయ స్థాయి సేవల్లో పోటీ, ఎంపిక ఆధారిత ఉమ్మడి నష్ట నివారణ భర్తీ నమూనాను ఉప-జిల్లా ఆస్పత్రులు, సి.హెచ్.సిలు, చిన్న ప్రయివేటు నర్సింగ్ హోంలలో పూర్తిస్థాయిలో అమలు చేయవచ్చు, జిల్లా, బోధనాస్పత్రులు ఎక్కువగా తృతీయ స్థాయి సమస్యల మీదే దృష్టి పెట్టే వెసులుబాటు కల్పించవచ్చు. సాంక్రమిక వ్యాధుల్లో తగ్గుదల, జనాభా పరివర్తన, ఎన్.సి.డిల విస్తరణలో పెరుగుదల వల్ల తృతీయ దశ వైద్యావసరాలు క్రమంగా పెరుగుతాయి. డయాబెటిస్, రక్తపోటు, గుండెజబ్బు, దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి, ఊపిరితిత్తుల వ్యాధి, ఆటోఇమ్యూన్ రుగ్మతలతో ద్వితీయ స్థాయి సమస్యలు కూడా తృతీయ దశ సవాళ్లుగా పరిణమించవచ్చు. కాబట్టి, బలమైన, సమర్థవంతమైన, వనరుల్ని సద్వినియోగం చేసే తృతీయ స్థాయి వ్యవస్థను ప్రభుత్వరంగంలో ఏర్పరచుకోవటం ఎంతో ముఖ్యం.

ఉమ్మడి నష్ట నివారణ భర్తీ (రిస్క్ పూలింగ్) పద్ధతుల నుండి తృతీయ స్థాయి చికిత్సలని మినహాయించటం, ఈ సేవల్ని ప్రభుత్వ సదుపాయాలలో అందించటం ఖజానా పరంగా మెరుగైన విధానం. ఎందుకంటే, ప్రభుత్వమే సేవలను అందించటం.. ప్రోత్సాహకాలను మార్చి, వైద్య నియమాలు, సదుపాయాల్లో వనరుల సమీకరణ సహేతుకంగా అమలయ్యేందుకు దోహదం చేస్తుంది. ఒక్కో పడకపై వ్యయం పెంపు, సేవలు, జవాబుదారీతనాన్ని మెరుగ్గా బేరీజు వేయటం, మౌలిక వసతుల నిర్మాణానికి వినూత్న రీతి ప్రయివేటు భాగస్వామ్యం, ప్రతిభ ఉన్న వైద్యులకు ప్రభుత్వాస్పత్రుల్లో ప్రాక్టీస్‌కి ప్రోత్సాహకాలు.. ఈ చర్యలు ప్రభుత్వ తృతీయ స్థాయి సేవలను ఓ మోస్తరు ఖర్చుతోనే గణనీయంగా మెరుగుపరుస్తాయి. ఒక్కసారి ప్రభుత్వ తృతీయ స్థాయి ఆస్పత్రుల్లో వ్యవస్థ మెరుగుపడి, ఓ.ఓ.పి.ఇ గణనీయంగా తగ్గితే.. ఆస్పత్రుల్లో చేరిన వారికి

రోజుకు రూ.300-500 నామమాత్రపు రుసుమును తీసుకోవచ్చు. రోగులకు ప్రశ్నించే శక్తినివ్వటానికి, అవసరమైతే తప్ప ఆస్పత్రుల్లో కొనసాగకుండా చేసేందుకు, జవాబుదారీ తనం అమలుకు ఇది మార్గంగా ఉపయోగపడుతుంది. మొదటి వైద్య సంప్రదింపు స్థానంగా ప్రాథమిక ఆరోగ్య సదుపాయం, పటిష్ఠమైన, సమర్థవంతమైన ద్వితీయ స్థాయి సేవలతో రెఫరల్ ఆధారిత వ్యవస్థ.. ఈ ఆస్పత్రులపై భారాన్ని తగ్గించి తృతీయ స్థాయి సేవల్లో నాణ్యతకు హామీ ఇస్తాయి. సేవల స్థాయిలో స్పష్టతతో, అందరికీ సేవల వర్తింపుతో ఏర్పాటయ్యే అటువంటి ఆస్పత్రి సేవల వ్యవస్థ, వనరుల మెరుగైన కేటాయింపుతో ఖర్చుల్ని గణనీయంగా తగ్గించి సేవలనాణ్యతా ప్రమాణాల మెరుగుదలకు దారి తీస్తుంది.

ఈ సమగ్ర ఆరోగ్య సంరక్షణ నమూనా ప్రజల ఆరోగ్య రికార్డుల సేకరణ, నిర్వహణను కూడా చేస్తుంది. పటిష్ఠమైన ఆరోగ్య సమాచార వ్యవస్థ, డిజిటల్ ఆరోగ్య రికార్డులు, తగిన గోప్యతా రక్షణలతో ఆరోగ్య సేవల్లో సమర్థతను పెంచటమే కాకుండా - వ్యక్తిగత స్థాయిలో సేవలు ఆగకుండా సజావుగా సాగేలా, సమయం ఆదా అయ్యేలా, వృధాని తగ్గించేలా, ఖర్చుల్ని తగ్గించేలా చేస్తుంది. ఇదే సమయంలో జాతీయ స్థాయిలో వ్యాధుల పర్యవేక్షణకు, మహమ్మారుల్ని ఎదుర్కోవటానికి, క్లినికల్ పరిశోధన అభివృద్ధికి, వాస్తవ ఫలితాల ఆధారంగా విధాన రూపకల్పనకు దోహదం చేస్తుంది.

ఆరోగ్య వ్యవస్థలో జవాబుదారీతనం అమలుకు వ్యవస్థల్ని అభివృద్ధి చేయటం ముఖ్యం. దేశంలో ఆరోగ్య సేవలు సమర్థవంతంగా అందేలా మూడంచెల వ్యవస్థను - కమ్యూనిటీ స్థాయిలో ప్రాంతీయ ఆరోగ్య బోర్డులు, జిల్లా ఆరోగ్య బోర్డులు, రాష్ట్ర ఆరోగ్య బోర్డులను- ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. అటువంటి సంస్థలు పి.హెచ్.సిల వంటి ప్రభుత్వ సదుపాయాల పనితీరుని సమర్థవంతంగా పర్యవేక్షిస్తాయి, ఎఫ్.పి వ్యవస్థను, ద్వితీయ స్థాయి సేవలను పర్యవేక్షిస్తాయి, ఆరోగ్య సంరక్షణపై ఆర్థిక వ్యయాన్ని, బడ్జెట్ వినియోగాన్ని సమీక్షిస్తాయి, క్షేత్రస్థాయిలో ఆరోగ్య కలాపాలను పరిశీలిస్తాయి, మొత్తం రోగుల డేటాను పర్యవేక్షిస్తాయి.

మొత్తం మూడంచెల ఆరోగ్య సేవల్లో మూడేళ్లకు ప్రతిపాదిత సిఫార్సులకు మొత్తంగా అయ్యే వ్యయాన్ని పట్టిక 7.1 తెలియచేస్తుంది.

**(పట్టిక 7.1: ప్రతిపాదిత సిఫార్సుల మొత్తం ఖర్చు)**

ప్రస్తుతం ఆరోగ్యంపై యూనియన్, రాష్ట్రాలు రెండూ కలిపి ప్రభుత్వపరంగా చేస్తున్న వ్యయం జి.డి.పిలో ఒక శాతం (1%) కంటే కొంచెం ఎక్కువ. మూడు స్థాయిల ఆరోగ్య సేవలలో మనం సిఫార్సు చేస్తున్న వైద్య ప్రక్రియల మొత్తం ఖర్చు సుమారు రూ.90,000 కోట్లు. ఇది జి.డి.పిలో సుమారు 0.5 శాతం. ఈ సిఫార్సుల అమలుకు అదనపు వ్యయంతో పాటు ప్రస్తుతం యూనియన్, రాష్ట్రాలు చేస్తున్న ఆరోగ్య వ్యయాన్ని పునర్నిర్మించటం కూడా అవసరం. ప్రస్తుత వ్యయంలో కొంత భాగాన్ని ఈ నమూనాలోని ప్రతిపాదనల అమలుకు మళ్లించాల్సి రావొచ్చు. అయితే, అవసరమైన మొత్తం ఖర్చుని ప్రస్తుత ఆరోగ్య వ్యయానికి అదనంగా ఇచ్చినా కూడా, ఖజానాపై పడే భారం చాలా తక్కువ. నిజానికి, ఆరోగ్య వ్యయాన్ని ఓ మోస్తరుగా జి.డి.పిలో మూడు శాతానికి (3%) పెంచినా కూడా ఓ.ఓ.పి.ఇ గణనీయంగా తగ్గి 60 శాతం నుండి 30 శాతం అవు తుందని ఆర్థిక సర్వే 2020-21 వాదించింది. ఈ పత్రంలో ప్రతిపాదించిన నమూనా ఒక ఆచరణ సాధ్యమైన, సమర్థవంతమైన, సుస్థిరమైన, అందుబాటులో ఉండే ఆరోగ్య వ్యవస్థను అందిస్తూనే, ప్రభుత్వ ఖజానాపై అదనపు భారాన్ని, అది కూడా ఎంతో తక్కువగా జి.డి.పిలో 0.5 శాతాన్ని మాత్రమే మోపుతోంది.

ఒక్కసారి అమల్లోకి వస్తే, జాతీయ స్థాయిలోని, రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు రెండూ ఆరోగ్యంపై చేసే వ్యయం జి.డి.పిలో రెండు (2%) లోపు ఉంటుంది (ప్రస్తుత స్థాయి కంటే 0.5 శాతం అదనం). అయినా కూడా ప్రపంచంలో అన్ని గణనీయ ఆర్థిక వ్యవస్థల్లో ప్రభుత్వ వ్యయం కంటే అది అతి తక్కువ. అంతర్యుద్ధంతో ఛిన్నాభిన్నమైన, కలహాలతో కల్లోలభరితమైన దేశాలు మాత్రమే.. ప్రభుత్వం నిధులిచ్చే ఆరోగ్య రంగానికి రెండు శాతం (2%) లోపు ఖర్చు చేస్తున్నాయి. జి.డి.పిలో 1.92 శాతం ఖర్చుతో మలేషియా, జి.డి.పిలో 1.42 శాతంతో ఇండొనేషియా మాత్రమే ఈ విషయంలో మినహాయింపులుగా ఉన్నాయి. మలేషియా, ఇండొనేషియాల్లో కూడా ప్రభుత్వ ఆరోగ్య వ్యయం జి.డి.పిలో రెండు (2%) కంటే తక్కువ ఉన్నప్పటికీ, ప్రభుత్వం సి.హెచ్.ఇలో దాదాపు 50 శాతం ఖర్చు చేస్తోంది (అధ్యాయం 1లో పట్టిక 1.2ను పరిశీలించండి). ఇంకా ఎక్కువ నిధుల అవసరం ఉంది, ఎక్కువ ఖర్చు చేస్తే స్వాగతించాల్సిందే. కానీ మన వనరుల పరిమితి దృష్ట్యా, రాబోయే కొంతకాలంపాటు భారత జి.డి.పిలో మూడు నుండి నాలుగు శాతం వెచ్చించగలిగే అవకాశం లేదు. మన మౌలిక వసతులు, బలాలపై నిర్మితమవుతున్న ఈ పత్రంలోని ప్రతిపాదనలు పరిమిత వ్యయంతో కూడినవి, అందుబాటు ఖర్చులోనివి, వ్యయానికి తగ్గ ఫలితాన్నిచ్చేవి, అతి తక్కువ అంతరాయంతో సాధించగలిగినవి.

(ఇంకా ఉంది...)

# జాతీయ లెజిస్లేచర్ల సదస్సుకు సన్నాహక కార్యక్రమాలు



మన దేశ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయటానికి జూన్ 15, 16, 17, 18న ముంబయిలో నిర్వహించనున్న మొదటి జాతీయ లెజిస్లేచర్ల సదస్సు (ఎన్ఎల్సీ) సదస్సుకు సన్నాహకంగా ముంబయి జియో కన్వెన్షన్ సెంటర్‌లో మార్చిలో నిర్వహించిన మూడవ విజనింగ్ సమావేశంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పాల్గొని పలు అంశాలను వివరించారు. అంతకుముందు డిసెంబర్ 2022లో పూణెలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో కూడా జేపీ దిశానిర్దేశం చేశారు. ఎన్ఎల్సీ వేదికగా అన్ని రాష్ట్రాల శాసనసభ, మండలి సభ్యులు, స్పీకర్లు, చైర్మన్లు భారత ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న సమస్యలు, అవరోధాలపై చర్చించి పరిష్కారాలు ప్రతిపాదిస్తారు.











RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th April, 2023 Posting Date 15 &16th of every month





# చిన్న పట్టణాలు - ప్రజారోగ్య, వైద్య సేవలు

ప్రధానమంత్రి జనారోగ్య యోజన (పీఎంజేఏవై) పేరుతో ప్రపంచంలోనే అతి పెద్ద ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేస్తున్నా, ఆరోగ్యశ్రీ వంటి పథకాలున్నా అనారోగ్యం వస్తే ప్రజలు సొంతంగా చేస్తున్న ఖర్చు ఇప్పటికీ మన దేశంలో ప్రపంచ సగటు కంటే మూడు నాలుగు రెట్లు ఎక్కువ. మన దేశంలో ప్రజలు అప్పుల పాలవటానికి, పేదలుగా మారటానికి ఆరోగ్య రంగంలో ప్రభుత్వాల వైఫల్యం పెద్ద కారణం. ఆరోగ్య విధానంలో మనం గందరగోళానికి లోనై గుడ్డిగా అమెరికాను అనుసరించకుండా.. మన దేశానికున్న బలాల్ని విజ్ఞతతో వినియోగించుకుంటూ తక్కువ ఖర్చుతో అందరికీ నాణ్యమైన వైద్యం అందించే ఏర్పాటు చేయాలి. ఇందులో భాగంగా ప్రజారోగ్య పరిరక్షణ, నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలకు చిన్న పట్టణాల మీద ఎక్కువ దృష్టి పెట్టాలి. గ్రామీణ ప్రజల రోజువారీ పనులకు కేంద్రంగా ఉండే చిన్న పట్టణాల్లో స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేసి రక్షిత మంచినీరు, పారిశుద్ధ్యం, సాంప్రదాయేతర ఇంధన వనరులు, మౌలిక వసతులతో ప్రజారోగ్యానికి అవసరమైన పటిష్ఠ చర్యలు తీసుకోవాలి. ప్రాథమిక వైద్యం కోసం ఫ్యామిలీ డాక్టర్‌ల బృందంతో తగిన వ్యవస్థను ఏర్పాటు చేయాలి. అక్కడే ల్యాబొరేటరీ, ఔషధశాలను కూడా అందుబాటులోకి తేవాలి. ఈ ఖర్చులన్నీ ప్రభుత్వమే భరించాలి. అయితే, ప్రజలు తమకు నచ్చిన డాక్టర్‌ని ఎంపిక చేసుకునే అవకాశం కల్పించి, రోగుల సంఖ్యను బట్టి డాక్టర్‌కి ఫీజు చెల్లించే ఏర్పాటు చేయాలి. ప్రజారోగ్యం స్థాయి నుండి ఈ రకమైన ఏర్పాటు వల్ల క్రమంగా ప్రాథమిక వైద్యం పటిష్ఠమై ఆరోగ్య రంగం గణనీయంగా మెరుగుపడుతుంది. ఫ్యామిలీ డాక్టర్ వద్దే రికార్డుల నిర్వహణ, అక్కడి నుంచే ఆస్పత్రి స్థాయి సేవలకు రెఫరల్ వల్ల వ్యాధుల నివారణ, నియంత్రణ, విశ్వసనీయ వైద్యం అందరికీ అందించటం సాధ్యమవుతుంది. కేవలం ఇన్సూరెన్స్ చుట్టూ తిరిగితే మన దేశ పరిస్థితుల్లో అవినీతి, అసమర్థ సేవలతో ఏటా వేల కోట్ల ప్రజాధనం వృధా కావటం తప్ప ప్రజలకు ఆరోగ్యం అందదు. ప్రజారోగ్యం, వైద్యం పట్ల ప్రభుత్వం తన బాధ్యతల విషయంలో సమగ్ర ఆలోచన చేయాలి. ఒకపక్క ప్రయివేటు ఆస్పత్రులతో మెడికల్ టూరిజాన్ని ప్రోత్సహిస్తూనే, మరోపక్క చిన్న పట్టణాల అభివృద్ధి, ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ, ప్రభుత్వ ఇన్సూరెన్స్ పథకాలను ద్వితీయ స్థాయి వైద్యానికి పరిమితం చేయటం, తృతీయ స్థాయిలో ప్రభుత్వ ఆస్పత్రుల ఆధునికీకరణలతో ప్రజలందరికీ ఉచితంగా నాణ్యమైన ఆరోగ్యం అందించే ఏర్పాటు చేయటం ప్రభుత్వ విధానం కావాలి.

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,

ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**